www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
బుధవారం | 21-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 21 సంచిక (Issue) : 324
శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం; తిథి: ద్వాదశి ఉ. 11.29 తదుపరి త్రయోదశి; నక్షత్రం: పునర్వసు మ. 2.19 తదుపరి పుష్యమి వర్జ్యం: రా. 11.07-12.53; దుర్ముహూర్తం: మ. 12.06-12.53; అమృతఘడియలు: ఉ. 11.42-1.26; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.43; సూర్యాస్తమయం: 6.16 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

జగజ్యోతి ఆస్తులు రూ. 15కోట్లపైనే

అక్రమ సంపాదనంతా నగల రూపంలోకి

పట్టుబడ్డ బంగారం విలువ 1.51కోట్లకుపైనే

ఇంట్లో ఎక్కడపడితే అక్కడ నోట్ల కట్టల గుర్తింపు

రూ.65.50 లక్షలను స్వాధీనం చేసుకున్న ఏసీబీ

ఏపీ, హైదరాబాద్‌లో స్థలాలున్నట్లు గుర్తింపు

జగజ్యోతికి 14 రోజుల రిమాండ్.. నేడు జైలుకు

14



అధికారులు స్వాధీనం చేసుకున్న ఆభరణాలు

అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి!



ఆ పార్టీ ఆరు గ్యారెంటీలను అమలు చేయదు

రాహుల్ హామీలను సోనియానే నమ్మదు

పీవీకి భారతరత్నను కాంగ్రెస్ జీర్ణించుకోవట్లే

తెలంగాణలో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు కల్ల

కేంద్రంలో మూడోసారీ మాదే అధికారం

భైంసాలో అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ

రాష్ట్రంలో మా పొత్తు ప్రజలతోనే: కిషన్‌రెడ్డి

తెలంగాణలో కాంగ్రెస్ సర్కారు నిలబడదు

త్వరలోనే రామరాజ్యం రాబోతోంది: ఏలేటి

కేసీఆర్ వంగి వంగి దండాలు పెట్టి బీజేపీకి నష్టం చేశారు: సంజయ్

బీజేపీ విజయ సంకల్ప యాత్రలు షురూ

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

తెలంగాణలో అబద్ధాలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఆ హామీలను ఎట్టి పరిస్థితుల్లో నెరవేర్చదని చెప్పారు. రెండు నెలల్లోనే ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మడం లేదని తెలిపారు. కాంగ్రెస్ నేత రాహుల్ హామీలను సోనియా కూడా నమ్మడం లేదని ఎద్దేవా చేశారు. బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రలో భాగంగా మంగళవారం నిర్మల్ జిల్లా భైంసాలో నిర్వహించిన బహిరంగ సభకు హిమంత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా విజయ సంకల్ప యాత్రల ప్రారంభోత్సవంలో పలువురు కేంద్ర మంత్రులు, సీఎంలు, రాష్ట్ర నాయకులు పాల్గొని ప్రసంగించారు. భైంసా సభలో హిమంత మాట్లాడుతూ.. బూటకపు హామీలు ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని కాంగ్రెస్ నేతలపై ధ్వజమెత్తారు. 6గ్యారెంటీలిచ్చిన కాంగ్రెస్.. ఇప్పటి వరకు ఎన్ని అమలు చేసిందని ప్రశ్నించారు. డిసెంబరులోనే 2 లక్షల ఉద్యోగాలకు జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని రాహుల్ చెప్పారని.. ఎంత మందికి ఉద్యోగాలిచ్చారని నిలదీశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు పెట్టుకుంటుందన్న ప్రచారం వెనక కాంగ్రెస్ ఉందని ఆరోపించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ

మిగతా 12వ పేజీలో...



భైంసాలో విజయ సంకల్ప యాత్రలో పాల్గొన్న అసోం సీఎం హిమంత బిశ్వ శర్మ, లక్ష్మణ్, ఇతర నేతలు



ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థే విజేత

చండీగఢ్ మేయర్ కుల్‌దీప్ కుమార్

సుప్రీం కోర్టు సంచలన తీర్పు

రిటర్నింగ్ అధికారి అనిల్ మాసిహ్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశం

కోర్టు గదిలో ఓట్ల లెక్కింపు..

దేశ చరిత్రలోనే తొలిసారి

ప్రజాస్వామ్యాన్ని కాపాడిన సుప్రీం: ఆప్

బీజేపీ నిర్వాకం బట్టబయలు: కాంగ్రెస్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): చండీగఢ్ మేయర్ ఎన్నికల్లో ఆప్-కాంగ్రెస్ కూటమి అభ్యర్థి కుల్‌దీప్ కుమార్‌ను 'చట్టపరంగా విజేత' అని సుప్రీంకోర్టు ప్రకటించింది. రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన బీజేపీ నేత అనిల్ మాసిహ్ ఈ ఎన్నికల్లో తీవ్రమైన అక్రమాలకు పాల్పడినట్టు గుర్తించిన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆయనపై విచారణకు ఆదేశించింది. ఎన్నికల ప్రక్రియ మొత్తాన్నీ తాము కొట్టివేయడంలేదని, కుల్‌దీప్ కుమార్‌కు అనుకూలంగా వచ్చిన ఓట్లలో ఎనిమిది ఓట్లను చెల్లకుండా చేస్తూ ఓట్ల లెక్కింపులో పాల్పడిన అక్రమాన్ని సరిచేయడం వరకే పరిమితమయ్యామని ధర్మాసనం స్పష్టం చేసింది. అనిల్ మాసిహ్ ఉద్దేశపూర్వకంగానే ఆ ఎనిమిది బ్యాలెట్ పత్రాలను చెల్లకుండా చేసేందుకు ప్రయత్నించారని

మిగతా 2వ పేజీలో...



కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు భట్టి, కోమటిరెడ్డి

ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగానికి

కేంద్రం పచ్చజెండా

జాతీయ రహదారిగా ప్రకటించేందుకు అంగీకారం

భూసేకరణ, విధానపరమైన ప్రక్రియలు వేగవంతం

200 కోట్ల యుటిలిటీస్ తరలింపు భారం భరిస్తాం: గడ్కరీ

హైదరాబాద్-విజయవాడ ఆరు వరుసలు, హైదరాబాద్-కల్వకుర్తి నాలుగు వరుసలకు అనుమతివ్వండి

రేవంత్ విజ్ఞప్తి.. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్ఆర్ఆర్) దక్షిణ భాగాన్ని జాతీయ రహదారిగా ప్రకటించేందుకు కేంద్రం సానుకూలంగా స్పందించింది. ఆ మేరకు ప్రతిపాదనలను పంపాలని జాతీయ రహదారుల సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) అధికారులను కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆదేశించారు. దీంతో.. చౌటుప్పల్-అమన్‌గల్-షాద్‌నగర్-సంగారెడ్డిని కలుపుతూ 182 కి.మీ. మేర నిర్మించనున్న దక్షిణ ఆర్ఆర్ఆర్ పనులు వేగం పుంజుకోనున్నాయి. ఇప్పటికే ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగాన్ని కేంద్రం జాతీయ రహదారిగా ప్రకటించింది. ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని మర్యాదపూర్వకంగా

మిగతా 13వ పేజీలో...

గెలుపు గుర్రాలపై రేవంత్‌కు స్వేచ్ఛ

లోక్‌సభ అభ్యర్థులను గుర్తించి, ప్రతిపాదించండి

సీఎం రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్

సీట్ల వారీగా కసరత్తును వివరించిన రేవంత్

ఎన్నికల తర్వాతనే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

భట్టితో కలిసి వేణుగోపాల్‌తో సుదీర్ఘ చర్చలు

నేడు కొడంగల్‌లో రేవంత్ పర్యటన

13

సీఎం అయ్యాక తొలిసారి సొంత నియోజకవర్గానికి

4,369 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నేడు గద్దెపైకి సారలమ్మ

తెల్లవారుజాము నుంచే తల్లి కొలువైన కన్నెపల్లిలో కార్యక్రమాలు

సారలమ్మ రాకతో మొదలవనున్న మేడారం మహాజాతర

పగిడిద్దరాజు, గోవిందరాజు కూడా నేటి రాత్రికి గద్దెలపైకి

ఇప్పటికే జనసంద్రంగా మేడారం.. దారులన్నీ అవైపే

జాతర మూడోరోజు, 23న మేడారానికి రేవంత్ రెడ్డి

వరంగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వన దేవతల్లో ఒకరైన సారలమ్మ బుధవారం మేడారం గద్దె మీదకు రానుంది. పగిడిద్దరాజు, గోవిందరాజు కూడా గద్దె మీదకొస్తారు. సారలమ్మ మేడారానికి వేంచేయడంతోనే నాలుగురోజుల మహాజాతరకు తెరలేవనుంది. ఈ మేరకు బుధవారం తెల్లవారుజాము నుంచే సారలమ్మ కొలువైన కన్నెపల్లిలో కార్యక్రమాలు మొదలవుతాయి. పొద్దున్నే సారలమ్మ ఆలయాన్ని శుద్ధి చేసి.. అలికి ముగ్గులతో అలంకరిస్తారు. ప్రధాన పూజారి అయిన కాక సారయ్య పూజలు నిర్వహిస్తారు. సాయంత్రం ఆదివాసీ పూజారులు

మిగతా 3వ పేజీలో...



మేడారంలోని సారలమ్మ గద్దె

రాజ్యసభకు సోనియా ఏకగ్రీవం

నడ్డాతో పాటు, మరో 39 మంది కూడా

అత్యధికంగా బీజేపీ ఖాతాలో 20 సీట్లు

ఆరు స్థానాల్లో కాంగ్రెస్ విజయం 2

రాజ్యసభకు రేణుక, అనిల్ కుమార్, వద్దిరాజు రవిచంద్ర ఎన్నిక

ఏపీ నుంచి ముగ్గురు వైసీపీ అభ్యర్థులు



దేశంలోనే పొడవైన రైలు

సొరంగం ప్రారంభం

ఉధంపూర్-బారాముల్లా మార్గంలో 12.77 కిలోమీటర్ల టన్నెల్

ప్రారంభించిన ప్రధాని మోదీ 2

స్విస్‌ను మరిపించేలా కశ్మీరు!

గొప్ప పర్యాటక ప్రాంతంగా మలుస్తాం

కుటుంబ పాలన నుంచి విముక్తి

రాష్ట్ర ప్రజలతో నేరుగా మమేకం: మోదీ

రూ.32 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

విద్యతోనే ఆర్థికంగా దేశం అగ్రగామి

ఐఐటీ-హెచ్ క్యాంపస్ అభివృద్ధి ప్రాజెక్టు దేశానికి అంకితం చేసిన ప్రధాని

తిరుపతి ఐఐటీ, విశాఖ ఐఐఎం సహా 3 ఐఐటీలు, 3 ఐఐఎంలు కూడా

13,375 కోట్ల పనులకు శంకుస్థాపన

ప్రైవేటులో 83% సిజేరియన్లు!

ప్రతి గంటకూ 11 సర్జరీలు 14

గతంలో 'కోత'లు 78 శాతమే

యాదాద్రి జిల్లాల్లో ఇవి అత్యధికం..

రాష్ట్ర ప్రభుత్వం సీరియస్

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

ఏర్పాట్లపై రాష్ట్రాలవారీగా ఈసీ అధికారుల తుది సమీక్ష 2

ఏప్రిల్-మేలో లోక్‌సభ ఎన్నికలు

కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకూ..

బోర్డు పరీక్షలు ఏటా రెండు సార్లు

'ఎక్కువ మార్కుల'ను ఎంచుకునే చాన్స్

వచ్చే విద్యా సంవత్సరం నుంచే అమలు

ఏడాదిలో బ్యాగుల్లేకుండా పది రోజులు..

2036 ఒలింపిక్స్‌కు బిడ్ వేస్తాం

కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

6 పెద్ద ట్రంకు పెట్టెలు తెండి

మార్చి 6, 7 తేదీల్లో జయలలిత ఆభరణాలు తీసుకెళ్లండి

తమిళనాడు ప్రభుత్వానికి బెంగళూరు కోర్టు సూచన

ఐజీ స్థాయి పోలీసు అధికారి, మీడియా సమక్షంలో అందజేత

బెంగళూరు/చెన్నై, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): అక్రమ ఆస్తుల కేసులో గతంలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత నుంచి స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన కోట్లాది రూపాయల విలువైన ఆభరణాలను తమిళనాడుకు తరలించేందుకు ముహూర్తం ఖరారయింది. బెంగళూరులోని 36వ సిటీ సివిల్ సెషన్స్ కోర్టు

మిగతా 2వ పేజీలో...

మార్చి 9 తర్వాత ఎన్నికల షెడ్యూల్!

» ఏర్పాట్లపై రాష్ట్రాలవారీగా తుది సమీక్ష జరుపుతున్న ఈసీ అధికారులు

» అందుబాటులో ఉండే భద్రతా బలగాలపై ఆరా.. ఏప్రిల్-మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి 9 తర్వాత విడుదలయ్యే అవకాశం ఉంది. ఈ మేరకు ఎన్నికల సంఘం (ఈసీ) అధికారులు రాష్ట్రాల వారీగా పర్యటిస్తూ, ఎన్నికల సన్నద్ధతపై తుది సమీక్ష జరుపుతున్నారు. అందుబాటులో ఉండే భద్రతాబలగాల సంఖ్యపై కూడా సంబంధిత అధికారులతో చర్చిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మార్చి 9 తర్వాత ఈసీ.. ఎన్నికల తేదీలను ప్రకటించవచ్చని ఓ ఇంగ్లిష్ న్యూస్ ఛానల్ వెల్లడించింది. లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్, మే నెలల్లో జరగనున్నాయి. దాంతోపాటు కొన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటిలో జమ్ము కశ్మీర్ కూడా ఉంటుందా? లేదా? అన్నదానిపై ఇంకా ఈసీ నిర్ణయం తీసుకోలేదు. ఈసీ అధికారులు మార్చి 12-13 తేదీల్లో జమ్ముకశ్మీర్‌లో పర్యటించి క్షేత్రస్థాయి పరిస్థితులను అంచనా వేయనున్నట్లు సమాచారం. 2019లో లోక్‌సభ ఎన్నికలు ఏప్రిల్ 11 నుంచి మే 19 వరకూ ఏడు దశల్లో జరిగాయి. ఫలితాలు మే 23న వెలువడ్డాయి. ఈసారీ దాదాపు అదే షెడ్యూల్ ఉండే అవకాశం ఉంది.

ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలు


'ఎక్కువ మార్కుల'ను ఎంచుకునే అవకాశం

» వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలులోకి

» కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడి

రాయ్‌పూర్, ఫిబ్రవరి 20: విద్యార్థులపై భారం తగ్గించేందుకు వచ్చే సంవత్సరం నుంచి రెండుసార్లు బోర్డు పరీక్షలు (10, 12 తరగతులు) నిర్వహించనున్నట్లు కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెల్లడించారు. ఎందులో ఎక్కువ మార్కులు వస్తే దానినే ఎంచుకోవచ్చని తెలిపారు. కొత్త జాతీయ విద్యా విధానం (ఎన్ఈపీ)లో భాగంగా ఏటా రెండుసార్లు బోర్డు పరీక్షలను ప్రతిపాదించిన సంగతిని గుర్తుచేశారు. ఛత్తీస్‌గఢ్‌లో పీఎం శ్రీ (ప్రైమ్ మినిస్టర్ స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకాన్ని ప్రధాన్ ప్రారంభించి మాట్లాడారు. ఏడాదిలో 10 రోజులు విద్యార్థులు బ్యాగులు లేకుండా బడికి వచ్చేలా చూడాలని.. ఆ రోజుల్లో కళలు, సంస్కృతి, క్రీడలు, తదితర కార్యకలాపాల్లో పాల్గొనేలా చేయాలని కోరారు. 2036 ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇచ్చేందుకు బిడ్ దాఖలు చేస్తామని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. పీఎం శ్రీ పథకం కింద రాష్ట్రంలో 211 పాఠశాలలను ఒక్కోదానికి రూ.2 కోట్లు చొప్పున వెచ్చించి హబ్ అండ్ స్పోక్ పద్ధతిలో అప్‌గ్రేడ్ చేయనున్నారు. 'హబ్'గా ఉన్న పాఠశాలను మెంటార్‌గా వ్యవహరిస్తారు. దీని ద్వారా మిగతావాటికి మార్గ నిర్దేశం చేస్తారు. కాగా, కొత్త ఎన్ఈపీని నిరుడు ఆగస్టులో కేంద్రం ప్రకటించింది. రెండుసార్లు బోర్డు పరీక్షల నిర్వహణ ద్వారా విద్యార్థులు సన్నద్ధమయ్యేందుకు సమయం దొరుకుతుందని.. మంచి మార్కులు సాధించేందుకు వీలు కలుగుతుందని తెలిపింది.

లోకం తీరు



విద్యాలయాల అభివృద్ధితో పురోగతిలోకి దేశం

» విద్యతోనే ఆర్థికంగా దేశం అగ్రగామి: మోదీ

» ఐఐటీ-హెచ్ క్యాంపస్ అభివృద్ధి ప్రాజెక్టు దేశానికి అంకితం

హైదరాబాద్, పాలమూరు యూనివర్సిటీ, నిజామాబాద్, ఫిబ్రవరి 20: విద్యాలయాలను బలోపేతం చేస్తే దేశం మరింత పురోగతి సాధిస్తుందని, ఆర్థిక రంగంలో భారత్‌ను ప్రపంచదేశాల్లో అగ్రగామిగా నిలిపేందుకు అది తోడ్పడుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) హైదరాబాద్ క్యాంపస్ అభివృద్ధి ప్రాజెక్టును జమ్మూ నుంచి మోదీ మంగళవారం ఆన్‌లైన్ ద్వారా జాతికి అంకితం చేశారు. ఐఐటీ-హెచ్ క్యాంపస్‌లో వివిధ శాఖలకు అధునాతన భవనాలు, హాస్టళ్లు, లైబ్రరీ తదితర వసతులు ఈ ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి. విశాఖపట్నం, బోధ్‌గయ, జమ్మూలో నిర్మాణం పూర్తిచేసుకున్న ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)లను కూడా ప్రధాని ప్రారంభించారు. అలాగే ఐఐటీ-తిరుపతి, ఐఐటీ-బిలాయ్, ఐఐటీ-జమ్మూ క్యాంపస్‌లను జాతికి అంకితం చేశారు. ఇక నిజామాబాద్‌లో కేంద్రీయ విద్యాలయం (కేవీ) సహా దేశవ్యాప్తగా 20 కేవీలను, 13 నవోదయా స్కూళ్లను ప్రారంభించారు. వివిధ విద్యాసంస్థలు, పీఎం-ఉష కింద పాలమూరు యూనివర్సిటీ అభివృద్ధి పనులు సహా దేశవ్యాప్తంగా వివిధ విద్యాసంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం శంకుస్థాపన చేశారు. ఇవన్నీ రూ.13,375 కోట్ల విలువైన పనులు!! వీటిలో తిరుపతి జిల్లాలో ఐఐటీతో పాటు ఐసర్, శ్రీసిటీ, ట్రిపుల్ ఐటీలనూ మోదీ జాతికి అంకితమిచ్చారు. జమ్మూలోని మౌలానా ఆజాద్ స్టేడియంలో జరిగిన సభలో మోదీ మాట్లాడారు. ఇప్పుడున్నట్లుగా విద్యారంగంలో పురోభివృద్ధి, నైపుణ్యాభివృద్ధి పదేళ్ల క్రితం లేదని.. అయితే ఇప్పుడున్నది ఆధునిక భారతమని, తమ ప్రభుత్వం ప్రస్తుత, భావితరాలను దృష్టిలోపెట్టుకొని ఆధునిక విద్యకోసం భారీగా వ్యయం చేస్తోందని చెప్పారు.

ఐఐటీ -హెచ్ అత్యున్నత విద్యాసంస్థల్లో ఒకటి: గవర్నర్

ఐఐటీ-హెచ్ క్యాంపస్ అభివృద్ధి ప్రాజెక్టును మోదీ జమ్మూ నుంచి జాతికి అంకితం చేసిన సందర్భంగా గవర్నర్ తమిళిసై హైదరాబాద్ నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యాలయాలను అభివృద్ధి చేస్తే భావితరాల వారు చైతన్యవంతులై దేశాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళ్లగలుగుతారని పేర్కొన్నారు. ఐఐటీ-హెచ్ అభివృద్ధిలో భాగస్వాములు కావడం పట్ల భారత్‌లో జపాన్ దౌత్యవేత్త సుజుకి హిరోషి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. శాస్త్ర పరిశోధనా రంగాల్లో భారత్-జపాన్‌ల సహకారానికి ఐఐటీ-హెచ్ వేదికగా నిలుస్తున్నదన్నారు. ఐఐటీ-హెచ్ పదిహేనేళ్లలో సాధించిన ప్రగతిని ఛైర్మన్ డాక్టర్ బి.వి.మోహన్ రెడ్డి వివరించారు. వినూత్నమైన కోర్సులతో తమ సంస్థ దేశంలోని ఉన్నత విద్యాసంస్థలతో పోటీ పడుతున్నదని ఐఐటీ-హెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి అన్నారు.

విద్య, ఉద్యోగాల్లో మరాఠాలకు 10% రిజర్వేషన్లు

» బిల్లుకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన మహారాష్ట్ర అసెంబ్లీ

ముంబై, ఫిబ్రవరి 20: విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో మరాఠాలకు 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును మహారాష్ట్ర శాసనసభ మంగళవారం ఏకగ్రీవంగా ఆమోదించింది. శాసనసభ ప్రత్యేక సమావేశాల్లో మరాఠా కోటాకు సంబంధించిన ఈ బిల్లును ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే సభలో ప్రవేశపెట్టారు. ఇది చట్టరూపం దాల్చి అమలులోకి వచ్చిన పదేళ్ల తర్వాత దానిపై సమీక్ష చేపట్టవచ్చని బిల్లులో ప్రతిపాదించారు. రాష్ట్ర జనాభాలో 28శాతం మంది మరాఠాలు ఉన్నారని షిండే తెలిపారు. మరాఠాలలో విద్య, సామాజిక, ఆర్థిక వెనుకబాటుతనంపై ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో దాదాపు 2.5 కోట్ల కుటుంబాలను సర్వే చేసిన మహారాష్ట్ర వెనకబడిన తరగతుల కమిషన్.. గత శుక్రవారం తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. 84 శాతం మరాఠా కుటుంబాలు వెనుకబడి ఉన్నందున ఇంద్ర సాహ్ని కేసు ప్రకారం వారు రిజర్వేషన్లకు అర్హులని నివేదిక స్పష్టం చేసింది. మహారాష్ట్రలో మొత్తం రైతుల ఆత్మహత్యల్లో 94 శాతం మరాఠా కుటుంబాలకు చెందినవేనని బిల్లులో పేర్కొన్నారు.

హైతీ అధ్యక్షుడి హత్యలో భార్య హస్తం!

» విచారణ నివేదికలో సంచలన విషయాలు

పోర్ట్-ఎ-ప్రిన్స్, ఫిబ్రవరి 20: 2021లో జరిగిన హైతీ అధ్యక్షుడు జొవెనెల్ మోయిస్ హత్య కేసు విచారణ నివేదికలో సంచలన విషయాలు వెలుగు చూశాయి. ఈ హత్యలో ఆయన భార్య మార్టిన్ మోయిస్ హస్తం ఉన్నట్లు అందులో వెల్లడయింది. ఈ కేసుపై విచారణ జరుపుతున్న జడ్జి సోమవారం తుది నివేదికను విడుదల చేశారు. దాదాపు 50 మంది అనుమానితులపై అభియోగాలు మోపుతూ 122 పేజీల నివేదిక ఇచ్చారు. ఈ హత్యలో మార్టిన్‌తో పాటు మాజీ ప్రధాన మంత్రి క్లాడె జోసెఫ్, హైతీ నేషనల్ పోలీస్ మాజీ చీఫ్ లియోన్ చార్లెస్ పాత్ర కూడా ఉన్నట్లు అందులో పేర్కొన్నారు. 2021 జూలై 7న.. హైతీ అధ్యక్షుడిగా ఉన్న జొవెనెల్ మోయిస్(53) రాజధాని పోర్ట్-ఎ-ప్రిన్స్‌కు సమీపంలోని తన ప్రైవేట్ నివాసంలో హత్యకు గురయ్యారు.

అనుచిత వ్యాఖ్యల కేసులో రాహుల్‌కు ఊరట

సుల్తాన్‌పూర్, ఫిబ్రవరి 20: కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యల కేసులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి ఊరట లభించింది. దీనిపై విచారణ చేస్తున్న ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా కోర్టు మంగళవారం ఆయనకు షరతులతో కూడిన బెయిలును మంజూరు చేసింది. 2018లో కర్ణాటకలో ఎన్నికల ప్రచారానికి వెళ్లిన రాహుల్ గాంధీ విలేకరులతో మాట్లాడుతూ, 'రాజకీయాల్లో ఎప్పుడూ స్వచ్ఛంగా, నిజాయతీగా ఉంటామని చెప్పుకునే బీజేపీ ఒక హత్య కేసులో నిందితుడిని పార్టీ అధ్యక్షుడిగా ఎన్నుకుంది' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో అమిత్ షా బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా ఉన్నారు. దీనిపై యూపీ బీజేపీ నేత విజయ్ మిశ్రా అదే ఏడాది ఆగస్టులో రాహుల్‌పై ప్రత్యేక ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో ఫిర్యాదు చేశారు. తాజాగా రాహుల్ కోర్టుకు హాజరవగా.. కోర్టు ఆయనకు బెయిలు మంజూరు చేసింది.

మహిళా ఇంజనీర్లకు 'కల్పనా ఫెలోషిప్'

» అంతరిక్ష రంగంలో రాణించాలని కోరుకునే మగువలకు స్కైరూట్ సంస్థ సువర్ణావకాశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: అంతరిక్ష రంగంలో రాణించాలని కలలు కంటున్న మహిళా ఇంజనీర్ల కోసం హైదరాబాద్‌కు చెందిన స్కై రూట్ సంస్థ సువర్ణావకాశాన్ని కల్పించింది. అర్హత గల వారికి ఒక ఏడాది పాటు తమ సంస్థలో వేతనంతో కూడిన కల్పనా ఫెలోషిప్‌ను అందించడంతో పాటు, దాన్ని విజయవంతంగా పూర్తిచేసిన వారికి తమ సంస్థలోనే ఉద్యోగం ఇస్తామని ప్రకటించింది. అంతరిక్ష రంగంలోకి రావాలని కోరుకునే మహిళలకు మరింత ప్రోత్సాహాన్ని కల్పించేందుకే తాము ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు సంస్థ సీఈవో పవన్ చందనా చెప్పారు. అంతరిక్ష రంగంలో చరిత్ర సృష్టించిన భారత సంతతికి చెందిన కల్పనా చావ్లా జ్ఞాపకార్థం ఈ కార్యక్రమానికి ఆమె పేరు పెట్టినట్లు తెలిపారు. అర్హులైన వారు తమ సంస్థ వెబ్‌సైట్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని సంస్థ సహ వ్యవస్థాపకులు భరత్ డాకా తెలిపారు. ఇంజనీరింగ్ ఆఖరు సంవత్సరం చదువుతున్న విద్యార్థినులు కూడా పేర్లను నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

స్విస్‌ను మరిపించేలా కశ్మీరు!

గొప్ప పర్యాటక ప్రాంతంగా మలుస్తాం.. 370 అధికరణ రద్దుతోనే సాధ్యపడుతోంది: మోదీ

» రూ.32 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం

» వివిధ రైల్వే పథకాలు జాతికి అంకితం

» మాజీ సీఎం ఫరూక్ అబ్దుల్లా హర్షం


జమ్మూ కశ్మీర్‌లో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

జమ్ము, ఫిబ్రవరి 20: జమ్మూకశ్మీరు సమగ్రాభివృద్ధికి 370 అధికరణ రద్దు కీలకంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. స్విట్జర్లాండ్‌ను మరిపించేలా కశ్మీరును పర్యాటక కేంద్రంగా మలుస్తామని ప్రకటించారు. పర్యాటకులు స్విస్‌ను సందర్శించడమే మరిచేలా అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఆయన మంగళవారమిక్కడ మౌలానా ఆజాద్ స్టేడియంలో జరిగిన బహిరంగ సభలో.. జమ్మూకశ్మీరులో రూ.32 వేల కోట్ల విలువైన వివిధ ప్రాజెక్టులకు ప్రారంభోత్సవాలు/శంకుస్థాపనలు చేశారు. అనంతరం భారీవర్షం నడుమే ప్రసంగించారు. ఇక్కడ జి-20 సదస్సు నిర్వహించడం వల్ల కశ్మీరు అందాలు, సంస్కృతి ప్రపంచం దృష్టిని ఆకర్షించాయని.. అరబ్ దేశాల నుంచి పెద్దఎత్తున పెట్టుబడులు తరలివస్తున్నాయని చెప్పారు. ఈ ప్రాంతంలో నవశకం మొదలైందన్నారు. జమ్మూకశ్మీరు కుటుంబ పాలన నుంచి విముక్తి పొందిందని, కేంద్రం నేరుగా కశ్మీరీలతో మమేకం అవుతోందని తెలిపారు. ఒకప్పుడు హింస, వేర్పాటువాదం, తుపాకులు, బాంబుల మోతతో విలవిలలాడిన జమ్మూకశ్మీరు.. తన ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలతో ఇప్పుడు సరికొత్తగా సామరస్యం, ప్రగతి దిశగా కదులుతోందని చెప్పారు. ప్రగతిశీలక జమ్మూకశ్మీరును అందిస్తామని ప్రమాణం చేశామని.. దానిని చేసి చూపుతామని.. వచ్చే కొన్నేళ్లలో యువత కలలు నెరవేరుస్తామని తెలిపారు. జమ్మూకశ్మీరు రాష్ట్రంగా ఉన్నప్పుడు 370 అధికరణ దాని అభివృద్ధికి ప్రధాన అడ్డంకిగా మారిందన్నారు. ఆ గోడను తన ప్రభుత్వం బద్దలు కొట్టిందని చెప్పారు. ఈ అధికరణ రద్దుకు గుర్తుగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని 370 సీట్లలో గెలిపించాలని కోరారు. 370 అధికరణపై బాలీవుడ్‌లో ఓ సినిమా నిర్మితమవుతోందని కూడా ప్రస్తావించారు. ఈ సినిమా గురించి సోమవారమే తనకు తెలిసిందని.. అదెలా ఉంటుందో తనకు తెలియదని.. అయితే వాస్తవ సమాచారాన్ని ప్రేక్షకులకు అందజేస్తుందని భావిస్తున్నానని తెలిపారు.

కోటి లక్షాధికారిణులు..

జమ్ము సభకు ముందు ప్రధాని కొత్తగా నియమితులైన ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ పథకాల లబ్ధిదారులతో సంభాషించారు. ప్రధానంగా కతువా జిల్లా బసోలీకి చెందిన స్వయం సహాయ సంఘం (ఎస్‌హెచ్‌జీ) అధిపతి కీర్తితో మాట్లాడారు. రుణసాయం పథకంతో గ్రామీణ మహిళల జీవితాలు ఎలా మారుతున్నాయో ఆమెతో చెప్పించారు. ఆమె ఆధ్వర్యంలోని సంఘం మూడు ఆవులు కొని.. రుణం చెల్లించింది. ఇతర మహిళల సాయంతో ఇప్పుడు పెద్ద గోశాలను నిర్మించారు. ఈ మార్పు ఘనత ప్రధానిదేనని చెప్పారు. వివిధ కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు కూడా మాట్లాడారు. దీన్‌దయాళ్ అంత్యోదయ స్కీం లబ్ధిదారైన షహీన్ పోస్టుగ్రాడ్యుయేట్ కూడా. ఇప్పుడామె ఔత్సాహిక పారిశ్రామికవేత్త. పౌల్ట్రీ ఫాం సహా వివిధ యూనిట్ల ఏర్పాటుతో కశ్మీరు గ్రామీణ ప్రాంతాలు ఏ విధంగా పరివర్తన చెందుతున్నాయో ఆమె వివరించారు.

మోదీకి యామీ గౌతమ్ ధన్యవాదాలు

370 అధికరణపై సినిమా గురించి ప్రస్తావించినందుకు ప్రధాని మోదీకి నటి యామీ గౌతమ్ 'ఎక్స్'లో ధన్యవాదాలు తెలియజేశారు. ఆయన అంచనాలకు మించి తాము నటిస్తామన్న ఆశాభావం వ్యక్తంచేశారు. మోదీ ప్రసంగ వీడియోను కూడా షేర్ చేశారు. ఈ నెల 23న ఆ సినిమా విడుదల కానుంది.

దేశంలోనే అతిపొడవైన రైలు సొరంగం

ఉధంపూర్-శ్రీనగర్-బారాముల్లా రైలు మార్గంలో దేశంలోనే అతిపొడవైన రవాణా టన్నెల్‌కు మోదీ శ్రీకారం చుట్టారు. ఖారీ-సుంబర్ సెక్షన్ నడుమ 12.77 కిలోమీటర్ల పొడవున ఈ టన్నెల్ ఉంది, దీనిని టీ-50గా పిలుస్తారు. బనిహాల్-ఖారీ-సుంబర్-సంగల్‌దాన్ కొత్త రైల్వే లైన్‌ను(48.1 కిలోమీటర్లు), శ్రీనగర్ నుంచి సంగల్‌దాన్ వరకు, సంగల్‌దాన్ నుంచి శ్రీనగర్ వరకు నడిచే రెండు విద్యుత్ రైళ్లను కూడా ప్రధాని ప్రారంభించారు. బారాముల్లా-బనిహాల్ మధ్య మొత్తం 8 విద్యుత్ రైళ్లు నడవనున్నాయి. జమ్మూకశ్మీరులో పెద్దఎత్తున రైల్వే ప్రాజెక్టులను ప్రారంభించడంపై మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా హర్షం వ్యక్తం చేశారు. రైలే శాఖ, ప్రధాని మోదీ చేపట్టిన అతి గొప్ప చర్యగా అభివర్ణించారు.

6 పెద్ద ట్రంకు పెట్టెలు తెండి

(మొదటి పేజీ తరువాయి)

సోమవారం ఇందుకు తేదీలను ఖరారు చేసింది. మార్చి 6, 7 తేదీలలో వీటిని బెంగళూరు నుంచి చెన్నైకి తగిన భద్రత నడుమ తీసుకెళ్లాలని, కనీసం ఆరు పెద్ద ట్రంకు పెట్టెలను తీసుకురావాలని తమిళనాడు ప్రభుత్వానికి సూచించింది. తమిళనాడు ఐజీ స్థాయి పోలీసు ఉన్నతాధికారి, మీడియా సమక్షంలో ఈ బంగారు ఆభరణాలు, ఇతర విలువైన వస్తువులను కోర్టు అందజేయనుంది. ఈ మొత్తం ప్రక్రియను వీడియో తీస్తారు. జయలలిత నుంచి గతంలో స్వాధీనం చేసుకున్న 7,040 గ్రాముల బరువైన 468 బంగారు, వజ్రాల ఆభరణాలు, 700 కిలోల వెండి ఆభరణాలతో పాటు ఖరీదైన చీరలు, వాచీలు, పాదరక్షలు, ఇతర వస్తువులను కూడా తమిళనాడు ప్రభుత్వానికి కోర్టు అందజేయనుంది. వీటన్నింటిని ఒక మ్యూజియంలో సంరక్షించే బాధ్యతను తమిళనాడు ప్రభుత్వమే చేపట్టాల్సి ఉంటుందని కోర్టు పేర్కొంది. జయలలిత కేసుపై బెంగళూరులో విచారణ జరిగినందుకు అయిన ఖర్చు తమిళనాడు ప్రభుత్వం చెల్లించిందని హోంశాఖ వర్గాలు మంగళవారం వెల్లడించాయి.

మరి ఆ 7 కిలోల నగలు..

జయ నుంచి స్వాధీనం చేసుకున్న 27 కిలోల నగల్లో 7 కిలోల నగల్ని విక్రయించడానికి మాత్రం న్యాయస్థానం నిరాకరించింది. జయకు ఆమె తల్లి అందజేసిన పారంపర్య నగలు కావడంతో వాటిని విక్రయించరాదని సూచించింది. మిగిలిన నగలను మాత్రమే వేలం వేయాలని పేర్కొంది. దీంతో ఆ 7 కిలోల నగల్ని ఎవరికి అప్పగిస్తారన్నది చర్చనీయాంశంగా మారింది. జయకు వారసత్వంగా వచ్చిన నగలు అయినందున.. ఆమె మేనకోడలు దీపకు ఇచ్చే అవకాశముందని అధికారవర్గాలు భావిస్తున్నాయి.

అణు విద్యుత్తులో ప్రైవేటు పెట్టుబడులు

రిలయన్స్, టాటా సహా ఐదు సంస్థలతో ఏడాదిగా చర్చలు జరుపుతున్న కేంద్రం!

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కర్బన ఉద్గారాల బెడద లేకుండా కరెంటును ఉత్పత్తిని పెంచడం కోసం.. అణు ఇంధన రంగంలో 2600 కోట్ల డాలర్ల ప్రైవేటు పెట్టుబడులను కేంద్రం ఆహ్వానిస్తోంది. 2600 కోట్ల డాలర్లంటే దాదాపుగా రూ.2.1 లక్షల కోట్లు. ఈమేరకు కేంద్రప్రభుత్వానికి చెందిన అణు ఇంధన విభాగం, న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌పీసీఐఎల్).. రిలయన్స్ ఇండస్ట్రీస్, టాటా పవర్, అదానీ పవర్, వేదాంత లిమిటెడ్ సహా ఐదు సంస్థల తో ఏడాదిగా చర్చలు జరుపుతున్నట్టు అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం. ఒక్కో కంపెనీ నుంచి రూ.44 వేల కోట్ల పెట్టుబడులను కేంద్రం ఆశిస్తోంది. దేశంలో తయారవుతున్న విద్యుత్తులో.. కర్బన ఉద్గారాలను విడుదల చేయని అణు విద్యుత్తు వాటా కేవలం 2 శాతమే. శిలాజేతర ఇంధనాలతో తయారవుతున్న స్థాపిత విద్యుత్తు సామర్థ్యం 42%. ఈ రంగంలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించి రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టించగలిగితే.. శిలాజేతర ఇంధనాలతో తయారవుతున్న విద్యుత్తు 2030 నాటికి మరో 8% మేర పెరిగి 50 శాతానికి చేరుతుందని అంచనా. ఈ రూ.2.1 లక్షల కోట్ల ప్రైవేటు పెట్టుబడితో 2040 నాటికి దేశ అణువిద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 11 వేల మెగావాట్లకు పెంచుకోవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం మన దేశంలో 7500 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేసే అణు విద్యుత్ కేంద్రాలున్నాయి. వీటిని ఎన్‌పీసీఐఎల్ నిర్వహిస్తోంది. మరో 1300 మెగావాట్ల విద్యుత్తును ఉత్పత్తి చేయడానికి అవసరమైన పెట్టుబడులు పెట్టడానికి ఎన్‌పీసీఐఎల్ సిద్ధంగా ఉంది. అణు విద్యుత్ కేంద్రాల నిర్మాణం, నిర్వహణ బాధ్యతలు మాత్రం ఎన్‌పీసీఐఎల్‌వేనని ప్రభుత్వంలోని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి.

ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థే విజేత

(మొదటి పేజీ తరువాయి)



పేర్కొంది. జనవరి 30న జరిగిన మేయర్ ఎన్నికల ఫలితాలను రద్దు చేసింది. అనిల్ మాసిహ్ 'ఎక్స్' గుర్తులు వేసి చెల్లవని ప్రకటించిన 8 ఓట్లు ఆప్ అభ్యర్థికే దక్కుతాయని తేల్చిచెప్పింది.

అనిల్ మాసిహ్‌పై క్రిమినల్ చర్యలు..

కోర్టుకు తప్పుడు వాంగ్మూలం ఇచ్చినందుకు సీఆర్‌పీసీలోని సెక్షన్ 340 కింద అనిల్ మాసిహ్‌పై క్రిమినల్ చర్యలకు సుప్రీంకోర్టు ఆదేశించింది. మేయర్ ఎన్నికల్లో ఎనిమిది ఓట్లను రిటర్నింగ్ అధికారి చెల్లనివిగా పేర్కొంటూ బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్‌ను విజేతగా ప్రకటించిన విషయం తెలిసిందే. మనోజ్ సోంకర్‌కు 16 ఓట్లు, ఆప్-కాంగ్రెస్ అభ్యర్థి కుల్‌దీప్ కుమార్‌కు 12 ఓట్లు వచ్చినట్టు అనిల్ మాసిహ్ ప్రకటించారు. కౌంటింగ్ సందర్భంగా రిటర్నింగ్ అధికారి సందేహాస్పదంగా ప్రవర్తిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆమ్ ఆద్మీ పార్టీ సుప్రీంకోర్టును ఆశ్రయించడంతో బ్యాలెట్ పత్రాలను, కౌంటింగ్ రోజు నమోదైన సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించిన ధర్మాసనం కుల్‌దీప్‌ను విజేతగా ప్రకటించింది. అనిల్ మాసిహ్ 8 మంది ఓట్లపై 'ఎక్స్' అని రాసి వాటిని పక్కన పెట్టిన తీరు సీసీటీవీ ఫుటేజీలో స్పష్టంగా నమోదైంది. తప్పు చేసినట్టు నిరూపణ అయితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని విచారణ సందర్భంగానే అనేకసార్లు అనిల్ మాసిహ్‌ను సుప్రీంకోర్టు హెచ్చరించింది. అతని చర్యలు ప్రజాస్వామ్యానికే మచ్చగా కోర్టు తొలుత అభివర్ణించింది. ఎన్నికల ప్రక్రియను హైజాక్ చేయడంపై సుప్రీంకోర్టు తీవ్ర హెచ్చరికలు చేయడం భారతదేశ చరిత్రలో ఇదే తొలిసారి.

చిన్న చుక్కలున్నాయ్: రోహత్గీ

బ్యాలెట్ పత్రాలను కౌన్సిలర్లే నిర్వీర్యం చేసుకొన్నారని, అందుకే తాను వాటిపై 'ఎక్స్' మార్కు రాసి చెల్లనివిగా లెక్కించానని అనిల్ మాసిహ్ సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. మంగళవారం ఆ పత్రాలను తెప్పించి పరిశీలించిన ధర్మాసనం.. ఆ ఓట్లు ఏ విధంగా చెల్లలేదో వివరించాలని అనిల్ మాసిహ్‌ను నిలదీసింది. అయితే, వాటిపై చిన్న చిన్న చుక్కలు ఉన్నాయని అనిల్ మాసిహ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదించారు. అందుకే అవి చెల్లని ఓట్లుగా ఆయన అంచనాకు వచ్చారని తెలిపారు. ఈ వాదనతో సుప్రీంకోర్టు సంతృప్తి చెందలేదు. 'ఆ ఎనిమిది ఓట్లు కుల్‌దీప్ కుమార్‌కు అనుకూలంగా వచ్చాయి' అని ధర్మాసనం పేర్కొంది.

రీపోలింగ్ జరిపితే..

బీజేపీ అభ్యర్థి సోంకర్‌కు 16, ఆప్-కాంగ్రెస్ అభ్యర్థి కుల్‌దీప్‌కు 12 ఓట్లు వచ్చినట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించిన విషయం తెలిసిందే. కుల్‌దీప్‌కు అనుకూలంగా వచ్చిన మరో ఎనిమిది ఓట్లను చెల్లనివిగా ప్రకటించారు. చండీగఢ్ మున్సిపాలిటీలో మొత్తం 35 మంది కౌన్సిలర్లు ఉండగా, సుప్రీంకోర్టులో విచారణ జరుగుతున్న సమయంలోనే ఆమ్‌ఆద్మీ పార్టీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లు బీజేపీలో చేరిపోయారు. అలాగే, స్థానిక ఎంపీ(బీజేపీ)కీ ఎక్స్ అఫిషియో సభ్యుడిగా ఓటు హక్కు ఉంది. దీంతో బీజేపీ బలం 19కి పెరగగా, ఆప్-కాంగ్రెస్ బలం 17కు పడిపోయింది. సోంకర్ కోరినట్టు రీ-పోలింగ్‌కు కోర్టు ఆదేశించి ఉంటే గనుక బీజేపీకి స్పష్టంగా మేలు జరిగేది. అయితే, మళ్లీ తాజాగా ఎన్నికల నిర్వహణకు ఆదేశించాలని బీజేపీ చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది.

సుప్రీంకోర్టు చరిత్రలోనే తొలిసారి..


ఎన్నికల చివరి దశను కోర్టుగదిలో ఆదేశించడం, ఓట్ల లెక్కింపును సుప్రీం ధర్మాసనం స్వయంగా వీక్షించడం సుప్రీంకోర్టు చరిత్రలోనే ఇది తొలిసారి. ఇటువంటి కుయుక్తుల వల్ల ప్రజాస్వామ్యం నిర్వీర్యం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని న్యాయమూర్తులు ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.

సీసీటీవీలు ఉంటేనే ఇలా చేశారంటే..

సుప్రీంకోర్టు తీర్పుతో బీజేపీ నిర్వాకం బట్టబయలైందని ఆమ్ ఆద్మీ పార్టీ వ్యాఖ్యానించింది. ఇంత చిన్న ఎన్నికల్లో కూడా బీజేపీ, కేంద్ర ప్రభుత్వం బాహాటంగానే అక్రమాలకు పాల్పడటం చాలా ఆందోళన కలిగించే అంశమని ఢిల్లీ మంత్రి, ఆప్ నేత సౌరభ్ భరద్వాజ్ పేర్కొన్నారు. సీసీ కెమెరాలు ఉన్నచోటే పరిస్థితి ఇలా ఉంటే, ఇక అవి లేనిచోట కేంద్రం ఇంకా ఏమేం చేస్తోందో అన్నారు. ఈ క్లిష్ట కాలంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడినందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలంటూ ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత కేజ్రీవాల్ 'ఎక్స్'లో పోస్టు చేశారు. కాగా, దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు సుప్రీంకోర్టు నిర్ణయం ఎంతగానో దోహదం చేస్తుందని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. 'ఎన్నికల ప్రక్రియ మొత్తం ఒక ప్రహసనం. ఈ చరిత్రాత్మక తీర్పుతో అదంతా బట్టబయలైంది' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ 'ఎక్స్'లో పేర్కొన్నారు.

రాజ్యసభకు సోనియా ఏకగ్రీవం

నడ్డాతో పాటు, మరో 39 మంది కూడా



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియాగాంధీ, బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డాతో పాటు 41 మంది అభ్యర్థులు మంగళవారం రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికయిన ఇతర ప్రముఖుల్లో ఇటీవలే బీజేపీలో చేరిన మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత అశోక్ చవాన్, కేంద్ర మంత్రులు అశ్విని వైష్ణవ్, ఎల్.మురుగన్ తదితరులు ఉన్నారు. అత్యధికంగా బీజేపీ 20 సీట్లను దక్కించుకోగా, కాంగ్రెస్ ఆరు, తృణమూల్ కాంగ్రెస్ నాలుగు, వైసీపీ మూడు, ఆర్జేడీ రెండు, బీజేడీ రెండు, ఎన్‌సీపీ, శివసేన, బీఆర్ఎస్, జేడీ(యూ)లు ఒక్కొక్క స్థానంలో విజయం సాధించాయి. మొత్తం 56 స్థానాల్లో ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ వెలువడింది. 50 మంది సభ్యులు ఏప్రిల్ రెండో తేదీన, మరో ఆరుగురు మూడో తేదీన ప దవీ విరమణ చేయనుండడంతో ఈ ఎన్నికలు జరపాల్సి వచ్చింది. 41 సీట్లు ఏకగ్రీవం కావడంతో మిగిలిన 15 స్థానాలకు ఈ నెల 27న ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్ నుంచి కాంగ్రెస్ నాయకురాలు సోనియాగాంధీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆమెతోపాటు బీజేపీకి చెందిన చున్నిలాల్ గరాసియా, మదన్ రాథోడ్‌కూడా పెద్దల సభకు ఎన్నికయ్యారు. గుజరాత్ నుంచి జె.పి.నడ్డాతో పాటు, ప్రముఖ వజ్రాల వ్యాపారి గోవింద్‌భాయ్ ధోలకియ, మరో ఇద్దరు ఎగువ సభలో ప్రవేశించనున్నారు. మహారాష్ట్ర నుంచి ఆరుగురు ఎన్నికయ్యారు. రాజ్యసభకు వెళ్లనున్న ప్రముఖుల్లో ప్రముఖ జర్నలిస్టు సాగరిక ఘోష్ ఉన్నారు. తృణమూల్ కాంగ్రెస్ తరఫున పశ్చిమ బెంగాల్ నుంచి ఆమె గెలుపొందారు. కేంద్రమంత్రి మురుగన్ మధ్యప్రదేశ్ నుంచి మరో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఒడిశా నుంచి ఎగువ సభలో అడుగుపెట్టనున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి నలుగురు తృణమూల్, ఒక బీజేపీ సభ్యుడు; మధ్యప్రదేశ్ నుంచి నలుగురు బీజేపీ, ఒక కాంగ్రెస్ సభ్యుడు; ఒడిశా నుంచి ఇద్దరు బీజేడీ, ఒక బీజేపీ సభ్యుడు ఏకగ్రీవంగా గెలుపొందినట్టు అధికారులు ప్రకటించారు. ఉత్తరాఖండ్‌లోని, ఛత్తీస్‌గఢ్, హరియాణాల్లోని ఒక్కొక్క స్థానాన్ని బీజేపీ తన ఖాతాలో వేసుకుంది.

రూ.1100 కోట్ల విలువైన 'మెఫెడ్రోన్' డ్రగ్స్ స్వాధీనం

పుణె, ఫిబ్రవరి 20: మహారాష్ట్రలోని పుణెలో 600 కిలోల మెఫెడ్రోన్ డ్రగ్స్‌ను మంగళవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ దాదాపు రూ.1,100 కోట్లు ఉంటుందని పోలీసులు తెలిపారు. డ్రగ్స్ సరఫరా చేస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని, వారిమీద 'నార్కోటిక్ డ్రగ్స్' చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని పుణె పోలీస్ కమిషనర్ అమితేష్ కుమార్ వెల్లడించారు. "ఆదివారం ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశాం. వారిని కొరియర్ బాయ్స్‌గా గుర్తించాం. మొదట రూ. 3.85 కోట్ల విలువైన 1.75 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నాం. విచారణలో మరో 55 కిలోల డ్రగ్స్‌ను పట్టుకున్నాం. అనంతరం జరిగిన దర్యాప్తులో భాగంగా కుర్కుంబ్ ఎంఐడీసీ ప్రాంతంలో దాదాపు 550 కిలోల మెఫెడ్రోన్‌ను స్వాధీనం చేసుకున్నాం." అని అమితేష్ కుమార్ పేర్కొన్నారు. ఈ కేసును వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నామని, ఇతర ఏజెన్సీలతో కలిసి కేసును విచారిస్తున్నామని ఆయన తెలిపారు.

శశిథరూర్‌కు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20: కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు ఫ్రాన్స్ తమ దేశపు అత్యున్నత పౌర పురస్కారం అయిన 'షెవలియె డి లా లిజియన్ ద హానర్‌'ను మంగళవారం బహూకరించింది. భారత్- ఫ్రాన్స్ దేశాల మధ్య స్నేహ బంధం బలోపేతమవడానికి థరూర్ చేసిన కృషికి గాను, అలాగే ఆయన రచనలు, ప్రసంగాలను గౌరవిస్తూ ఈ అవార్డును ఇస్తున్నట్లు ఫ్రెంచ్ సెనేట్ అధ్యక్షుడు గెరార్డ్ లార్చర్ ప్రకటించారు. వాస్తవంగా ఈ అవార్డును శశిథరూర్‌కు ఆగస్టు 2022లోనే ప్రకటించినప్పటికీ ఏడాదిన్నర తర్వాత ఫ్రాన్స్ ఆయనకు అందజేసింది. తనకు ఫ్రాన్స్ అత్యున్నత పౌర పురస్కారం దక్కడంపై శశిథరూర్ హర్షం వ్యక్తం చేశారు.

నేడు గద్దెపైకి సారలమ్మ!



(మొదటి పేజీ తరువాయి)

రహస్య పూజలు చేస్తారు. ఈ సమయంలోనే పూజారి సారయ్యను సారలమ్మ ఆవహిస్తుంది. తర్వాత సారలమ్మ (సారయ్య రూపంలో)ను ఆలయం నుంచి గద్దెల వైపు పూజారులు తీసుకొస్తారు. సమ్మక్క గారాల బిడ్డ అయిన సారలమ్మ ధైర్యానికి, వీరత్వానికి, త్యాగానికి ప్రతీక. 12వ శతాబ్దంలో తమ గిరిజన ప్రాంతాన్ని కాపాడుకునేందుకు కాకతీయులతో సారలమ్మ యుద్ధం సాగించిన తీరును, వీరమరణం ద్వారా ఆమె త్యాగాన్ని భక్తులు స్మరించుకుంటూ దైవంగా కొలుస్తారు. తల్లిని మొక్కితే సంతానం ప్రాప్తిస్తుందని, రుగ్మతలు పోతాయని భక్తుల విశ్వాసం. ఫలితంగా మేడారానికి సాగుతున్న సమయంలో సారలమ్మకు కన్నెపల్లిలో భక్తులు ఎదురెళ్లి మంగళహారతులు ఇస్తారు. సంతానం కలగాలని, సమస్యలు తీరాలని తడి బట్టలతో భక్తులు వరం పడతారు. సారలమ్మ వీధిలోకి రాగానే పూజారులు పీటలు వేసి కాళ్లు కడిగి.. మంగళహారతులు ఇచ్చి తల్లిని సాగనంపుతారు. సారలమ్మ కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగును దాటి సాయంత్రానికి గద్దెకు చేరుకుంటుంది. అలాగే మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్ల నుంచి సమ్మక్క భర్త పగిడిద్దరాజును .. ఏటూరునాగారం మండలం కొండాయి నుంచి పగిడిద్దరాజు తమ్ముడు గోవింద రాజును పడిగె రూపాల్లో రాత్రి 8 గంటలవరకు గద్దెపైకి తీసుకొస్తారు. 22న అంటే.. గురువారం చిలకలగుట్ట నుంచి సమ్మక్కను గద్దెకు చేర్చుతారు. ఆ రోజు మహాజాతర మరో స్థాయికి చేరుతుంది. 24న సాయంత్రం వనదేవతలు తమ తమ ప్రాంతాలకు తిరుగు ప్రయాణమవుతారు. కాగా రెండేళ్లకోసారి జరిగే ఈ మహాజాతరకు ఈసారి 1.3 కోట్ల మంది వస్తారని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకు ప్రత్యేకంగా రూ.105 కోట్ల నిధులు కేటాయించింది. జాతరలో తాత్కాలికంగా 5,600 మరుగుదొడ్లు నిర్మించారు. 200 దాకా ఉన్న శాశ్వత మరుగుదొడ్లకు మరమ్మతులు చేశారు. మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొత్తూరు, నార్లాపూర్ తదితర చోట్ల 354 బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్‌ను ఏర్పాటు చేశారు. జాతర ఏర్పాట్లను మంత్రులు సీతక్క, పొన్నం, కొండా సురేఖ, పొంగులేటి పర్యవేక్షిస్తున్నారు. జాతర మూడోరోజు, శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారానికి వస్తున్నారు. ఈ మేరకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

మేడారానికి ఎక్కడి నుంచి.. ఎలా వెళ్లాలి?

మేడారం వచ్చే భక్తులు హైదరాబాద్ నుంచైతే తొలుత వరంగల్‌కు రావాలి. రైలులో వచ్చే భక్తులైతే ఖాజీపేట, వరంగల్ రైల్వేస్టేషన్లలో దిగి అక్కడి నుంచి నేరుగా 163 జాతీయ రహదారిపై నుంచి ములుగు-ఏటూరునాగారం ప్రధాన రహదారి వెంట వెళ్లాల్సి ఉంటుంది. హనుమకొండ నుంచి 85 కిలోమీటర్లు ప్రయాణం చేస్తే పస్రా గ్రామ పంచాయతీ వస్తుంది. అక్కడి నుంచి ఎడమ వైపునకు మేడారం రహదారి ఆర్చీతో స్వాగతం పలుకుతుంది. పస్రా నుంచి 30 కిలోమీటర్లు ప్రయాణిస్తే మేడారం చేరుకోవచ్చు. ఇక్కడ నార్లాపూర్, జంపన్న వాగు, రెడ్డిగూడెం వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ స్థలాల్లో వాహనాలను నిలపాలి. ఒకవేళ ఆర్టీసీ బస్సులో ప్రయాణించాల్సి వస్తే హనుమకొండ బస్టాండ్ నుంచి నేరుగా మేడారానికి వందలాది బస్సులు సిద్ధంగా ఉంటాయి. ప్రభుత్వం వన్‌వే చేయడంతో తిరుగు ప్రయాణం మాత్రం నార్లాపూర్ నుంచి బయ్యక్కపేట, గొల్లబుద్దారం, భూపాలపల్లి, పరకాల, గూడెప్పాడ్ మీదుగా హనుమకొండకు చేరుకోవచ్చు. 15 కిలోమీటర్లు అదనంగా ప్రయాణం చేయాల్సి ఉంటుంది. ఇక కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ నుంచి వచ్చే భక్తులైతే పెద్దపల్లి జిల్లా మంథనికి చేరుకోవాల్సి ఉంటుంది. మంథని నుంచి భూపాలపల్లి జిల్లా కాటారం మీదుగా బోర్లగూడెం నుంచి నార్లాపూర్-మేడారం చేరుకుంటారు. మంచిర్యాల, మహారాష్ట్ర నుంచి వచ్చే భక్తులు కాళేశ్వరం మీదుగా కాటారం చేరుకొని ఇదే రూట్‌లో మేడారం వరకు వెళ్లొచ్చు. ఖమ్మం, మహబూబాబాద్ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు వరంగల్, కాజీపేట రైల్వేస్టేషన్లలో దిగి.. అక్కడి నుంచి వరంగల్, హనుమకొండ బస్టాండ్ల నుంచి నేరుగా ఆర్టీసీ బస్సుల ద్వారా మేడారం చేరుకోవచ్చు. ప్రైవేటు వాహనాలైతే ఖమ్మం నుంచి మహబూబాబాద్ చేరుకొని అక్కడి నుంచి జాతీయ రహదారి 363 మీదుగా గూడూరు, ఖానాపూర్, నర్సంపేట నుంచి మల్లంపల్లి వరకు రావాల్సి వస్తుంది. మల్లంపల్లి నుంచి ఎన్‌హెచ్ 163 మీదుగా ములుగు, పస్రాల గుండా మేడారం చేరుకోవచ్చు.


మంగళవారం రాత్రి కన్నెపల్లి నుంచి జంపన్నను తీసుకొస్తున్న పూజారులు (వడ్డెలు)

పంటకు నీరు పెట్టేందుకు వెళ్లిన ఓ రైతు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మెదక్ జిల్లా రామాయంపేట మండలం కాట్రియాలకు చెందిన రైతు ద్యాగల శ్రీనివాస్(30) సోమవారం పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లాడు. బోరు మోటార్ ఫ్యూజ్ వేసేందుకు వైర్లను సరి చేస్తుండగా షాక్‌తో మృతి చెందాడు.
- రామాయంపేట

జాతరకు ప్రత్యేక బస్సులు



హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ కుంభమేళాగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరలో పాల్గొనే భక్తులు, సందర్శకుల కోసం రాష్ట్ర పర్యాటక సంస్థ ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు ప్రత్యేక బస్సులను నడుపుతోంది. నాలుగు రోజుల పాటు ఉదయం 6:30 గంటలకు సికింద్రాబాద్ యాత్రి నివాస్, బషీర్‌బాగ్ సెంట్రల్ రిజర్వేషన్ కార్యాలయం నుంచి ఏసీ, నాన్ ఏసీ, వోల్వో బస్సులు బయలుదేరుతాయని పర్యాటక సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ నాయుడు తెలిపారు. ఈ బస్సుల్లో వెళ్లే భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసినట్లు వివరించారు. దర్శనం అనంతరం తిరుగు ప్రయాణంలో పర్యాటకులకు వరంగల్ వేయి స్తంభాల గుడి, పరిసర ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో రాత్రి 10:30కు హైదరాబాద్ చేరుకోవచ్చని అన్నారు. ఒక్క రోజులోనే దర్శనం పూర్తి చేసుకుని, మొక్కులు చెల్లించుకునేందుకు భక్తులు పర్యాటక సంస్థ ప్రత్యేక బస్సులను వినియోగించుకోవచ్చని సూచించారు.

మేడారం జాతర బస్సుల్లో చార్జీలు

బస్సులు	పెద్దలకు	పిల్లలకు
వోల్వో బస్సులు	రూ.1800	రూ.1440
ఏసీ మినీ బస్సులు	రూ.1600	రూ.1280
నాన్ ఏసీ బస్సులు	రూ. 1200	రూ.950

పార్కును ఆక్రమిస్తున్నారు!

- ఆడుకునేందుకు స్థలం లేదు
- హైకోర్టుకు ఆదిలాబాద్ చిన్నారుల లేఖ
- విచారణ చేపట్టిన చీఫ్ జస్టిస్ ధర్మాసనం
- సమాధానం చెప్పాలని అధికార్లకు నోటీసులు

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమిస్తుండడంతో తమకు ఆడుకోవడానికి అవకాశాలు లేకుండా పోయాయంటూ ఆదిలాబాద్ మున్సిపాల్టీకి చెందిన 23 మంది చిన్నారులు రాసిన లేఖపై హైకోర్టు స్పందించింది. ఆక్రమణలను అడ్డుకోవడానికి ఏయే చర్యలు తీసుకున్నారో తెలియజేయాలని రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్, ఇతర అధికార్లకు నోటీసులు పంపించింది. పేదవర్గాల కోసం పట్టణం నడిబొడ్డున 1970లో హౌసింగ్ బోర్డు కాలనీ నిర్మించారు. ఇందులో 1.5 ఎకరాలు పార్కు స్థలం కోసం వదిలేయగా కొంతమంది దాదాపు 30 గుంటల స్థలంలో ఆలయాన్ని నిర్మించారు. ల్యాండ్ మాఫియా మరికొంత స్థలాన్ని ఆక్రమించింది. మిలిగిన స్థలాన్ని సైతం కబ్జా చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొంటూ ఎ. దీక్ష మరో 22 మంది చిన్నారులు ఈనెల 13న హైకోర్టుకు లేఖరాశారు. ఈ లేఖను పరిశీలించిన చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ఆదిలాబాద్ మున్సిపాల్టీ కమిషనర్‌గా పనిచేసిన ఎ. శైలజపై సైతం ఆరోపణలు ఉన్నందున ఆమెను ప్రతివాదిగా చేర్చాలని ధర్మాసనం ఆదేశించింది. ప్రస్తుతం ఆమె అక్కడ విధుల్లో లేరని ప్రభుత్వ న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం వచ్చే వాయిదాలోగా ఆక్రమణలను అడ్డుకోవడంతోపాటు పార్కు స్థలం రక్షణకు ఏయే చర్యలు తీసుకున్నారో నివేదిక సమర్పించాలని రెవెన్యూ అధికారులకు మధ్యంతర ఆదేశాలు జారీచేసింది. తదుపరి విచారణను మార్చి 7కు వాయిదా వేసింది.

కాంగ్రెస్‌లోకి 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20: మహబూబ్‌నగర్ పట్టణ మునిసిపాలిటీకి చెందిన 12 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో వారందరూ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లలో షబ్బీర్ అహ్మద్, తిరుమల రోజా, నీరజావిఠల్‌రెడ్డి, లక్ష్మీదేవి, యాదమ్మ, రాణి, మోతిలాల్, షబానామోసిన్, షహీమ్‌ఖాజాపాష, నాజియారాశెద్, బాలీశ్వరిగంజి, రజియాఅంజద్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ షబ్బీర్ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రి థర్మల్ పవర్‌పై.. ప్రశాంతంగా ప్రజాభిప్రాయ సేకరణ

- పరిహారం, జాబ్ గ్యారెంటీ కార్డులివ్వాలన్న నిర్వాసితులు

నల్లగొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా దామరచర్ల మండలం వీర్లపాలెంలో నిర్మితమవుతున్న యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్(వైటీపీఎస్) వద్ద ప్రజాభిప్రాయ సేకరణ మంగళవారం ప్రశాంతంగా ముగిసింది. టీఎస్‌జెన్‌కో నిర్మిస్తోన్న వైటీపీఎస్ వద్ద కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ రిజ్వీ సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ దాసరి హరిచందన అధ్యక్షత వహించారు. అభిప్రాయ సేకరణను అడ్డుకుంటారనే సమాచారంతో పోలీసులు ముందస్తుగా 40 మంది నిర్వాసితులు, ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. అభిప్రాయ సేకరణకు కారకులు, జాతీయ హరిత ట్రిబ్యునల్‌లో ఫిర్యాదు చేసిన ముంబైకి చెందిన కన్జర్వేషన్ యాక్షన్ ట్రస్ట్, విశాఖకు చెందిన సమత స్వచ్ఛంద సంస్థకు చెందిన ప్రతినిధులెవరూ ఈ కార్యక్రమానికి హాజరు కాలేదు. 1,000 మంది ఈ కార్యక్రమానికి హాజరవ్వగా.. వారిలో 48 మంది తమ గళం వినిపించారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు ఎస్.హరీందర్ ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయాధారితమైన ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసే ప్లాంట్‌లో నాణ్యతతో కూడిన కాలుష్య నిరోధక యంత్రాలను ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. సామాజికవేత్త చెన్నకేశవరెడ్డి తదితరులు మాట్లాడుతూ ప్లాంట్‌లో ఏర్పాటు చేస్తున్న కాలుష్య నిరోధక యంత్రాల్లో నాణ్యత లేదని తెలుస్తోందని, దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ స్థానికులకు భూపరిహారం, ఉద్యోగాల విషయంలో న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి పరిహారం ఇవ్వాలని, జాబ్‌గ్యారెంటీ కార్డులను అందజేయాలని డిమాండ్ చేశారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ థర్మల్ ప్లాంట్ ఈ ప్రాంతానికి ఆధునిక దేవాలయమని అభివర్ణించారు. పలువురు నిర్వాసితులకు భూపరిహారం రాలేదని, ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో మౌలిక సదుపాయాల ఏర్పాటు పూర్తిచేయలేదని, వాటన్నింటినీ తక్షణం అమలుచేయాలని స్థానికులు కోరారు. ఈ మేరకు 57 మంది వినతిపత్రాలు అందజేశారు.

అర చేతిలో వైకుంఠం చూపి అధికారంలోకి..

- రూ.2లక్షల రుణమాఫీ, రైతుబంధు ఏమయ్యాయి?
- వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదు: హరీశ్‌రావు



షాద్‌నగర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): 'గ్యారంటీ'ల పేరుతో మూడు రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఇచ్చిన హామీలను మాత్రం అమలుచేయడంలో విఫలమైందని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. బ్యాంక్‌లకు అప్పులు చెల్లించవద్దని, తాము అధికారంలోకి రాగానే రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ నాయకులు రైతులను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. 3 నెలలు గడుస్తున్నా రుణమాఫీ ఎందుకు చేయలేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో.. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ఉద్యోగులు, ఎమ్మెల్యేలు, మంత్రుల జీతాలను బంద్‌పెట్టి మరీ రైతులకు రైతుబంధు ఇచ్చామని తెలిపారు. వడ్లు పండించిన రైతులకు బోనస్ ఇవ్వకుంటే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎండగట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థులు గెలిస్తేనే తెలంగాణ సమస్యలపై పోరాటం చేసే అవకాశం ఉంటుందన్నారు. మహబూబ్‌నగర్ లోక్‌సభ స్థానంలో మరోసారి బీఆర్ఎస్ జెండా ఎగరేసేందుకు కార్యకర్తలు నడుం బిగించాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి పనులు 80శాతం పూర్తయ్యాయని, ప్రాజెక్టు కింద కాలువలు తవ్వి సాగు నీరు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు.


అస్వస్థతకు గురై చికిత్స కోసం ఆస్పత్రికి వచ్చిన విద్యార్థులు

రేకులపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ పాయిజన్

- 13 మంది విద్యార్థులకు అస్వస్థత

గద్వాల, ఫిబ్రవరి 20: జోగులాంబ గద్వాల జిల్లా రేకులపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం పలువురు విద్యార్థులు ఫుడ్ పాయిజన్‌కు గురయ్యారు. మధ్యాహ్న భోజనం చేసిన అనంతరం నలుగురు విద్యార్థులు వాంతులు చేసుకోగా మరికొందరు కడుపునొప్పి, తలనొప్పితో బాధపడ్డారు. మొత్తం 13 మంది విద్యార్థులు ఇబ్బందులకు గురయ్యారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి వెంటనే స్పందించి విద్యార్థులను గద్వాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిశీలించిన డాక్టర్లు వారికి ప్రథమ చికిత్సను అందించి కాసేపు తమ అబ్జర్వేషన్‌లో ఉంచారు. విషయం తల్లిదండ్రులకు తెలియడంతో వారు ఆందోళనకు గురై హుటాహుటిన ఆసుపత్రికి చేరుకున్నారు. పాఠశాలలో మంచినీటి ట్యాంకును శుభ్రం చేయడంలేదని, అందులో పురుగులు పడ్డాయని వారు ఆరోపించారు. వంటగది అపరిశుభ్రంగా ఉందని వంట చేసేవారు కూడా పరిశుభ్రతను పాటించడంలేదని ఆగ్రహించారు. ప్రాణాపాయం జరిగి ఉంటే ఎవరిది బాధ్యత అని ప్రశ్నించారు. విద్యార్థులెవరికీ ఎలాంటి అపాయం లేదని, సాయంత్రం వారిని ఇళ్లకు పంపామని వైద్యులు చెప్పారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కుట్రను వమ్ముచేసిన కోర్టు

చండీగఢ్ మేయర్ ఎన్నిక వ్యవహారంలో సుప్రీంకోర్టు చొరవ ప్రశంసనీయమైనది. ఆర్టికల్ 142 ద్వారా తనకు దఖలుపడిన విశేషాధికారాలను సైతం వినియోగించి ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థిని న్యాయస్థానం విజేతగా నిర్ణయించింది. బ్యాలెట్ పత్రాలను భ్రష్టుపట్టించి, ఫలితాలను తారుమారు చేసేందుకు ప్రయత్నించిన రిటర్నింగ్ అధికారిని శిక్షార్హుడుగా ప్రకటించింది. మునిసిపల్ ఎన్నికల స్థాయిలో కూడా అధికారం కోసం కక్కుర్తిపడిన బీజేపీకి సుప్రీంకోర్టు నిర్ణయం పెద్ద ఎదురుదెబ్బ. మంగళవారం తీర్పు ఓ తీవ్రమైన నేరాభియోగం.

జనవరి 30న పోలింగ్ పెద్దగా వ్యవహరించిన బీజేపీ మైనారిటీ విభాగానికి చెందిన నామినేటెడ్ కౌన్సిలర్ అనిల్ మాసి సోమవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ప్రశ్నలకు సమాధానం చెప్పారు. కెమెరా కెమెరా అంటూ కౌన్సిలర్లు అరుస్తున్నందునే తాను కెమెరావైపు చూశానని, ఆప్ కౌన్సిలర్లు బ్యాలెట్ పత్రాలు లాక్కొనే ప్రయత్నం చేస్తున్నందున, చెల్లని ఎనిమిది బ్యాలెట్ పేపర్లను వేరుగా గుర్తించడానికే తాను వాటిమీద కొట్టివేత గుర్తువేశానని చెప్పుకొచ్చాడు. అయితే, చెల్లని ఓట్లమీదే తాను రాతకోతలు చేశానన్న అతడి వాదన శుద్ధ అబద్ధమని, ఇతడు పెన్నుపెట్టడానికి ముందు అవి సక్రమంగానే ఉన్నాయని కోర్టు నిర్ధారణకు వచ్చింది. ఫలితాలను తారుమారు చేయడానికి ప్రయత్నించడం, అంతా నిజమే చెబుతానంటూనే అబద్ధాలు చెప్పిన కారణంగా అతడు శిక్షార్హుడని కోర్టు నిర్ధారించింది. దీనితో అనిల్ మాసి ఆధ్వర్యంలో వెల్లడయిన ఫలితాలు రద్దవడంతో పాటు, కోర్టు పర్యవేక్షణలో అతడిమీద దర్యాప్తు కూడా మొదలైంది. స్వతంత్రభారత చరిత్రలో ఒక ఎన్నికల అధికారిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి క్రాస్ ఎగ్జామినేషన్ చేయడం ఇదే ప్రథమం.

అనిల్ మాసి తరఫున వాదించిన సొలిసిటర్ జనరల్ మళ్ళీ కొత్తగా ఎన్నికలు జరపాలంటూ చేసిన విజ్ఞప్తిని న్యాయస్థానం తిరస్కరించడం మరో చక్కని నిర్ణయం. తిరిగి పోలింగ్ జరిగినా తమ అభ్యర్థే మేయర్ అయ్యేట్టుగా ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలను ఇప్పటికే బీజేపీ తనవైపు తిప్పుకొని ఉన్నందున, సుప్రీంకోర్టు రీ పోలింగ్‌కు అంగీకరించివుంటే మేయర్ స్థానం మళ్ళీ బీజేపీకే వచ్చివుండేది. అంటే, ఒక అక్రమాన్ని అడ్డుకొని, మరో అక్రమానికి కోర్టే అవకాశం ఇచ్చినట్లు అయ్యేది. తప్పు జరిగింది కౌంటింగ్‌లో కనుక, మొత్తం ఎన్నికల ప్రక్రియను తిరగదోడాల్సిన పనిలేదంటూ సుప్రీంకోర్టు ఆ కుట్రను నిర్వీర్యం చేసింది. మొత్తం ప్రక్రియ చివరి అంకంలో ఒక వ్యక్తి చేసిన కుట్రను సరిదిద్దడానికి తాను నేరుగా జోక్యం చేసుకోవలసి వస్తున్నందంటూ ఆప్ అభ్యర్థి కుమార్‌ను తానే స్వయంగా విజేతను ప్రకటించింది.

ఇండియా కూటమి తన తొలి ఎన్నికల పోరాటంలోనే చిత్తుగా ఓడిపోయింది అంటూ బీజేపీ అధ్యక్షుడు జనవరి 30న చేసిన ట్వీట్ ఇప్పుడు తారుమారైంది. ఆప్–కాంగ్రెస్ కలసికట్టుగా విజయం సాధించాయి. కేసు విచారణ ఆరంభమైనప్పుడే సుప్రీంకోర్టు అనిల్ మాసిని తీవ్రంగా దుయ్యబట్టడం, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ కానివ్వనని వ్యాఖ్యానించడంతో ఆ ఫలితాన్ని కోర్టు రద్దుచేయవచ్చునని బీజేపీ ఊహించి ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేసుకుంది. బీజేపీ అభ్యర్థి శంకర్‌తో వెంటనే రాజీనామా చేయించి, ముగ్గురు ఆప్ ఎమ్మెల్యేలను చేర్చుకొని, సొలిసిటర్ జనరల్ ద్వారా రీపోలింగ్ కోసం కోర్టును అభ్యర్థించింది. తన మనిషి తప్పుపనిచేస్తూ సుప్రీంకోర్టుకు దొరికిపోయిన తరువాత కూడా ఆ పార్టీ ఉన్నతంగా వ్యవహరించకుండా, అధికారంకోసం వెంపర్లాడటం వల్ల మరోమారు ఘోరమైన అవమానం ఎదుర్కోవాల్సివచ్చింది. చట్టాలు, శాసనాలు సులభంగా తేల్చలేని సందర్భాల్లో, ఒక వివాదాన్ని పరిష్కరించేందుకు ఆర్టికల్ 142 సుప్రీంకోర్టుకు విశేషమైన అధికారాలను ఇస్తున్నది. నిర్దిష్ట పరిధిలేని ఈ అధికారాలతో పరిపూర్ణమైన న్యాయం చేకూర్చే పేరిట కోర్టు ఏకపక్షంగా వ్యవహరించగలదన్న విమర్శలు ఉన్నప్పటికీ సర్వోన్నత న్యాయస్థానం ఇప్పటివరకూ దీనిని పరిమితంగానే వాడుతూవస్తోంది. నిజానికి ఇంతకంటే కీలకమైన కేసుల్లో కూడా దీని వినియోగాన్ని కోర్టు గతంలో తిరస్కరించింది. ఇప్పుడు కెమెరా కళ్ళకు చిక్కిన నేరాన్ని ఛేదించి, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించిన సర్వోన్నత న్యాయస్థానం కనిపించని కుట్రలను భగ్నం చేసేందుకు కూడా 142 వాడితే బాగుండునని అనేకుల ఆశ.

జైనమతం, భగవాన్ మహావీర్ జీవితం నుంచి ప్రపంచం ప్రేరణ పొందడానికి సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ వంటి మహానుభావులే కారణం. జైన సామాజిక వర్గంలో ఆయన ఉన్నత స్థానంలో నిలిచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాలేదు. మతాలు, ప్రాంతాలు, సంస్కృతులకు అతీతంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చారు. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారు.




విజ్ఞానజ్యోతి ఆచార్య విద్యాసాగర్ జీ

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ ఆదివారం సమాధిని పొంది మనందరినీ విషాదంలో ముంచెత్తారు. లోతైన జ్ఞానం, ఎల్ల లెరుగని దయ, మానవాళిని ఉద్ధరించాలన్న అచంచలమైన నిబద్ధతతో ఆయన జీవితం ఆధ్యాత్మికంగా సుసంపన్నమయింది. అనేక సందర్భాల్లో ఆయన ఆశీస్సులు అందుకున్న గౌరవం నాకు దక్కింది. అందువలన, నాతో సహా లెక్కలేనన్ని ఆత్మలకు మార్గాన్ని ప్రకాశవంతం చేసిన మార్గదర్శక కాంతిని కోల్పోయినట్లుగా నేను తీవ్రమైన లోటును అనుభవిస్తున్నాను. ఆయన అనురాగం, ఆప్యాయత, ఆశీస్సులు కేవలం సుహృద్భావ సంకేతాలు మాత్రమే కాదు, ఆధ్యాత్మిక శక్తిని ప్రసరింపజేసి, ఆయనతో సన్నిహితంగా మెలిగిన అదృష్టవంతులందరినీ శక్తిమంతం చేసి, స్ఫూర్తిదాయకంగా నిలిచాయి.

జ్ఞానం, కరుణ, సేవ కలిగిన త్రివేణిగా పూజ్య ఆచార్య జీ ఎప్పటికీ గుర్తుండిపోతారు. ఆయన నిజమైన తపస్వి. ఆయన జీవితం భగవాన్ మహావీర్ ఆదర్శాలకు ప్రతీక. ఆయన జీవితం జైన మతం మూల సూత్రాలకు ఉదాహరణగా నిలిచింది, దాని ఆదర్శాలను తన సొంత ఆచరణలు బోధనల ద్వారా ప్రతిబింబింప చేశారు. సకల జీవరాశులపట్ల ఆయనకున్న శ్రద్ధ జైన మతానికి జీవితం పట్ల ఉన్న అమితమైన గౌరవానికి అద్దం పట్టింది. ఆలోచనలో, మాటలో, చేతల్లో నిజాయితీకి జైన మతం ఇచ్చిన ప్రాధాన్యాన్ని ప్రతిబింబిస్తూ ఆయన నిజాయతీతో కూడిన జీవితాన్ని గడిపారు. ఆయన చాలా సరళమైన జీవనశైలిని కూడా అనుసరించారు. జైనమతం, భగవాన్ మహావీర్ జీవితం నుంచి ప్రపంచం ప్రేరణ పొందడానికి ఆయన వంటి మహానుభావులే కారణం. జైన సామాజిక వర్గంలో ఆయన ఉన్నత స్థానంలో నిలిచినప్పటికీ ఆయన ప్రభావం, పలుకుబడి కేవలం ఒక సామాజిక వర్గానికే పరిమితం కాలేదు. మతాలు, ప్రాంతాలు, సంస్కృతులకు అతీతంగా ప్రజలు ఆయన వద్దకు వచ్చారు. ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఆధ్యాత్మిక జాగృతికి ఆయన అవిశ్రాంతంగా కృషి చేశారు.

విద్య ఆయన హృదయానికి చాలా దగ్గరైన రంగం. విద్యాధర్ (ఆయన చిన్ననాటి పేరు) నుండి విద్యాసాగర్ వరకు ఆయన ప్రయాణం విజ్ఞానాన్ని సంపాదించడం, అందించడంలో లోతైన నిబద్ధతతో కూడుకున్నది. న్యాయమైన, విజ్ఞానవంతమైన సమాజానికి విద్య మూలస్తంభమని ఆయన ప్రగాఢ విశ్వాసం. వ్యక్తులను శక్తివంతం చేయడానికి, లక్ష్యం, సహకారంతో కూడిన జీవితాలను గడపడానికి వీలు కల్పించే సాధనంగా జ్ఞానం లక్ష్యాన్ని అతను సమర్థించాడు.

న్యాయమైన, జ్ఞాన సంపన్నమైన సమాజానికి విద్య మూలస్తంభమని అతని దృఢ విశ్వాసం. వ్యక్తులకు సాధికారత కల్పించి ఒక ప్రయోజనం, సేవాభావంతో జీవితం గడిపేందుకు దోహదపడే సాధనంగా విద్యను ఆయన భావించారు. స్వీయ–అధ్యయనం, స్వీయ–అవగాహన ప్రాముఖ్యతను నిజమైన విజ్ఞానానికి మార్గాలుగా ఆయన బోధనలు నొక్కిచెప్పాయి. జీవితకాల అభ్యాసం, ఆధ్యాత్మిక ఎదుగుదలలో నిమగ్నం కావాలని వారి అనుచరులను ప్రబోధించాయి.



అదే సమయంలో, మన సాంస్కృతిక విలువలతో ముడిపడి ఉన్న విద్యను మన యువత పొందాలని సంత్ శిరోమణి ఆచార్య విద్యాసాగర్ జీ మహరాజ్ జీ ఆకాంక్షించారు. నీటి ఎద్దడి వంటి కీలక సవాళ్లకు పరిష్కారం కనుగొనలేక పోయామని, గతం నుంచి నేర్చుకున్న పాఠాలకు దూరంగా ఉండటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన తరచూ చెప్పేవారు. సంపూర్ణ విద్య అనేది నైపుణ్యం నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించేదని ఆయన విశ్వసించారు. భారతదేశ భాషా వైవిధ్యం పట్ల ఆయన ఎంతో గర్వపడ్డారు. భారతీయ భాషలను నేర్చుకోవడానికి యువతను ప్రోత్సహించారు.

పూజ్య ఆచార్య జీ స్వయంగా సంస్కృతం, ప్రాకృతం, హిందీలో విస్తృతంగా రచనలు చేశారు. ఒక సాధువుగా ఆయన చేరుకున్న శిఖరాలు, భూమిపై ఆయన ఎంత నిలదొక్కుకున్నారో ఆయన ప్రతిష్ఠాత్మక రచన 'మూక్మతి'లో స్పష్టంగా కనిపిస్తుంది. తన రచనల ద్వారా అణగారిన వర్గాలకు గళం అందించారు.

ఆరోగ్య సంరక్షణ రంగంలో కూడా పూజ్య ఆచార్య జీ చేసిన కృషి చిరస్మరణీయం. ముఖ్యంగా నిరుపేదల నివాస ప్రాంతాల్లో ఆయన అనేక ప్రయత్నాల్లో పాలుపంచుకున్నారు. ఆరోగ్య సంరక్షణ పట్ల ఆయన విధానం సంపూర్ణమైనది, శారీరక శ్రేయస్సును ఆధ్యాత్మిక శ్రేయస్సుతో మిళితం చేస్తుంది, తద్వారా వ్యక్తి మొత్తం అవసరాలను తీర్చింది.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ విద్యాసాగర్ జీ మహరాజ్ జీ జాతి నిర్మాణం పట్ల చూపిన నిబద్ధత గురించి రాబోయే తరాలు విస్తృతంగా అధ్యయనం చేయాలని నేను ప్రత్యేకంగా కోరుతున్నాను. పక్షపాత ఆలోచనలకు అతీతంగా జాతీయ ప్రయోజనాలపై దృష్టి సారించాలని ప్రజలను ఆయన ఎల్లప్పుడూ కోరేవారు. ప్రజాస్వామ్య ప్రక్రియల్లో భాగస్వామ్య వ్యక్తీకరణగా ఓటును భావించిన, బలంగా విశ్వసించిన వారిలో ఆయన ఒకరు. ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన రాజకీయాలను శ్రీ విద్యాసాగర్ జీ సమర్థించారు, విధాన రూపకల్పన ప్రజా సంక్షేమం గురించి ఉండాలి కానీ స్వప్రయోజనాల గురించి కాదు (లోక్‌నీతి లోక్ సంగ్రహ్ గురించి కాని లోభ్ సంగ్రహ్ గురించి) అని చెప్పారు.

తమ పట్ల, తమ కుటుంబాల పట్ల, సమాజం పట్ల, దేశం పట్ల బాధ్యతల విషయంలో తన పౌరుల నిబద్ధత పునాదులపై ఒక బలమైన దేశం నిర్మితమవుతుందని ఆయన విశ్వసించారు. నిజాయితీ, చిత్తశుద్ధి, స్వావలంబన వంటి సుగుణాలను పెంపొందించుకోవాలని ఆయన వ్యక్తులను ప్రోత్సహించారు, ఇది న్యాయమైన, దయగల, అభివృద్ధి చెందుతున్న సమాజ నిర్మాణానికి అవసరమని ఆయన భావించారు. మనం వికసిత్ భారత్ నిర్మాణం కోసం కృషి చేస్తున్నందున విధుల పట్ల ఈ ప్రాధాన్యత చాలా ముఖ్యం.

ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ క్షీణత విపరీతంగా ఉన్న ఈ కాలంలో, పూజ్య ఆచార్య జీ ప్రకృతికి కలిగే హానిని తగ్గించే జీవన విధానాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా, మన ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయానికి అత్యంత ముఖ్యమైన పాత్రను ఆయన చూశారు, వ్యవసాయాన్ని ఆధునికంగా, సుస్థిరంగా మార్చాలని కూడా ఆయన నొక్కి చెప్పారు. జైలు ఖైదీల సంస్కరణకు ఆయన చేసిన కృషి కూడా చెప్పుకోదగినది.

వేల సంవత్సరాలుగా మన నేల ఇతరులకు వెలుగులు చూపించి మన సమాజాన్ని బాగు చేసిన మహానుభావులను అందించింది. సాధువులు, సంఘ సంస్కర్తల ఈ మహోన్నత వంశంలో పూజ్య ఆచార్య జీ మహోన్నత వ్యక్తిగా నిలుస్తారు. ఆయన ఏం చేసినా వర్తమానం కోసమే కాకుండా భవిష్యత్తు కోసం కూడా చేసేవారు. గత ఏడాది నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్‌లోని డోంగర్‌గఢ్ లోని చంద్రగిరి జైన మందిరాన్ని సందర్శించే అవకాశం నాకు లభించింది. అప్పటి పూజ్య ఆచార్య జీ సందర్శన నా చివరి సమావేశం అవుతుందని నాకు తెలియదు. ఆ క్షణాలు చాలా ప్రత్యేకమైనవి. ఆయన నాతో చాలాసేపు మాట్లాడి, దేశానికి సేవ చేయడంలో నేను చేసిన కృషిని ఆశీర్వదించారు. మన దేశం తీసుకుంటున్న దిశ, ప్రపంచ వేదికపై భారత్‌కు లభిస్తున్న గౌరవం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. తాను చేస్తున్న పని గురించి మాట్లాడేటప్పుడు ఉత్సాహం చూపించారు. అప్పుడు, ఎప్పుడూ, వారి సున్నితమైన చూపులు, నిర్మలమైన చిరునవ్వు శాంతి, సేవా భావనను కలిగించడానికి సరిపోతాయి. ఆయన ఆశీస్సులు మనసుకు ఓదార్పునిచ్చే ఔషధంలా, మనలోని, చుట్టుపక్కల ఉన్న దైవిక ఉనికిని గుర్తు చేస్తాయి.

సంత్ శిరోమణి ఆచార్య శ్రీ 108 విద్యాసాగర్ జీ మహరాజ్ జీ లేని లోటును ఆయన గురించి తెలిసినవారు, ఆయన బోధనలు, జీవితం స్పృశించినవారు శూన్యంగా భావిస్తారు. అయితే, ఆయన వల్ల స్ఫూర్తి పొందినవారి హృదయాల్లో ఆయన ఎప్పటికీ చిరస్థాయిగా నిలిచిపోతారు. శ్రీ విద్యాసాగర్ జీ జ్ఞాపకాలను గౌరవించడంలో, వారు బోధించిన విలువలను ప్రతిబింబించడానికి మేము కట్టుబడి ఉన్నాము. ఈ విధంగా, మనం ఒక గొప్ప ఆత్మకు నివాళులు అర్పించడమే కాకుండా, మన దేశం, ప్రజల కోసం ఆయన లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తాము.

■ నరేంద్ర మోదీ

నైతికనిష్ఠ లేని నరేంద్రుడు

ఏ నాయకుడైనా పార్టీని గెలిపించినంత కాలం ఆ పార్టీ కార్యకర్తలందరూ ఆయనను ఆకాశానికి ఎత్తుతూ ప్రశంసల వర్షం కురిపించడం సహజం. ఆ నాయకుడి పొరపాట్లను ప్రస్తావించడం, చేసిన పనులను విమర్శనాత్మకంగా సమీక్షించే సాహసం ఎవరికీ ఉండదు. వందిమాగధ సంస్కృతిని ప్రోత్సహించే విషయంలో భారతీయ జనతా పార్టీ అన్ని పార్టీలను మించిపోయింది. 'మీరు ప్రతిపక్షాలు చేసే విమర్శల జోలికి పోకండి.. మనమేమి చేశామో ప్రజలకు చెప్పండి చాలు.' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17, 18 తేదీల్లో జరిగిన భారతీయ జనతా పార్టీ జాతీయ సదస్సులో నేతలకు ఉద్బోధించారు. బీజేపీ జాతీయ సదస్సులో వక్తలందరూ మోదీని ఆకాశానికెత్తుతూ ప్రసంగాలు చేయడంలో పోటీ పడ్డారు. పేరుకు ప్రవేశపెట్టింది రాజకీయ, ఆర్థిక తీర్మానాలైనప్పటికీ అవి మోదీ అభినందన తీర్మానాలనడంలో అతిశయోక్తి లేదు. ప్రతి పేరాలో కనీసం రెండుసార్లు మోదీ అన్న పేరు లేకుండా తీర్మానాలను లిఖించలేదు. 'ఈ ఎన్నికల్లో అభ్యర్థి ఎవరు పోటీ చేశారన్న దానితో ప్రమేయం లేదు. అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థి కమలమే.' అని మోదీ అన్నారు. కాని అన్ని నియోజకవర్గాల్లో అభ్యర్థి మోదీయే అన్న విషయం పోటీ చేసే వారందరికీ తెలుసు. పార్టీ పేరుతో కాకుండా 'మోదీ గ్యారంటీ' పేరుతో ప్రధానమంత్రే స్వయంగా ప్రచారం చేసుకుంటున్నప్పుడు పార్టీ కన్నా నేతకే ఎక్కువ ప్రాధాన్యముంటుందన్న విషయం స్పష్టమే కదా!

రెండు రోజుల జాతీయ సదస్సులో బీజేపీ నేతలకు స్పష్టమైంది ఒక్కటే. ఒక వైపు రామభజన చేస్తూనే మరో వైపు మోదీ భజన చేస్తే సరిపోతుందని వారికి అర్థమైంది. ఈ రెండే ఎన్నికల్లో గెలిచేందుకు తారక మంత్రమని నేతలంతా వారికి దిశా నిర్దేశం చేశారు. బీజేపీ ఒక్కటే ఎన్నికల్లో 370 సీట్లు గెలవాలని కూడా ప్రధానితో సహా నేతలంతా భారీ లక్ష్యాన్ని విధించారు. కాని 370 సీట్లు సాధించడం అంత కష్టమని వారికి కూడా తెలియనిది కాదు. పుల్వామా, బాలాకోట్ ఘటనల తర్వాత కూడా బీజేపీకి 303 సీట్లు దాటలేదు. మధ్యప్రదేశ్, గుజరాత్, బిహార్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక, హర్యానా, హిమాచల్, మహారాష్ట్ర, ఢిల్లీ, జార్ఖండ్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిషా, ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్డీఏకు గతంలో అత్యధిక సీట్లు లభించాయి. ఈ సారి మళ్లీ అన్ని సీట్లు రావడంతో పాటు గతంలో ఓడిపోయిన స్థానాల్లోనూ బీజేపీ గెలవాలంటే దేశ వ్యాప్తంగా మోదీ ప్రభంజనం వీయాలి.

రామమందిరం, మోదీ ఆకర్షణ, వికసిత్ భారత్ వంటి పదాలతోనే ఈ ప్రభంజనం వీస్తుందన్న నమ్మకం బీజేపీ నేతలకే ఉంటే అందుకు సంబంధించిన ప్రచారంతోనే ఊదరగొట్టి మౌనంగా ఉండేవారు. ఒక వేళ మోదీ గాలి అంతగా వీసే అవకాశాలుంటే ఇండియా కూటమి పేరుతో దేశంలో ఇతర పార్టీలన్నీ ఏకం అయినా ఆయనను ఏమీ చేయలేకపోయేవారు. 'మీరంతా ఒకవైపు, నేనొక్కడినే మరో వైపు' అని మోదీ గతంలో పార్లమెంట్‌లో ఛాతీ కూడా చరుచుకున్నారు. అటువంటప్పుడు ప్రతిపక్షాలను కూడా ఛిన్నాభిన్నం చేసేందుకు, దేశంలో ఉన్న ప్రతి బీజేపీయేతర పార్టీని బలహీనపరిచి సామదానభేద దండోపాయాలతో వారిని వశపరుచుకునేందుకు ఎందుకు ప్రయత్నిస్తున్నారు? కేవలం తమ కంటే బాగా దేశాన్ని ఎవరూ అభివృద్ధి చేయలేరని, కాంగ్రెస్ పాలనలో దేశం భ్రష్టుపట్టిందనే ప్రచారాలతోనే ప్రజలను వశపరుచుకోలేమన్న అపనమ్మకం ఉండడమే అందుకు కారణమా?



> రామరాజ్యం అనేది ప్రధానంగా నైతిక విలువలకు సంబంధించిన దృక్కోణం. బీజేపీని బలోపేతం చేసే ప్రయత్నంలో ఆ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారు. కార్పొరేట్ల నిధులు పొందేందుకే ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీ నైతికతను ప్రశ్నించింది. చంఢీగఢ్ మేయర్ ఎన్నికలో రిటర్నింగ్ అధికారి అక్రమాలనూ సుప్రీంకోర్టే బయటపెట్టడం బీజేపీకి మరో విఘాతం. వ్యవస్థల్ని అవినీతి నుంచి ప్రక్షాళన చేస్తామన్న వాగ్దానంతో అధికారంలోకి వచ్చిన మోదీకి గెలవడమే ప్రధానం కాని ఎలా గెలిచామన్నది ముఖ్యం కాదేమో!



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

'ప్రతిపక్ష నేతలను భయపెట్టడం ద్వారా మీరు వారిని మీ పార్టీలోకి ఎందుకు లాగుతున్నారు. ఇది మంచిదేనా? అని ఇటీవల ప్రధానమంత్రి నరేంద్రమోదీని పార్లమెంట్‌లో ప్రశ్నించినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. 'మేము ఎవర్నీ మా వైపు లాగడం లేదు, వారే వస్తానంటే మేమేం చేయగలం? మా ప్రభుత్వ పాలన చూసి ఆకర్షితులై మా పార్టీలోకి వస్తున్నారు' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ జవాబు చెప్పారు. ఇందులో ఎంత నిజం ఉన్నదో చేరిన వారికి, చేర్చుకున్న వారికే తెలియాలి.

గత ఏడాది జూలైలోనే ఉత్తరప్రదేశ్‌లో పెద్ద ఎత్తున ఓబీసీ నేతల్ని బీజేపీలో చేర్చుకున్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీకి వ్యతిరేకంగా వారణాసిలో సమాజ్‌వాదీ పార్టీ నుంచి పోటీ చేసిన శాలినీ యాదవ్ కూడా వీరిలో ఉన్నారు. సమాజ్‌వాది, బహుజన సమాజ్, ఆరఎల్‌డి పార్టీల నుంచి వలసలను ప్రోత్సహించడం బీజేపీ నిరంతరం చేస్తూనే ఉన్నది. ఉత్తరప్రదేశ్‌లో మొత్తం 80 సీట్లను సాధించి సమాజ్‌వాది పార్టీ భవిష్యత్తును చెరిపేసేందుకు బీజేపీ కృతనిశ్చయంతో ఉన్నది. అంతేకాదు, దాదాపు అన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను వశపరుచుకోవడమో, దెబ్బతీయడమో లక్ష్యంగా బీజేపీ ఎన్నో చర్యలు తీసుకుంది. బిహార్‌లో నితీశ్ కుమార్ నేతృత్వంలోని జెడి(యు), కర్ణాటకలో జెడి(ఎస్), మహారాష్ట్రలో శివసేన (ఏక్‌నాథ్ షిండే), ఎన్‌సిపి (అజిత్ పవార్) బీజేపీ ఛత్రఛాయలోకి క్రమంగా వచ్చాయి. అకాలీదళ్, ఆరఎల్‌డి ఆ మార్గంలో ఉన్నాయి. మరికొన్ని పార్టీలకు కూడా ఈ మార్గాన్ని అవలంబించక తప్పని పరిస్థితి బీజేపీ కల్పించింది. ఇక ఇండియా కూటమిలో ఉన్న ఆమ్‌ఆద్మీ పార్టీ, జెఎంఎం, తృణమూల్ కాంగ్రెస్‌లను భయ భ్రాంతులకు గురిచేసేందుకు రక రకాల శక్తులను ప్రయోగిస్తున్నారు.

ఏ విధంగానైనా 2024 ఎన్నికల్లో అత్యధిక సీట్లు సాధించేందుకు వీలుగా సాధ్యమైనంత మందిని తమ పార్టీలో చేర్చుకునేందుకు బీజేపీ చేయని ప్రయత్నమంటూ లేదు. ప్రతిపక్షాల్లోంచి ఎవరు వచ్చినా చేర్చుకునేందుకు బీజేపీ ఏకంగా ఉపాధి మేళాలే ప్రారంభించింది. ఈ ఉపాధి మేళాల్లో పోస్టుల సంఖ్య అపరిమితం. ఇక అపేక్షిసుకున్న వారి విషయంలో పెండింగ్‌లో ఉన్న ఆర్థిక నేరాలు, క్రిమినల్ కేసులు కూడా బుట్టదాఖలయే అవకాశాలున్నాయి. కేంద్ర సంస్థల దర్యాప్తులు నత్తనడకన సాగుతాయి. ఢిల్లీ పెద్దలు తలుచుకుంటే ఏ కేసులోనైనా ఉపశమనం లభిస్తుంది లేదా కొత్త కేసులు పుట్టుకొస్తాయి. కొందరికి చేరిన వెంటనే పదవులు లభిస్తాయి. జ్యోతిరాదిత్య సింధియాకు కేంద్ర మంత్రి పదవి లభిస్తే, ఒకప్పుడు రాహుల్ గాంధీ కుడిభుజమైన యుపి నేత ఆర్‌పిఎన్ సింగ్, మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, కాంగ్రెస్‌ను వదిలి షిండే శివసేనలో చేరిన మిలింద్ దేవరకు రాజ్యసభ పదవులు వరించాయి. బీజేపీలో ఉన్న వారికంటే కాంగ్రెస్ నుంచో మరో ప్రధాన పార్టీ నుంచో వచ్చిన వారికి మోదీ హయాంలో విలువ ఎక్కువ అనడంలో సందేహం లేదు. ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ ఆపరేషన్ కమల్ ఆకర్షణకు ఎంతమంది లోనవుతారో చెప్పలేం.

బీజేపీ రెండు రోజుల జాతీయ సదస్సులో రామమందిరంపై చేసిన తీర్మానం అత్యంత ముఖ్యమైనది. రామమందిర నిర్మాణానికి పూర్తి ఘనత మోదీకే దక్కిందని ప్రశంసల వర్షం కురిపించిన పార్టీ నేతలు ఆయనను గజమాలలతో సత్కరించారు. ఇక మోదీ హయాంలో రామరాజ్యం ఏర్పడుతుందని, అది వేయేళ్లు కొనసాగుతోందని ప్రత్యేకంగా తీర్మానించారు. అందరికీ భాగస్వామ్యం కల్పించే రామరాజ్యం కావాలని వారు అభిలషించారు. అంటే ఇతర పార్టీలనేతలందర్నీ నయానో భయానో చేర్చుకుని భాగస్వామ్యం కల్పించడమని ఈ తీర్మానం ఉద్దేశమా?

రామరాజ్యం అనేది ప్రధానంగా నైతిక విలువలకు సంబంధించిన దృక్కోణం. కాని బీజేపీని రాజకీయంగా బలోపేతం చేసే అత్యధిక సీట్లు సాధించడమే పరమావధిగా చేసే ప్రయత్నంలో భాగంగా ఈ విలువలకు తిలోదకాలు ఇస్తున్నారనే ఆరోపణలు చాలా కాలం నుంచి ఉన్నాయి. బెంగాల్‌లో సువేందు అధికారి నుంచి మహారాష్ట్రలో అశోక్ చవాన్ వరకు వందలాది నేతలు ఆర్థిక నేరాలకు పాల్పడినవారే. ముంబైలో కార్గిల్ యుద్ధ వీరుల కోసం నిర్మించిన ఆదర్శ్ హౌజింగ్ పథకంలోనే భారీ అవినీతికి పాల్పడ్డాడన్న ఆరోపణలు అశోక్ చవాన్‌పై ఉన్నాయి. సైనికులు, వారి కుటుంబాలకే కాకుండా అనేక మంది ఇతరులకు, చివరకు తన కుటుంబ సభ్యులకు కూడా ఫ్లాట్లు కేటాయించుకున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న అశోక్ చవాన్‌పై కేసు ఇంకా సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నది. తాము అధికారంలోకి వస్తే అశోక్ చవాన్‌ను జైలుకు పంపిస్తామని నరేంద్రమోదీ పదేళ్ల క్రితమే ప్రకటించారు. కాని పదేళ్ల తర్వాత అదే అశోక్ చవాన్ బీజేపీలో చేరారు. అశోక్ చవాన్ మాత్రమే కాదు, ఎన్‌సిపిని చీల్చిన అజిత్ పవార్‌పై కూడా ఎన్నో కేసులు ఉన్నాయి. బీజేపీలో చేరితే ఎన్ని కేసులున్నా నిర్భయంగా ఉండవచ్చుననే ప్రచారం జరుగుతోంది. మనీలాండరింగ్ చట్టంలోని సెక్షన్ 45(ఏ)ను రద్దు చేస్తే సగం మంది బీజేపీ నేతలు ఆ పార్టీలో ఉండరని ఇటీవల ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. 'నన్ను కూడా అవినీతి కేసులో ఇరికించారు కనుక బీజేపీలో చేరతానంటే చేర్చుకుంటారేమో?' అని తృణమూల్ నేత మహువా మొయిత్రా వ్యాఖ్యానించారు.

కార్పొరేట్లకు ప్రయోజనాలు కట్టబెట్టి, వారి నుంచి అక్రమ నిధులను పొందేందుకే ఎన్నికల బాండ్ల వ్యవస్థను ప్రవేశపెట్టారని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పే బీజేపీ నైతికతను ప్రశ్నించింది. ఆ తర్వాత చండీగఢ్ మేయర్ ఎన్నిక సందర్భంగా రిటర్నింగ్ అధికారి చేసిన అక్రమాలను సుప్రీంకోర్టే బయటపెట్టడం బీజేపీకి మరో విఘాతం. వ్యవస్థల్ని అవినీతి నుంచి ప్రక్షాళన చేస్తామని వాగ్దానం చేసి అధికారంలోకి వచ్చిన మోదీకి గెలవడం ప్రధానం. ఎలా గెలిచామన్నది ముఖ్యం కాదేమో!

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

అబుధాబిలో ఏడు గోపురాల కోవెల

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ జాతీయ గీతం 'ఈషీ బిలాదీ' (లాంగ్ లివ్ మై కంట్రీ). 'దేశ ధర్మం ఇస్లాం, ఖురాన్ మా మార్గదర్శి' అని ఆ గీతంలోని ద్వితీయచరణం ఉద్ఘాటిస్తుంది. తమ గడ్డపై నివాసముంటున్న హిందువుల ఆధ్యాత్మిక అవసరాన్ని (దైవారాధన మందిరం) యుఎఇ ఆలస్యంగానైనా గుర్తించి, నెరవేర్చింది. పర్షియన్ గల్ఫ్ తీరస్థ దేశాలలో యునైటెడ్ అరబ్ ఏమిరేట్స్ విలక్షణమైనది. అధికారిక మతం ఇస్లాం అయినప్పటికీ మతం అనేది దాదాపుగా వ్యక్తిగత వ్యవహారంగా భావించబడుతుంది. పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలోని ఇతర దేశాల తరహా ఇస్లామీకరణ యుఎఇ లో లేదు. ఇస్లామిక్ ధర్మంతో దేశ పాలనను ముడిపెడితే అభివృద్ధికి విఘాతం కలుగుతుందని పాలకులు భావించారు. యుఎఇ రాజధాని అయిన అబుధాబిలో ఆరు దశాబ్దాల క్రితం ఒక క్రైస్తవ ఆరాధానా మందిరం (చర్చి)ని ప్రారంభించారు. ఇప్పుడు హిందూ దేవాలయాన్ని నిర్మించారు. ఇంతకు ముందే దుబాయిలో రెండు హిందూ ఆలయాలు ఉన్నాయి.



అరేబియా సముద్ర తీరంలోని గల్ఫ్ దేశాలకు, గుజరాతీ వ్యాపారవేత్తలకు చరిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలోని యుఎఇలోని దుబాయితో

గల్ఫ్ లేఖ

పాటు పొరుగున ఉన్న ఒమాన్, బహ్రెయిన్ దేశాలలో కూడ దేవాలయాలు ఉన్నాయి. అవన్నీ కూడా గతంలో గుజరాతీ వర్తకులు నిర్మించినవే. ఇప్పటికీ అవి వారి నిర్వహణలోనే ఉన్నాయి.

గుజరాతీలలోని పటిదారు, పటేల్ సామాజిక వర్గాలలో అత్యధికులకు ఇలవేల్పు స్వామి నారాయణ్. బొచసన్వాసీ అక్షర్ పురుషోత్తం సంస్థాన్ (బాప్స్) పేర యుఎఇలోని గుజరాతీలు గత నలభై సంవత్సరాలుగా ప్రైవేటుగా స్వామి నారాయణ్ మందిరాన్ని నిర్వహిస్తున్నారు. న్యూఢిల్లీ, అహ్మదాబాద్‌లతో పాటు అమెరికా, ఆఫ్రికా దేశాలలో కూడ అక్షరధామం మందిరాలను నిర్మించిన ఈ బాప్స్ సంస్థ అబుధాబిలో కూడా మందిర నిర్మాణానికి సంకల్పించి సఫలమయింది.

హిందూ దేవాలయానికే కాకుండా యూదుల ప్రార్థనా మందిర నిర్మాణానికి కూడా యుఎఇ పాలకులు అనుమతించారు. అబ్రహాం మతాల ఆరాధనా కేంద్రాన్ని నెలకొల్పడంతో పాటు సకల మతాలను గౌరవించే విధంగా ప్రత్యేకంగా ఒక మంత్రిత్వ శాఖను యుఎఇ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. తమ విజ్ఞప్తిని కూడ పరిశీలించాలని బాప్స్ నిర్వహకులు కోరడంతో దేవాలయ నిర్మాణానికి అడుగు ముందుకుపడింది. ఈ తరుణంలో ప్రధానమంత్రి అయిన నరేంద్ర మోదీ అబుధాబిలో యువరాజుతో సమావేశం కావడానికి వెళ్తున్నప్పుడు తమ ఆలయ విషయాన్ని కూడ ప్రస్తావించాలని గుజరాతీలు ఆయన్ని కోరారు. మోదీ అభ్యర్థన మేరకు స్వామి నారాయణ్ సంస్థ కొనుగోలు చేయాలనుకొన్న స్థలానికి మరో మూడింతలు అధిక స్థలాన్ని (13.5 ఎకరాలు) రాజు శేఖ్ మోహమ్మద్ బిన్ జాయద్ విరాళంగా ఇచ్చారు. రాజు వ్యక్తిగత విరాళానికి, అదనంగా మరో 13 ఎకరాల స్థలాన్ని సువిశాలమైన పార్కింగ్ నెలవుకై ప్రభుత్వం కేటాయించింది. ప్రధాని మోదీ 2018లో రెండవసారి దుబాయిని సందర్శించిన సందర్భంగా దేవాలయ నిర్మాణానికి రిమోట్ కంట్రోల్ ద్వారా భూమి పూజ చేశారు. ఇటీవల ఏడవసారి పర్యటనలో దాని ప్రారంభోత్సవానికి ఆయన హాజరయ్యారు. ఆలయాన్ని ప్రారంభించింది స్వామి నారాయణ్ సంస్థ గురువు మహంత్ స్వామి మహారాజ్ అయినా ప్రధాని మోదీ దీన్ని ప్రారంభించినట్లుగా ప్రచారం జరిగింది.

> యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనేది ఏడు చిన్న రాజ్యాల (అబుధాబి, అజ్మాన్, దుబాయ్, ఫుజైరా, రస్ అలె[illegible]మా, షార్జా, ఉమ్ అల్ కె[illegible]) సమాఖ్య. అబుధాబి లోని స్వామి నారాయణ్ ఆలయానికి ఏడు గోపురాలు ఉన్నాయి. యుఎఇలోని ఏడు రాజ్యాలకు ప్రతీకగా ఈ ఏడు గోపురాలు భక్తుల మనస్సుల్లో భాసిల్లుతున్నాయి. మూలవిరాట్టు స్వామి నారాయణతో పాటు మరో ఆరు దేవతామూర్తులను ఈ విశిష్ట ఆలయంలో ప్రతిష్ఠించారు. వాటిలో ఒకటి తిరుమల ఏడు కొండలపై కొలువుదీరిన వేంకటేశ్వర స్వామి.

యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ అనేది ఏడు చిన్న రాజ్యాల (అబుధాబి, అజ్మాన్, దుబాయ్, ఫుజైరా, రస్ అలె[illegible], షార్జా, ఉమ్ అల్ కె[illegible]) సమాఖ్య. అబుధాబిలోని స్వామి నారాయణ్ ఆలయానికి ఏడు గోపురాలు ఉన్నాయి. యుఎఇలోని ఏడు రాజ్యాలకు ప్రతీకగా ఈ ఏడు గోపురాలు భక్తుల మనస్సుల్లో భాసిల్లుతున్నాయి. ఈ విశిష్ట ఆలయంలో మూలవిరాట్టు స్వామి నారాయణతో పాటు మరో ఆర్గురు దేవతామూర్తులను ప్రతిష్ఠించారు. ఈ దేవతామూర్తులలో ఒకరు తెలుగు వారి కలియుగ దైవం తిరుమల ఏడు కొండలపై కొలువు దీరిన శ్రీ వేంకటేశ్వర స్వామి. పద్మావతి శ్రీనివాస భగవాన్ పేర ఉన్న ఈ ఏడుకొండలవాడు నిస్సందేహంగా ఈ ఎడారి దేశాలలోని తెలుగు ప్రవాసులకొక ఆధ్యాత్మిక స్ఫూర్తి.

హిందూ ఆధ్యాత్మిక ఉన్నతి, భారతీయ శిల్పకళా సౌందర్యం ఉట్టిపడే విధంగా రాజస్థాన్ నుంచి దిగుమతి చేసుకొన్న 20 వేల టన్నుల పాలరాతితో రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలకు చెందిన రెండు వేల మంది శిల్పులు మూడు సంవత్సరాల వ్యవధిలో ఈ ఆలయాన్ని నిర్మించారు. తెలంగాణలో అద్భుతంగా జిల్లా కలెక్టరేట్ల కాంప్లెక్సులను నిర్మించిన షాపుర్జీ పలంజీ సంస్థే అబుధాబిలోని ఈ స్వామి నారాయణ్ మందిరాన్ని కూడా అద్భుతంగా నిర్మించింది. భారతీయ సంప్రదాయ దేవాలయాల వాస్తు శోభను తలదన్నేలా 402 తెల్ల పాలరాతి స్తంభాలను ఈ ఆలయ నిర్మాణంలో ఉపయోగించారు. ఒక్కొక్క స్తంభంపై దేవతల ప్రతిమలు, హైందవ జీవన విధానం ప్రతిబింబించే విధంగా శిల్పకళ ఉంది. తమ శిల్పకళతో ఆలయాన్ని అలంకరించిన శిల్పులలో రాజస్థాన్‌కు చెందిన మోహ్మద్ అజ్మల్ ఒకరు. మక్కా, మదీన పుణ్యక్షేత్రాలలో పాలరాయిపై ఖురాన్ సూక్తులను చెక్కిన అజ్మల్ అబుధాబి మందిర శిల్పాలపై కూడ తన ప్రతిభ కనబర్చాడు. ఆలయ ముఖద్వారంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన 3డి విధానంతో కూడిన అయోధ్యనగరిని వీక్షిస్తే మనస్సు భక్తి భావంతో నిండిపోయి తాము శ్రీరామచంద్రుడికి అత్యంత దగ్గరగా వెళ్తున్నామనే భావన కలుగుతుంది. పవిత గంగా, యమున నదీ జలాల ప్రవాహాన్ని స్ఫురింపజేసే విధంగా ఈ నదుల కృత్రిమ ప్రవాహాన్ని కూడ దేవాలయ క్రింది భాగంలో ఏర్పాటు చేయగా సరస్వతీ నదిని ప్రతిబింబించే విధంగా ప్రత్యేక లైట్ల ఫోకసింగ్‌ను ఏర్పాటు చేసారు. ఆలయంలో ఇంకా కొన్ని పనులు పూర్తి కావల్సి ఉన్నాయి. అబుధాబి మందిర ప్రారంభోత్సవ ఘట్టాన్ని ఆధ్యాత్మికత దృష్టితో మాత్రమే చూడాలి కానీ అయోధ్య కోణంతో కాదు.

■ మొహమ్మద్ ఇర్ఫాన్

అవనియందు అగ్రభాష

పేగు బంధంతో ముడిపడి
స్తన్య ధారతో నీలో జీవం పోసుకుని
మాతృమూర్తి లాలనలో బుజ్జగింపై
నాన్న పాలనలో నీలో మమేకమై
వెలుగొందు భాష అమ్మ భాష
అదియే నీకు అవనియందు అగ్ర భాష
అన్య భాషలు ఎన్ని ఉన్నా అవి అవసరానికే
అమృతం చిలికించేది అమ్మ భాషనే కదా సదా
భాషలెన్ని నేర్చిన.. మరువబోకు మాతృభాషని
పలకరింపులలో కూడా పరభాష పదాలు రానివ్వక
అధర కుసుమాలనుండి మాతృభాష
సుగంధాలను వెదజల్లుతూనే ఉండు
జలజాప్పుడి వేడిమికి ప్రాణకోటి జీవం పోసుకున్నట్టు
తల్లి భాష భాషణతో తనువు, మనసు పరవశించాలి
మన అమ్మ భాష పరిఢవిల్లాలి
మన భాష సజీవమై, అజరామరమై ఆచంద్రతారార్కం నిలవాలి
మాతృభాష ప్రేమికులకి కైమోడ్పులివే
కైకొను ప్రతిన మాతృభాషే ముద్దని

– దాసరి చంద్రమౌళి

విషాదానుభూతి


రాసులు రాసులుగా పుస్తకాలు/ విచ్చుకున్న పూలవనంలా
తడిమి తడిమి చూసుడే తప్ప/ దమ్మిడీ రాల్చని పర్సులు!
రవ్వా శ్రీహరి సాక్షిగా/ భావ జాలాల పేరు మీద
నిలువునా చీలిపోయిన మనుషులు
బయటి అసమానతలన్నీ/ లోపల మరింత స్పష్టంగా
సమస్త వివక్షలన్నీ/ మరింత బహిర్గతంగా!
ప్రధాన వేదిక ఆ పది రోజులు/ హడావుడి ఫ్యాషన్ పరేడే!
వచ్చామా కనిపించామా అంతే/ ఒక సెల్ఫీ ఒకింత నటన!
ఎవరి అవసరాలు వారివి
ఒకరిని మరొకరు వాడుకునే స్నేహాలు
ఎవరి సమూహం వారి వెంటే
సమాజోద్ధరణ ఓ కాగితపు పువ్వే
ఆచరణ త్యజించిన బుషిత్వం
ఆబగా ప్రచారాన్ని కలగంటున్నది!
ఈసారి బుక్ ఫేర్ ఉనికిని కోల్పోయి
సృజన స్పృహకు తూట్లు పొడవడం
పాఠకులు పొందిన విషాదానుభూతే!!



– కోట్ల వెంకటేశ్వర రెడ్డి

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిట్‌పేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76,
అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్, రోడ్ నంబరు–70,
జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఆంధ్రజ్యోతి
హనుమకొండ
బుధవారం 21 ఫిబ్రవరి 2024



విద్యుత్ కాంతుల్లో మేడారం జాతర పరిసరాలు

వనమంతా కనులై..

నేటి నుంచి మేడారం మహాజాతర



- జనంతో నిండిన అడవి పల్లె
- ప్రవాహంలా తరలివస్తున్న భక్తులు
- 10కిలోమీటర్ల మేర విస్తరించిన గుడారాలు
- జనారణ్యమవుతున్న మేడారం
- ఇప్పటికే చేరుకున్న 50లక్షల మంది
- కొనసాగుతున్న ముందస్తు మొక్కులు



జాతరకు వస్తున్న భక్తులు



మంగపేట మండలం కమలాపురం నుంచి ఎడ్లబండ్లపై వస్తున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 20 : మాఘశుద్ధ పున్నమి వెన్నెల్లో సమ్మక్క, సారలక్క దేవతలు గద్దెలపై కొలువుదీరే ఘడియలు ఆసన్నమవుతుండడంతో మేడారానికి భక్తులు పోటెత్తుతున్నారు. ఎటు చూసినా జనం ప్రభంజనమే కనిపిస్తోంది. ఇసుకవేస్తే రాలనంత జనం. మేడారందారులన్నీ జన ప్రవాహంతో కిటకిటలాడుతూ కనిపిస్తున్నాయి, బుధవారం సారలమ్మతో పాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు, గురువారం సమ్మక్క గెద్దపైకి చేరుతుండడంతో తల్లుల దర్శనానికి లక్షలాదిగా భక్తులు మేడారంవైపు తరలివస్తున్నారు. ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, ఎడ్లబండ్లలో భక్తులు నిరంతరాయంగా మేడారానికి కదిలివస్తున్నారు. కార్లు ఆటోలు, ట్రాక్టర్లు, డీసీఎం వ్యాన్లు, లారీలతో సహా అందుబాటులో ఉన్న దేన్నీ వదలకుండా వాటిలో మేడారానికి చేరుకుంటున్నారు. జాతర మొదలు కావడానికి నెల రోజుల ముందునుంచే భక్తుల రాక మొదలైంది. గద్దెలపై తల్లులు వేంచేసి ఉన్నప్పుడు దర్శించుకొని, మొక్కులు చెల్లించుకోవాలనే భక్తులు ఎన్ని కష్టాలకోర్చయినా జాతర సమయంలోనే రావాలనే పట్టుదలతో ఉంటారు. వారంతా సోమవారం నుంచే కుటుంబ సభ్యులతో బయలు దేరారు. ఎడ్లబండ్లపై బయలు దేరినవారు సోమవారమే జాతరకు బయలుదేరారు. ఈనెల 24వ తేదీ వరకు జాతర కొనసాగే వరకు మేడారంలోనే ఉండి ఆ తర్వాత తిరుగు ముఖం పట్టాలనుకునేవారు వారం రోజులకు సరిపడే నిత్యావసర సరుకులు, ఆహారపదార్థాలతో, యాటపోతులు, ఇతర సరంజామాతో బయలుదేరారు. వీరంతా మార్గమధ్యలో అటవీమార్గంలో చెట్ల కింద తాత్కాలికంగా బస చేయడం కనిపిస్తోంది. నీటి వనరున్న చోట్ల, చెట్ల నీడన సేదతీరున్నారు. మిగతా వారంతా ఆర్టీసితో సహా వివిధ వాహనాల్లో మేడారం బాటపడుతున్నారు.

లక్షలాది భక్తుల రాక

మేడారానికి ఇప్పటికే 50 లక్షల మందికిపైగా చేరుకున్నట్టు అంచనా. బుధ, గురు, శుక్రవారాల్లో మరో కోటి మందికి వరకు రావచ్చునని భావిస్తున్నారు. బుధవారం సాయంత్రానికి భక్తుల రాక మరింత పెరిగే అవకాశం ఉంది. గురువారం సమ్మక్క గద్దెపైకి చేరుకునే రోజు మేడారం వచ్చే భక్తుల సంఖ్య మరింత పెరగనున్నది. మంగళవారం ఉదయం నుంచి మేడారం వైపు వచ్చే వాహనాల సంఖ్య విపరీతంగా పెరగడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పోలీసులు అన్ని ముందు జాగ్రత్తచర్యలు తీసుకుంటున్నారు. అడుగడుగునా పోలీసులు మోహరించారు. మేడారానికి వచ్చే పలుదారుల గుండా వాహనాలను తరలిస్తున్నారు. కాగా, జాతరకు ముందే సుమారు 60లక్షల మంది మేడారం వచ్చి వనదేవతలను దర్శించుకున్నారు.

ఊళ్లన్నీ ఖాళీ

మేడారం జాతరకు జనం పెద్ద ఎత్తున బయలు దేరుతుండడంతో ఊళ్ళన్నీ క్రమంగా ఖాళీ అవుతున్నాయి. మంగళవారం నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాలు, మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ తదితర పొరుగు రాష్ట్రాల నుంచి సైతం భక్తులు, ముఖ్యంగా వివిధ తెగలకు చెందిన కోయలు, ఆదివాసీలు సంప్రదాయ

మిగతా 6వ పేజీలో..

రావమ్మా.. కన్నెపల్లి జాబిల్లి

- నేడు గద్దెలపైకి చేరనున్న సమ్మక్క తనయ సారలమ్మ
- సంప్రదాయ పద్ధతిలో తీసుకురానున్న పూజారులు

పుట్టు వెంట్రుకలతో ఉయ్యాలో.. ఎత్తుబెల్లాలతో ఉయ్యాలో... కొబ్బరి కాయలతోటి ఉయ్యాలో.. కోడిపుంజులతోటి ఉయ్యాలో.. దూరమనక వత్తురు ఉయ్యాలో.. రాత్రనక పగలనక వత్తురు ఉయ్యాలో.. అభయ విచ్చు సమ్మక్క తల్లి ఉయ్యాలో.. గద్దెమీదకు వచ్చెనమ్మ సారలమ్మ ఉయ్యాలో.. అంటూ భక్త జనం పులకిస్తుండగా సారలమ్మ బుధవారం కన్నెపల్లి నుంచి మేడారం బయలుదేరనుంది. సారలమ్మ కొలువైన కన్నెపల్లి ఆలయంలో బుధవారం ప్రధాన పూజారి కాక సారయ్య ప్రత్యేక పూజలు నిర్వహించి మేడారానికి తీసుకొస్తారు. ఈ క్రమంలోనే సంతానం కలగాలని, సమస్యలు తీరాలని తడి బట్టలతో భక్తులు వరం పడతారు. కన్నెపల్లి మీదుగా తన తమ్ముడు జంపన్నను పలకరిస్తూ జంపన్నవాగు పూజారులు దాటుతారు. ఈ సమయంలోనే శివసత్తుల పూనకాలతో భక్తుల పుణ్యస్నానాలతో జంపన్నవాగు పులకరిస్తుంది. తల్లికి స్వాగతం పలుకుతూ జయజయ నినాదాలతో హోరెత్తుతుంది.

పయనమైన పగిడిద్దరాజు

- పూనుగొండ్లలో పెళ్లి కుమారుడిగా ముస్తాబు
- భక్తుల పూనకాలతో మేడారానికి బైలెల్లిన సమ్మక్క భర్త

6

పూనుగొండ్ల నుంచి బయలుదేరిన పగిడిద్దరాజు



గద్దెనెక్కిన వరాల జంపన్న

- రాత్రి 8 గంటలకు ప్రతిష్ఠించిన పూజారులు
- మేడారం జాతరలో తొలి ఘట్టం ఆవిష్కృతం

6



జంపన్నను గద్దెపైకి చేర్చుతున్న పూజారులు

'సిరిసిల్ల'కు సాదర స్వాగతం



రాజయ్యకు స్వాగతం పలికిన కాంగ్రెస్ నేతలు

హనుమకొండ సిటీ, ఫిబ్రవరి 20 : స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ఛైర్మన్ సిరిసిల్ల రాజయ్యకు జిల్లా కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మంగళవారం హైదరాబాద్ నుంచి ఆయన వరంగల్‌కు వచ్చారు. మడికొండ నుంచి ఆయనను స్వాగతిస్తూ ర్యాలీగా వచ్చారు. కడిపికొండ బ్రిడ్జి వద్ద వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు స్వాగతం పలికారు. కాజీపేట చౌరస్తాలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వరంగల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ తదితరులు నాయకులు పూలమాలలు వేసి రాజయ్యకు స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఆయన వాహనాల ర్యాలీతో అమరవీరుల స్థూపం వద్దకు చేరుకొని పూలమాలలు వేసి నివాళులర్పించారు. హనుమకొండలోని అంబేడ్కర్, ములుగురోడ్డులోని జ్యోతిరావు పూలే, ఎంజిఎం సెంటర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాజయ్యను యాదవనగర్‌లోని ఓ ఫంక్షన్ హాలులో జరిగిన సన్మాన కార్యక్రమంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొద్దిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు తోట వెంకన్న, జక్కుల రవీందర్ యాదవ్, శ్రీమాన్, విజయశ్రీ రజాలీ, ఆనంద్, రవీందర్, కుమారస్వామి, అశోక్, సదానందం పాల్గొన్నారు.

హస్తం గూటికి మార్నేని?

- బీఆర్ఎస్‌ను వీడనున్నట్లు ప్రచారం
- ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డితో చర్చలు



ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు

హనుమకొండ టౌన్ / ఐనవోలు, ఫిబ్రవరి 20 : బీఆర్ఎస్ సీనియర్ నేత, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవిందర్‌రావు త్వరలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు సమాచారం. కొంత కాలంగా బీఆర్ఎస్ పట్ల అసంతృప్తితో ఉన్న ఆయన పార్టీ వీడేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. శాసనసభ ఎన్నికల ముందు నుంచే పార్టీ తీరుపై పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసిన రవిందర్‌రావు గత అసెంబ్లీ ఎన్నికల ముందు వర్ధన్నపేట బీఆర్ఎస్ టిక్కెట్ అరూరి రమేష్‌కు కాకుండా ఇతరులకు కేటాయించాలని కూడా రవిందర్‌రావు అధిష్టానానికి సూచించారు. ఆ తర్వాత కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధమయ్యారన్న చర్చ జరగ్గా.. అప్పట్లో బీఆర్ఎస్ ముఖ్య నేతలు సర్దిచెప్పడంతో వెనక్కి తగ్గినట్లు తెలిసింది. కాగా, మంగళవారం మార్నేని రవిందర్‌రావు ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డిని కలవడంతో ఆయన కాంగ్రెస్‌లో చేరడం దాదాపు ఖాయమని అర్థమవుతోంది. వేం నరేందర్‌రెడ్డి పిలుపు మేరకు హైదరాబాద్ వెళ్లిన మార్నేని రవిందర్‌రావు కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం ఖరారు చేసుకుని వచ్చినట్లు తెలిసింది. వేం నరేందర్‌రెడ్డితో మార్నేనికి మూడు దశాబ్దాలుగా సత్సంబంధాలున్నాయి. వారు ఇద్దరు గతంలో టీడీపీలో కలిసి పని చేయగా.. వేం నరేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరగా.. మార్నేని రవిందర్‌రావు బీఆర్ఎస్‌లో చేరి డీసీసీబీ చైర్మన్ అయ్యారు. అయితే వచ్చేఏడాది ఫిబ్రవరి 25కు మార్నేని రవిందర్‌రావు పదవీకాలం పూర్తవుతుంది. వచ్చే శాసనసభ ఎన్నికల నాటికి నియోజకవర్గాల పునర్విభజన జరిగితే వర్ధన్నపేట జనరల్ అయ్యే అవకాశాలున్నట్లు తెలిసింది. వర్ధన్నపేట నియోజకవర్గంపై మంచి పట్టు ఉన్నటువంటి రవిందర్‌రావు ఎమ్మెల్యేగా పోటీ చేయాలన్న

మిగతా 8వ పేజీలో..

నేడు గద్దెపైకి కన్నెపల్లి జాబిల్లి

» సంప్రదాయ పద్ధతిలో తీసుకురానున్న పూజారులు

మేడారం బృందం, ఫిబ్రవరి 20 : మేడారం మహాజాతర తొలి ఘట్టం బుధవారం ఆవిష్కృతం కానున్నది. బుధవారం మాఘశుద్ధ ఘడియల్లో పండు వెన్నెల వెలుగుల్లో సారలమ్మ మేడారంలోని గద్దెపైకి చేరుకోనున్నది. సారలమ్మ మేడారం చేరుకోవడంతో నాలుగు రోజుల పాటు జరిగే మహాజాతర ప్రారంభం కానున్నది. సమ్మక్క తర్వాత అంతే ప్రాముఖ్య త కలిగిన సారలమ్మ రాక కోసం భక్తులు భక్తిభావంతో ఎదురు చూస్తున్నారు. సారలమ్మను మేడారం తోడ్కొని వచ్చేందుకు ఆదివాసీ పూజారులు అన్ని ఏర్పాట్లతో సర్వసన్నద్ధంగా ఉన్నారు. సారలమ్మను బుధవారం సాయంత్రం కన్నెపల్లిలోని గుడి నుంచి ఆదివాసీ సాంప్రదాయాల ప్రకారం వడ్డెలు (పూజారులు) మేడారానికి తీసుకువస్తారు.



కన్నెపల్లిలో బుధవారం ఉదయం నుంచే పూజా కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. పూజారుల కుటుంబసభ్యులు ఆలయాన్ని శుద్ధి చేసి పసుపు కుంకుమలు, మామిడి తోరణాలతో అలంకరిస్తారు. సారలమ్మ పూజా సామగ్రిని శుద్ధి చేసి శక్తి పీఠం, ఆడేరాలు, పసిడి కుండలను పసుపు కుంకుమతో పూదిస్తారు. సాయంత్రం వేళ సారలమ్మను జన ప్రవేశం చేసే ఘట్టం మొదలవుతుంది. పూజా మందిరంలో ప్రధాన పూజారి సారయ్యతో పాటు ఇతర వడ్డెలు రహస్య పూజలు చేస్తారు. ఆలయం బయట ఆదివాసీ కళాకారులు సంప్రదాయ నృత్యాలు చేస్తారు. పూజారి కాక సారయ్య వెదురుబుట్ట(మొంటె)లో అమ్మవారి ప్రతిరూపమైన పసుపు, కుంకును భరిణలో తీసుకొని బయలు దేరుతారు. ఈ సందర్భంగా మిగతా ఆదివాసీ పూజారులు భక్తులు పెద్ద సంఖ్యలో వెంటరాగా మేడారానికి బయలు దేరుతారు. సారలమ్మను గుడి నుంచి బయటకు తీసుకువచ్చే ముందు భక్తులు దారి పొడవు నా సాష్టంగా పడతారు. సంతానం కలగాలని కోరుకునే మహిళలు తడిబట్టలతో తల్లి ముందు సాగిలపడతారు. వారిని దాటుకుంటూ పూజా రి తల్లిని తీసుకొని ముందుకు



పూజారి కాక సారయ్య, కన్నెపల్లిలోని సారలమ్మ ఆలయం

సాగుతారు. సారలమ్మను దర్శించుకునేందుకు భక్తులు వేల సంఖ్యలో గుడి వద్దకు చేరుకుంటారు. పూజ జరుగుతున్నంత సేపు బయట ఆతృతంగా ఎదురుచూస్తూ నిల్చుంటారు. పూజానంతరం తల్లిని తీసుకొని పూజారి బయటకు రాగానే మహిళలు నిల్లారపోసి స్వాగతం పలుకుతారు. వడ్డెలు కొమ్ము బూర ఊదుతారు. డోలు చప్పుళ్లు, కోయనృత్యాలతో ఆ ప్రాంతమంతా మారుమోగుతుంది. శివసత్తులు సిగాలు ఊగుతారు. మహిళలు హారతులు పడతారు. సారలమ్మ తరలివెళ్లే దారి పొడవునా భక్తులు నిలబడి తల్లికి నీరాజనాలు పలుకుతారు. ఈ సందర్భంగా భక్తులను అదుపు చేయడం కష్టమవుతుంది. సారలమ్మ రాక సందర్భంగా ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు అన్ని ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. భారీ ఎత్తున పోలీసులను మోహరిస్తున్నా రు. భక్తులను అదుపు చేసేందుకు దారి పొడవునా బారికేడ్లను ఏర్పాటు చేస్తున్నారు.

జంపన్నవాగు దాటుతూ..

సారలమ్మ వచ్చే క్రమంలో మార్గమధ్యలో జంపన్నవాగులో ప్రత్యేక పూజలు చేస్తారు. ఈ పూజల అనంతరం తల్లిని వాగుదాటిస్తారు. సారలమ్మ రూపంతో పూజారులు జంపన్నవాగులో అడుగుపెట్టగానే అప్పటికే వాగులో పుణ్యస్నానాలు చేసిన భక్తులు ఒక్కసారిగా జై సారక్క.. అంటూ నినాదాలు చేస్తారు. శివసత్తులు పూనకాలతో ఊగిపోతారు. సారలమ్మకు సోదరుడైన జంపన్న ఈ సందర్భంగా అక్క కాళ్లు కడిగి ఆశీస్సులు పొందుతారని భక్తుల ప్రగాఢ నమ్మకం. అక్కడి నుంచి సారలమ్మ మేడారంలోని సమ్మక్క గుడికి చేరుకుంటుంది. అప్పటికే ఇక్కడికి పగిడిద్దరాజు, గోవిందరాజు, నాగులమ్మ చేరుకుంటారు. ఇక్కడ పగిడిద్దరాజుకు, సమ్మక్కకు కన్నుల పండువగా కల్యాణం జరిపిస్తారు. అనంతరం సారలమ్మ ప్రతిరూపాన్ని మేడారం గద్దెపైకి చేరుస్తారు. దీంతో మహాజాతర మొదలవుతుంది.

ఎవరీ సారలమ్మ

ఆదివాసీల ఆరాధ్య దైవంగా భావించే సారలమ్మ వీరత్వానికి, త్యాగానికి ప్రతీక. కాకతీయులతో జరిగిన వీరోచిత పోరాటంలో సారలమ్మ కదనరంగంలో కత్తిదూసింది. తమ రాజ్యాన్ని, ఆదివాసీలను రక్షించుకునేందుకు యుద్ధంలో శత్రువులతో ఎంతో ధైర్యంగా తలపడింది. తన వీరోచిత పోరాటంతో శత్రు సైన్యానికి వెన్నులో వణుకు పుట్టించింది. 12వ శతాబ్దంలో కాకతీయ సైన్యాన్ని చెండాడుతూ అపరకాళిగా చెలరేగింది. తమను కాపాడేందుకు సారలమ్మ యుద్ధరంగంలో చూపించిన తెగువ, ప్రదర్శించిన త్యాగానికి ముగ్ధులైన కోయలు ఆమెను తమ ఆరాధ్యదైవంగా భావించారు. అప్పటి నుంచి సమ్మక్కతోపాటు సారలమ్మను కూడా తమ ఇలవేల్పుగా చేసుకొని పూజించడం మొదలు పెట్టారు. రెండేళ్లకోసారి వనదేవతల పేరున జాతరను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నారు. సారలమ్మను ప్రధానంగా సంతాన లక్ష్మిగా కొలుస్తారు. పిల్లలు లేని మహిళలు తల్లి గుడి వద్ద వరాలు పట్టడం కనిపిస్తుంది.



ములుగు వద్ద గట్టమ్మ తల్లికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గట్టమ్మ తల్లికి పోటెత్తిన భక్తులు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని తరలివెళ్లే భక్తులు ములుగులోని గట్టమ్మతల్లిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఇందులో భాగంగా మంగళవారం వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో రావడంతో ఆలయ పరిసరాలు కిక్కిరిశాయి. ఈ సందర్భంగా భక్తులు గట్టమ్మ తల్లిని దర్శించుకుని పసుపు,కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించుకుని పూజలు నిర్వహించారు. తమ ప్రయాణం మంచిగా జరగాలని, పిల్లాపాపలు, పాడి పంటలు బాగుండాలని అమ్మవారిని వేడుకున్నారు. అదేవిధంగా దేవాలయం సమీపంలో ఉన్న సమ్మక్క-సారలమ్మల గద్దెలను దర్శించుకుని బెల్లం, పసుపు, కుంకుమలు, కొబ్బరికాయలు సమర్పించుకున్నారు.

వరాల జంపన్న వచ్చె..

» రాత్రి 8 గంటలకు గద్దెపైకి చేర్చిన పూజారులు



కన్నెపల్లి నుంచి జంపన్నను తీసుకువస్తున్న పూజారులు

జంపన్నవాగు ఒడ్డున గద్దెపై ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

మేడారం, ఫిబ్రవరి 20: మహాజాతర నేపథ్యంలో సమ్మక్క తనయుడు జంపన్న మంగళవారం సాయంత్రం 8గంటలకు గద్దెకు చేరుకున్నాడు. పోలెబోయిన వంశీయులు పూజారి సత్యం ఆధ్వర్యంలో జంపన్నను కన్నెపల్లి గ్రామం నుంచి రాత్రి 7.09 గంటలకు జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెకు అంగరంగ వైభవంగా డోలు వాయిద్యాల నడుమ తీసుకొచ్చారు. శివసత్తుల పూనకాలతో రక్షకుడు గొంది సాంబశివరావు హనుమాన్ జెండాను ఎత్తుకుని రక్షకుడిగా వ్యవహరించారు. పూజారులు శ్రీనివాస్, సురేష్‌లు జలకం, దీప, దూప నైవేద్యాలు సమర్పిస్తూ జంపన్నను తీసుకువచ్చారు పగిడె రూపంలో ఉన్న జంపన్నను జంపన్నవాగు ఒడ్డున ఉన్న గద్దెపై ప్రత్యేక పూజలనడుమ ప్రతిష్ఠించారు. గద్దెపై నిలిచిన జంపన్నను దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. నిండుగా ప్రవహిస్తున్న జంపన్నవాగు నీటితో గద్దెపై నిలిచిన జంపన్న భక్తులకు వరం పడుతూ భక్తులు తన్మయత్వంతో తరించిపోయారు. నేటితో జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో ముందుగా జంపన్న గద్దెకు చేరుకోవడం ఆనవాయితీ. జంపన్న గద్దెకు చేరిన తర్వాతి రోజు నుంచి సారలమ్మ, పగిడిద్దెరాజు, గోవిందరాజు, జంపన్న మీదుగా నీటిలో నుంచి తాకుతూ వారి గద్దెలకు వెళ్తారు. ఈ తరుణంలో మంగళవారం జంపన్న ఆగమనం ప్రారంభమైంది.

కొండాయి నుంచి గోవిందరాజులు..

మేడారం : గోవిందరాజులు కొండాయి నుంచి బుధవారం సాయంత్రానికి నేరుగా సమ్మక్క పూజా మందిరానికి చేరుకుంటారు. కొండాయి నుంచి గోవిందరాజులు బయలు దేరడానికి ముందు పూజారులు ఆదివాసీ సంప్రదాయ పద్ధతిలో ప్రత్యేక పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ప్రధాన పూజారి దబ్బకట్ల గోవర్ధన్ పడిగ రూపంలో ఉన్న దేవుడిని తీసుకొని కాలినడకన మేడారం చేరుకుంటారు. అక్కడ ముగ్గురు దేవతలు సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు కలుసుకోవడంతో ఒక అద్భుతమైన ఘట్టం ఆవిష్కృతమవుతుంది. దేవతలను తీసుకువచ్చిన గిరిజన పూజారులు ఒకరినొకరు ఆలింగనం చేసుకొని సంఘీభావాన్ని ప్రకటించుకుంటారు. ఈ ముగ్గురు దేవతల పూజారులు సమ్మక్క తల్లికి ప్రత్యేక పూజలు చేస్తారు. అనంతరం అక్కడి నుంచి ఈ ముగ్గురు దేవతలను మేడారంలోని వారి వారి గద్దెలపైకి తోడ్కొని వస్తారు. దేవతల ప్రతిష్ఠాపన అనంతరం భక్తుల దర్శనానికి అనుమతిస్తారు. భక్తులు మొక్కులు చెల్లించుకోవడం మొదలవుతుంది. సారలమ్మ, గోవిందరాజులు, పగిడిద్దరాజులు తమ గద్దెలపై నుంచి సమ్మక్క రాక కోసం ఎదురుచూస్తూనే భక్తులకు ఆశీస్సులను అందజేస్తారు.

విశ్రాంతి భవనాన్ని ప్రారంభించిన మంత్రి



లక్ష్మీపురంలో విశ్రాంతి భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, ఫిబ్రవరి 20 : మండలంలోని లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన విశ్రాంతి భవనాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరను పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో కొలువై ఉన్న సమ్మక్క భర్త పగిడిద్దరాజును పూజారులు మేడారం తీసుకురానున్నారని అన్నారు. ఈక్రమంలో మార్గమధ్యంలోని లక్ష్మీపురంలో పూజారులు విశ్రాంతి తీసుకునేందుకు భవనం నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపెద్దలు, గ్రామస్థులు, పూజారులు పెనక ఇద్దయ్య సమ్మయ్య, కృష్ణయ్య, సమ్మక్క, సారయ్య, విజయలక్ష్మి, సత్యనారాయణ, లక్ష్మయ్య, రవి, నరేష్, సంతోష్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాస్కులు పంచిన సీతక్క

తాడ్వాయి, ఫిబ్రవరి 20 : రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క మంగళవారం మేడారంలో మాస్కులు పంపిణీ చేశారు.భక్తులతో పాటు వివిధశాఖల అధికారులు, సిబ్బందికి అందించారు. భక్తులు తప్పకుండా మాస్కులు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ కాళీప్రసాద్, ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ అల్లెం అప్పయ్య, డీపీవో వెంకయ్య, డీఎస్పీ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

స్వీయ క్రమశిక్షణ పాటించాలి

» భక్తులకు మంత్రి సీతక్క సూచన

మేడారం, ఫిబ్రవరి 20: భక్తులు స్వీయ క్రమశిక్షణ పాటిస్తూ తల్లులను దర్శనం చేసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) సూచించారు. మంగళవారం మేడారంలోని మీడియా పాయింట్ వద్ద ఆమె మాట్లాడారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా రహదారులను విస్తరించామని, హనుమకొండ నుంచి పస్రా, తాడ్వాయి మీదుగా మేడారం వరకు నాలుగు లైన్ల రోడ్డు వేశామని అన్నారు. ఊరట్టం నుంచి పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేశామని, తాగునీటి సౌకర్యం కల్పించామని స్పష్టం చేశారు. భక్తులకు బంగారం(బెల్లం) అందించేటప్పుడు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. ఆసియాలోనే అతిపెద్ద జాతరగా గుర్తింపు పొందిన మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరను జాతీయ పండుగగా గుర్తించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ జాతర నిర్వహణకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రూ.110 కోట్లు కేటాయించారని అన్నారు. సుమారు 60 లక్షల మంది భక్తులు ఇప్పటికే వన దేవతలను దర్శనం చేసుకున్నారని, జాతర సందర్భంగా జిల్లా వ్యాప్తంగా నాలుగు రోజులు సెలవు ప్రకటించామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు, గవర్నర్‌లు తల్లుల దర్శనానికి వస్తారని తెలిపారు.

వీఐపీ పాస్‌లు పొందిన వారు సామాన్యులకు ఇబ్బందులు కలగకుండా దర్శనం చేసుకోవాలని కోరారు. సుమారు 12వేల మంది పోలీసులు, 16వేల మంది ఇతర సిబ్బంది జాతరలో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తుల సౌకర్యార్థం 40 బైక్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశామన్నారు. ఆలయ శాశ్వత అభివృద్ధికి 50 ఎకరాల భూ సేకరణ పూర్తయిందని, మరో 50ఎకరాలు సేకరించేందుకు రైతులతో మాట్లాడుతున్నామని తెలిపారు. సమ్మక్క, సారలమ్మల పోరాటం గుర్తుండిపోయే లా శిలాశాసనం ఏర్పాటు చేస్తామన్నారు. రానున్న మినీ జాతర



మేడారంలో ఆదివాసీ నృత్య ప్రదర్శనలో మంత్రి సీతక్క

కల్లా మేడారం పరిసర ప్రాంతాలను మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఇలా త్రిపాఠి, ఐటీడీఏ పీవో అంకిత్ కుమార్, అదనపు కలెక్టర్ శ్రీజ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నృత్య ప్రదర్శన ప్రారంభం

మేడారం ట్రైబల్ మ్యూజియం వద్ద జాతీయ సాంస్కృతిక పరిశోధన ట్రైనింగ్ సంస్థ ఏర్పాటు చేసిన గిరిజన నృత్య ప్రదర్శనను మంత్రి సీతక్క మంగళవారం ప్రారంభించారు. జాతర జరిగే నాలుగు రోజుల పాటు సాయంత్రం గిరిజనులు గోండ్, గుస్సాడి, చచ్చోయి, కొమ్ము కోయ, రెలా, నాయక్‌పోడ్, లక్ష్మీదేవర, ఆంధ్ర వాగే, దండర్ ఆదివాసీ నృత్యాలతో అలరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో అంకిత్‌కుమార్, గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకుడు సర్వేశ్వర్‌రెడ్డి, ఉపసంచాలకుడు దిలీప్‌కుమార్, సత్యనారాయణ, ఇందిర, శైలజ తదితరులు పాల్గొన్నారు.



పూనుగొండ్లలోని పగిడిద్దరాజు ఆలయంలో పూజలు చేస్తున్న తలపతులు

పయనమైన పగిడిద్దరాజు

» పూనుగొండ్లలో పెళ్లి కుమారుడిగా ముస్తాబు

» భక్తుల పూనకాలతో మేడారానికి బైలెల్లిన సమ్మక్క భర్త

గంగారం, ఫిబ్రవరి 20: పగిడిద్దరాజు మంగళవారం పెండ్లి కుమారుడిగా ముస్తాబై మేడారానికి బయలు దేరాడు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో తెల్లవారుజామునే వనంలోనున్న పగిడిద్దరాజును తీసుకువచ్చి ప్రధాన తలపతి ఇంట్లో విడిది చేయించారు. ఉదయం 8 గంటలకు తలపతి పెనక వెంకటేశ్వరావు ఇంట్లో రహస్య పూజలు చేశారు. పెనక వంశానికి చెందిన ఆడబిడ్డలు పసుపు, కుంకుమలను పంచిన తర్వాత, పడిగెల రూపంలో ఉన్న పగిడిద్దరాజుకు కుంకుమ భరిణి జతచేసి మేళతాళాలతో శివసత్తుల పూనకాలతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా పూనుగొండ్ల గ్రామ శివారులో గల ఆలయంలోని గద్దెపైకి తీసుకువచ్చారు. గద్దెపై ఉన్న పగిడిద్దరాజుకు ఆదివాసీ సంప్రదాయాల ప్రకారం పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. పెనక వంశానికి చెందిన ఆడపడుచులు ఆలయంలో పడిగెలు, రవ్వగజ్జలు, అలుకు తాళ్లు, హారపు శారీలను పుసుపు కుంకుమలతో పూజలు చేసి వాటిని తలపతులకు అందచేశారు. వారు వనం నుంచి తెచ్చిన వెదురు కర్రకు పడిగెలను అలంకరించి అందులో పగిడిద్దరాజును ప్రతిష్ఠించారు. ఆపై ఆలయం చుట్టూ మేళతాళాలతో పగిడిద్దరాజు ఆలయం వద్ద ఉన్న సమ్మక్క, సారలమ్మ గద్దెలపై పూజలు చేశారు. అనంతరం స్వావివారికి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. తర్వాత ఆదివాసీల నృత్యాల నడుమ శివసత్తుల పూనకాలతో ప్రధాన అర్చకుడు పూనుగొండ్ల గ్రామం శివారులోనున్న వనంలో పూజలు చేశారు. అక్కడ నుంచి 40 మంది పెనక వంశస్థులను తీసుకుని ప్రధాన పూజారులు మధ్యాహ్నం 3 గంటలకు మేడారం బయలు దేరారు. పూనుగొండ్ల వాసులు పగిడిద్దరాజును వనం వరకు సాగనంపి వచ్చారు.

కాగా, పూనుగొండ్ల నుంచి బయలుదేరిన పగిడిద్దరాజు సుమారు 80 కిలోమీటర్ల దట్టమైన అడవిలో కాలినడక మార్గాన కర్లపల్లి వద్ద ఉన్న లక్ష్మీపురానికి చేరుకుంటారు. అక్కడే రాత్రి బస చేస్తారు. అనంతరం మేడారం నుంచి వచ్చే సమ్మక్క భక్తులు ఎదురోళ్లు చేసిన తర్వాత బుధవారం మేడారంలోని గద్దెపైకి వెళ్లి భక్తుల పూజలందుకుంటారని ప్రధాన తలపతి రాజేశ్వర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధాన తలపతి రాజేశ్వర్, పురుషోత్తం, రామస్వామి, సురేందర్, లక్ష్మీనర్సు, వడ్డెలు పూనం భిక్షపతి, వజ్జా సమ్మయ్య, బలబోయిన జగ్గారావు, ఈక యర్రయ్య, ఎల్లక్క తదితరులు పాల్గొన్నారు.

కర్లపల్లికి చేరుకున్న పగిడిద్దరాజు

మేడారం : సమ్మక్క భర్త పగిడిద్దరాజు మంగళవారం కర్లపల్లికి చేరుకున్నారు. భద్రాది కొత్తగూడెం జిల్లా గుండాల మండలం యాపాలగడ్డ నుంచి అరెం వంశీయులు సోమవారం పగిడిద్దరాజును తీసుకొని మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లకు చేరుకున్నారు. అక్కడి ఆలయంలో పూజా కార్యక్రమాలను నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు, అనంతరం పెనుక వంశీయులు బుర్ర, కొమ్ము శబ్దాలతో డోలు వాయిద్యాల నడుమ పగిడిద్దరాజు పగిడెను తీసుకుని మంగళవారం మేడారం బయలుదేరారు. కాలినడకన మంగళవారం సాయంత్రానికి కర్లపల్లికి చేరుకున్నారు. ఇక్కడ బుధవారం పెనుక వంశీయులు, అరెం వంశీయుల అన్నదమ్ముల కుటుంబ సభ్యులు కలుసుకుంటారు. అక్కడి నుంచి బుధవారం అరెం, పెనుక వంశీయులతోపాటు మేడారం ట్రస్టు బోర్డు చెర్మన్ అరెం లచ్చు పటేల్, సమ్మక్క ప్రధాన పూజారి స్వామి, తాడ్వాయి సర్పంచ్ సునీల్, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, కాంగ్రెస్ పార్టీ తాడ్వాయి మండలం వర్కింగ్ ప్రెసిడెంట్ ముదురుకొళ్ల తిరుపతి, పగిడిద్దరాజును తీసుకొని నేడు సాయంత్రం గద్దెల మీదకి చేరుకుంటారు.



కర్లపల్లికి చేరుకున్న పగిడిద్దరాజు

తులాభారం వేస్తూ... ఒడి బియ్యం పోస్తూ...



సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

మేడారం, ఫిబ్రవరి 20 : జాతర ప్రారంభం ముందు రోజే తల్లుల దర్శనానికి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకుంటున్నారు. చీరె, సారె, ఒడిబియ్యం, పూలు, పండ్లు, పసుపు, కుంకుమ, సమర్పించి పూజలు చేస్తున్నారు. బుధవారం నుంచి జాతర ప్రారంభం కానుండడంతో గద్దెల పరిసరాలు, దేవతల ప్రాంగణాన్ని అధికారులు ముస్తాబు చేశారు.

తరలివస్తున్న భక్త జనం

మేడారానికి వివిధ రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. మంగళవారం జాతర పరిసరాలన్నీ జనంతో నిండిపోయాయి. తెలంగాణతో పాటు మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్, ఒరిస్సా, కర్ణాటక, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి భక్తులు చేరుకుంటున్నారు. మూడు రోజుల పాటు మేడారంలోనే ఉండి మొక్కులు చెల్లించుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.



ఆర్టీసీ బస్టాండ్ నుంచి తల్లుల దర్శనానికి వస్తున్న భక్తులు

వనమంతా కనులై..

(5వ పేజీ తరువాయి)

దుస్తులు ధరించి జాతరకు బయలుదేరుతున్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వచ్చిన ఆదివాసీలు జంపన్నవాగు ఆవల బసచేయగా మిగతా ప్రాంతాల వారు మేడారం జాతర ప్రాంగణంలో విడిది చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి ప్రజలు ఇప్పటికే జాతరకు బయలు దేరడంతో పల్లెలన్నీ జనం లేక బోసిపోయి కనిపిస్తున్నాయి. నగరం నుంచి కూడా జనం పెద్ద సంఖ్యలో బయలు దేరడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. బుధ, గురువారాల్లో ఇంకా ఎక్కువ మంది జాతరకు చేరుకునే అవకాశం ఉండడంతో పల్లెలు, పట్టణాలన్నీ నిర్జనారణ్యాలుగా, మేడారం జనారణ్యంగా మారనున్నది.

భక్తులకు సకల సౌకర్యాలు

» రూ.105 కోట్లతో మౌలిక వసతుల ఏర్పాటు

మేడారం, ఫిబ్రవరి 20 : మహాజాతరను గిరిజన సంప్రదాయాలతో అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. రూ.105 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టింది. సుమారు రెండు కోట్ల మంది వనదేవతలను దర్శించుకుంటారని అధికారులు అంచనా వేశారు. గతంలో మాదిరిగా తాత్కలిక ఏర్పాట్లతో పాటు ఈ ఏడాది శాశ్వత ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపట్టారు. తాగునీరు, మరుగుదొడ్లు, అదనపు స్నాన ఘట్టాలు, బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్, అంతర్గత రోడ్లు, వైద్యం, పారిశుధ్యం, నిరంతర విద్యుత్ సరఫరా, వసతి, క్యూలైన్లను ఏర్పాటు చేసింది. జిల్లా అధికారులతో పాటు మంత్రులు సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

రవాణా శాఖ ఆధ్వర్యంలో..

భక్తులకోసం ఆర్టీసీ అధికారులు 6వేల బస్సులను ఏర్పాటు చేశారు. వివిధ సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం రూ.2.25 కోట్లు మంజూరు చేసింది. వాటితో తాత్కలిక బస్టాండ్, సీసీ కెమెరాలు, టికెట్ బుకింగ్ కౌంటర్లు, విద్యుత్ దీపాలు, తాగునీటి వసతి కల్పించారు.

ఆర్‌డబ్ల్యూఎస్..

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ద్వారా రూ.13.50 లక్షలతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. 495 ప్రాంతాలలో 5వేల ట్యాప్స్ ఏర్పాటు చేశారు. పదిహేడు ఇన్‌ఫల్టరేషన్ వెల్స్ 40 జనరేటర్లు, 500 ప్రాంతాలలో 8400 తాత్కాలిక మరుగుదొడ్లు, 7 ఓవర్‌హెడ్ ట్యాంకులు ఏర్పాటు చేశారు. మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేసేందుకు 300 మంది సిబ్బందిని నియమించారు.

పంచాయతీరాజ్ శాఖ..

జాతరలో పారిశుధ్య నిర్వహణకు 4వేల మంది కార్మికులను కేటాయించారు. మేడారం పరిసర ప్రాంతాలలో 300 డంపింగ్ యార్డులు ఏర్పాటు చేశారు. గద్దెల వద్ద పరిసర ప్రాంతాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసే విధంగా చర్యలు చేపట్టారు.

విద్యుత్ శాఖ..

మేడారం జాతరలో విద్యుత్ అంతరాయం లేకుండా రూ.3.97 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. నూతనంగా 210 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ అందించేందుకు చర్యలు చేపట్టారు.

వైద్యశాఖ..

మేడారం జాతరలో ఆరోగ్య పరిరక్షణకు వైద్య ఆరోగ్యశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. కల్యాణ మండపంలో రూ.1కోటితో 50 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసి 25 మంది వైద్యులు, 120 మంది వైద్యాధికారులను, 857 పార మెడికల్ సిబ్బందిని నియమించారు. మేడారం పరిసర గ్రామాలలో 75 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి అవసరమైన మందులను అందుబాటులో ఉంచారు. సమ్మక్క-సారక్క గద్దెల పరిసర ప్రాంతాలలో క్యూలైన్ల వద్ద మినీ క్యాంప్ ఏర్పాటు చేశారు. తాడ్వాయిలో పది పడకలు, పస్రాలో 5 పడకల ఆస్పత్రులతో పాటు 11 పీహెచ్‌సీలలో అదనపు సౌకార్యలు కల్పించారు. జాతర కోసం ప్రత్యేకంగా 30 మొబైల్ అంబులెన్స్‌లను ఏర్పాటు చేశారు.

పోలీసు శాఖ..

మేడారం జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. 12వేల మంది సిబ్బందిని నియమించారు. 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 33పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నారు.



సంధ్యా సమయాన.. మేడారం బాటన

జనమంతా వనం బాట పడుతున్నారు. వనదేవతలను దర్శించుకునేందుకు పిల్లాపాపలతో మేడారం తరలొస్తున్నారు. బుధవారం నుంచి నాలుగురోజుల పాటు జరిగే మహాజాతరలో ఆ తల్లులను దర్శించుకుని మొక్కులను చెల్లించుకునేందుకు మూటముల్లెలతో గద్దెల చెంతకు చేరుతున్నారు. ఓ కుటుంబం బుధవారం సంధ్యాసమయాన మేడారం వస్తున్న క్రమంలో ఈ దృశ్యం ఆవిష్కృతమైంది.

ఇంతింతై... జగమంతై..

అతి పెద్ద గిరిజన జాతరగా మేడారం

- రెండేళ్లకోసారి మాఘ శుద్ధ పౌర్ణమిన మహాజాతర
- జాతరపై ప్రచారంలో అనేక కథలు
- ఛత్తీస్‌గఢ్ నుంచి సమ్మక్క వచ్చిందనేది గిరిజనుల విశ్వాసం
- పగిడద్దరాజుతో సమ్మక్క కల్యాణమే మహాజాతర

వరంగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): అదో పెద్ద అటవీ ప్రాంతం.. అక్కడ ఆదివాసీలు నివాసముండే ఓ కుగ్రామం. రెండేళ్లకోకసారి అక్కడ భారీ జాతర జరుగుతుంది. అక్కడ విగ్రహాలు ఉండవు.. దేవతామూర్తుల అనవాళ్లు కూడా కనిపించవు.. కానీ, లక్షలమంది భక్తుల కళ్లు ఆ తల్లి చల్లని చూపుకోసం చూస్తుంటాయి. ఆ తల్లీ దీవెనల కోసం వందల మైళ్ల నుంచి వస్తుంటారు.. ఆ కుగ్రామమే మేడారం. గిరిజనులు ఆరాధ్య దైవంగా పూజించే సమ్మక్క-సారలమ్మలు కొలువైన ప్రాంతం. ప్రకృతినే దేవతలుగా పూజించే పుణ్యక్షేత్రం. అసియా ఖండంలో అతిపెద్ద గిరిజన జాతర జరిగే కీకారణ్యం. రెండేళ్లకోసారి మాఘశుద్ధ పౌర్ణమికి వచ్చే బుధవారం ఈ మహాజాతర మొదలై నాలుగు రోజులపాటు జరుగుతంది. మేడారం అనే కుగ్రామంలో జరిగే ఈ మహాజాతర ఇంతింతై జగమంతైంది. ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో జరిగే ఈ మహాజాతరపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

కాకతీయులతో యుద్ధం.. ఆదివాసీ కథనాలు..



సమ్మక్క - సారలమ్మలకు సంబంధించిన చారిత్రక వివరాలకు సంబంధించి ఇప్పటివరకు కచ్చితమైన శిలా శాసనాలు, తాళ పత్ర గ్రంథాలు అందుబాటులో లేవు. సమ్మక్క, సారలమ్మల చరిత్రపై అనేకమంది పరిశోధనలు చేశారు. ఒక్కొక్కరి పరిశోధనల్లో ఒక్కో రకమైన వివరాలు ఉన్నాయి. సమ్మక్క, సారలమ్మలకు సంబంధించిన వివరాల్లో ఎక్కువ మంది అభిప్రాయం ప్రకారం ఓరుగల్లు కేంద్రంగా కాకతీయ సామ్రాజ్యం వర్ధిల్లిన కాలంలో గోదావరి తీరాన ఉన్న దట్టమైన అటవీ ప్రాంతాన్ని పగిడిద్దరాజు, సమ్మక్కలు సామంతరాజులుగా ఉన్నారు. వీరికి సారలమ్మ, జంపయ్య, గంటయ్య, మూగయ్యలు సంతానంగా పేర్కొన్నారు. కరువు, కాటకాలవల్ల కాకతీయులకు కప్పం కట్టలేని పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో ఈ రాజ్యంపై ప్రతాపరుద్రుడి కాలంలో మంత్రి యుగేంధ్రుడి ఆదేశాల మేరకు యుద్ధం ప్రకటించారు. ఈ యుద్ధంలో సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపయ్యలు వీరమరణం పొందారు. సారలమ్మ, పగిడిద్దరాజులు యుద్ధ క్షేత్రంలో నేలకొరగగా, సమీపంలో ఉన్న సంపెంగ వాగులో జంపయ్య గాయపడగా, సమ్మక్క చిలుకల గుట్టపైకి నెమలినార చెట్టు దగ్గర వీరమరణం పొందినట్లు చెబుతారు.

ఆదివాసీలు చెప్పుకునే కథల ప్రకారం మరో కథనం ప్రాచుర్యంలో ఉంది. గిరిజనులు ఆహారం కోసం అడవిలో వేటకు వెళ్లగా అక్కడ ఒక చిన్నారికి రక్షణగా పెద్దపులులకు కాపలాకాస్తున్న దృశ్యం కనిపించింది. బయపడిన వారు కళ్లు మూసుకుని కొండదేవరకు దండన పెట్టుకున్నారు. కళ్లు తెరిచి చూసే సరికి పులులు మాయం అయ్యాయి. ఆ పసిపాపను వారు నివసించే గూడేనికి తీసుకువచ్చారు. ఆపాప కొండదేవర అవతారమని నమ్మి సమ్మక్క అని పేరు పెట్టుకుని, పెంచి పెద్ద చేశారు. పాము కాటుకి గురైన వారిని బతికించడం.. సంతానంలేని వారికి సంతాన భాగ్యం కల్పించడం వంటి మహిమలు ఎన్నో చేస్తూ ఆదివాసీల ఇలవేల్పుగా సమ్మక్క మారిందని చెబుతుంటారు. ప్రస్తుత ఆదివాసీ పూజారులు సమ్మక్కకు సంబంధించి విస్తృతంగా ప్రచారంలో ఉన్న పైరెండు కథనాలను ఖండిస్తున్నారు. కాకతీయులు తమకు సంబంధం లేదని, సమ్మక్కకు సంబంధించిన చరిత్ర అంతా ఛత్తీస్‌ఘడ్‌కు చెందినదిగా పేర్కొంటున్నారు. వందల ఏళ్ల కాలక్రమంలో సమ్మక్క సారలమ్మల జాతర ఛత్తీస్‌ఘడ్ నుంచి పలు ప్రాంతాలు మారుకుంటూ వచ్చి చివరకు మేడారంలో స్థిరపడిపోయిందని చెబుతున్నారు. మేడారానికి ముందు ఈ జాతర బయ్యక్కపేట, అంతకముందు బిలాపురంలో జరిగేదన్నారు. సమ్మక్క, సారలమ్మలు తమ ఇలవేల్పులని పేర్కొంటున్నారు. ఇతర ప్రాంతాల్లో ప్రజలు నమ్ముకునే ఉప్పలమ్మ, మైసమ్మ, పోచమ్మ, మారెమ్మ, రేణుక ఎల్లమ్మ దేవతలు ఎవరని విమ్మల్ని అడిగితే మీరు ఏమి చెబుతారని, ఏ చరిత్రను వివరిస్తారని ఆదివాసీలు ప్రశ్నిస్తున్నారు. తరతరాలుగా సమ్మక్క తమ ఇలవేల్పని, ఛత్తీస్‌ఘడ్‌లో సమ్మక్కను సడువలిగా పిలుస్తారని చెబుతున్నారు. ఇప్పటికీ పూర్తిగా ఆదివాసీ పద్ధతిలో సమ్మక్కకు మొక్కులు చెల్లించేది ఛత్తీస్‌ఘడ్‌కు చెందిన ఆదివాసీలే అని గుర్తుచేస్తున్నారు.





వాయినమే వివాహం

మేడారంలో ఉన్న సమ్మక్క ఆలయంలో బుధవారం ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. వడ్డెర కొండరూపంలో ఉన్న సమ్మక్కను అలంకరిస్తారు. పూనుగొండ్ల నుంచి మేడారానికి పెళ్లికొడుకు పగిడిద్దరాజు చేరుకున్న కబురు అందగానే సమ్మక్క పూజారులు పసుపు, కుంకుమలతో ఎదురెల్లి ఆహ్వానం పలుకుతారు. సంప్రదాయ ఆదివాసీ వాయిద్యాలను మోగిస్తూ సమ్మక్క ఆలయానికి పగిడిద్దరాజును తీసుకువస్తారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అతిథులకు నైవేద్యం సమర్పించి ఆకలి తీరుస్తారు. ఆ తర్వాత వడ్డెరలు కుండల రూపంలో సమ్మక్కను, పడిగె రూపంలో పగిడిద్దరాజులను ఎదురెదురుగా ఉంచుతారు. ఇరువైపులా పూజారులు మాటాముచ్చట మాట్లాడుకుని వాయినం ఇచ్చిపుచ్చుకుంటారు. దీంతో కల్యాణం పూర్తవుతుంది. ఈ కల్యాణ వేడుకకు కన్నెపల్లి నుంచి సారలమ్మ, కొండాయి నుంచి గోవిందరాజులు ప్రత్యేక అతిథులుగా వస్తారు. పెళ్లి జరిగిన అనంతరం పగిడిద్దరాజు, గోవిందరాజు, సారలమ్మలను గద్దెల ప్రాంగణంపైకి చేరు స్తారు. మరుసటిరోజు గురువారం సా యంత్రం సమ్మక్క చిలుకలగుట్ట నుంచి వేడుకగా గద్దెలపైకి చేరుకుంటుంది. గురువారం రాత్రి నుంచి శుక్ర, శనివారం సాయంత్రం వరకు అంత అక్కడే ఉంటా రు. శనివారం సాయంత్రం సమ్మక్క తిరిగి వనప్రవేశం చేయగా పగిడిద్దరాజు సారలమ్మ, గోవిందరాజులు తమ స్వస్థలాలకు పయనమవుతారు.

సమ్మక్క - పగిడిద్దరాజుల కల్యాణం

సమ్మక్క జాతర ఎందుకు నిర్వహిస్తారో ఇప్పటికీ ఎవరికీ తెలియదు. అయితే ఆదివాసీ పూజారులు చేస్తున్న ఏర్పాట్లు పరిశీలిస్తే.. జాతర సందర్భంగా సమ్మక్క, పగిడిద్దరాజులకు ఆదివాసీ సంప్రదాయం ప్రకారం వివాహం జరిపిస్తారు. ఈ వేడుకలకు పగిడిద్దరాజు తమ్ముడు గోవిందరాజు ప్రత్యేక అతిథిగా హాజరవుతారు. రెండేళ్లకోసారి మేడారం జాతరను మాఘమాసంలో పౌర్ణమి సమయాన జరుపుతారు. ప్రతీసారి జాతర బుధవారం రోజున ప్రారంభం అవుతుంది. జాతరకు ఒక రోజు ముందు సోమవారం ఉదయం వరుడు పగిడిద్దరాజును ఆయన స్వస్థలమైన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో పెళ్లికొడుకుగా తయారుచేసి వేడుకను నిర్వహిస్తారు. మంగళవారం రోజు ఉదయం పగిడిద్దరాజు ప్రధాన వడ్డె లక్ష్మయ్య ఇంట్లో పసుపు, కుంకుమలు సిద్ధం చేస్తారు. పూనుగొండ్ల ఆలయంలో ఉన్న పగిడిద్దరాజు పడిగెను సిద్ధం చేస్తారు. మధ్యాహ్నం కల్లా వడ్డె ఇంటి నుంచి పసుపు, కుంకుమ, కొత్త బట్టలతో ఆలయానికి చేరుకుంటారు. అక్కడ యాటను బలిస్తారు. ఆదివాసీ సంప్రదాయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం కొత్తబట్టలు వేసి పడిగె రూపంలో వివాహానికి సిద్ధమైన పగిడిద్దరాజును కాలినడకన మేడారానికి తోడ్కొని వెళ్తారు.

మంగళవారం రాత్రి సమయానికి తాడ్వాయి మండలం లక్ష్మీపురం గ్రామానికి చేరుకుని అక్కడ పెనక వంశీయుల ఇంటిలో బస చేస్తారు. మరుసటి రోజు బుధవారం ఉదయం తిరిగి కాలినడకన మేడారానికి బయలుదేరి సాయంత్రానికి మేడారం చేరుకుంటారు. తాము వచ్చినట్లు సమ్మక్క పూజారులకు కబురు పంపిస్తారు.

మ్యూజియంలో వెలసిన గిరిజన గ్రామం



మేడారం : మేడారంలో గల ఆదివాసీ మ్యూజియంలో ఐటీడీఏ, టూరిజంశాఖ అధికారులు నమూనా గిరిజన గ్రామాన్ని ఏర్పాటు చేశారు. గతంలో గిరిజన గ్రామాలు ఎలా ఉండేవో అలానే నిర్మించి వాటి గురించి అవగాహన కల్పిస్తున్నారు. గిరిజనుల ఆచార వ్యవహారాలు, వారి ఇలవేల్పులు, దేవరలు, గొట్టుగోత్రాలతోపాటు వారి సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఈ గ్రామాన్ని తీర్చిదిద్దారు.

రామప్ప సరస్సు వద్దకు అనుమతి నిలిపివేత



వెంకటాపూర్(రామప్ప), ఫిబ్రవరి 20: మేడారం వెళ్లే భక్తులు తిరుగు ప్రయాణంలో రామప్ప ఆలయానికి చేరుకుంటున్నారు. భారీ సంఖ్యలో భక్తులు రావడంతో సరస్సు కట్ట సందర్శనను పోలీసులు నిలిపివేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు సరస్సులోకి దిగే అవకాశం ఉన్న నేపథ్యంలో పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. సరస్సు లోతు కూడా అధికంగా ఉండటంతో భక్తులకు ప్రమాదం పొంచి ఉందని పోలీసు అధికారులు గుర్తించారు. విశాలమైన సరస్సు కట్టపైకి సందర్శకులను అనుమతిస్తే ప్రాణాపాయాలు సంభవించే అవకాశం ఉన్న దృష్ట్యా అనుమతి నిరాకరించినట్లు వెంకటాపూర్ ఎస్సై చల్ల రాజు తెలిపారు. సరస్సు కట్టపైకి వెళ్లే రహదారిలో బారికేడ్లను ఏర్పాటు చేయడంతోపాటు పోలీసుల బందోబస్తు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

నాలుగు రోజులు.. నాలుగు ఊళ్లు..



వరంగల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడారం జాతరకు సమ్మక్క, సారలమ్మలతోపాటు పగిడిద్దరాజు, గోవిందరాజులు ప్రధాన దేవతలు. ఈ నలుగురు ఆదివాసీ దేవతలకు వేర్వేరు ప్రదేశాల్లో గుడులు ఉన్నాయి. జాతర సందర్భంగా వీరంతా మేడారం గ్రామానికి చేరుకుంటారు. సమ్మక్క ప్రధాన ఆలయం మేడారం గ్రామంలోనే ఉంది. 1962కు పూర్వం తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో ఉండేది. రెండేళ్లకోసారి అక్కడ జాతర జరిగేది. కరువు కారణంగా 1962లో జాతర నిర్వహించలేని పరిస్థితి ఎదురైంది. అప్పుడు జాతరను మేడారం తరలించి ఇక్కడే సమ్మక్కకు ఆలయం నిర్మించారు. బయ్యక్కపేటకు చెందిన చందా వంశీయులు సమ్మక్కను తమ ఇంటి ఆడపడుచుగా భావిస్తారు. ప్రస్తుతం సిద్దబోయిన, కొక్కెర వంశాలకు చెందినవారు సమ్మక్క ప్రధాన పూజారులుగా కొనసాగుతున్నారు. సమ్మక్కకు సంబంధించిన ప్రధాన పూజలన్నీ ఆదివాసీ పద్ధతిలో సిద్దబోయిన మునీందర్ నిర్వహిస్తారు. ఇక జాతరలో సమ్మక్కను చిలుకలగుట్ట నుంచి గద్దెలపైకి తీసుకువచ్చే కీలకమైన బాధ్యతను సమ్మక్క వడ్డెగా ఉన్న కొక్కెర కిష్టయ్య నిర్వర్తిస్తారు.

సారలమ్మ ప్రధాన ఆలయం ములుగు జిల్లా తాడ్వాయి మండలం కన్నెపల్లి గ్రామంలో ఉంది. మేడారం-కన్నెపల్లి మధ్య మూడున్నర కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాక సారయ్య ప్రధాన పూజారి. జాతర సందర్భంగా తొలిరోజు జరిగే వేడుకల్లో సారలమ్మ మేడారం ప్రయాణం ముఖ్యమైనది. హనుమంతుడి జెండా తోడురాగా సారలమ్మ మేడారం బయలుదేరుతుంది. మార్గమధ్యంలో జంపన్నవాగు గుండా కాలినడకన నడుస్తూ సమ్మక్క ఆలయానికి చేరుకుంటారు. అక్కడ సమ్మక్క-పగిడిద్దరాజుల వివాహానికి హజరై అక్కడి నుంచి గద్దెలపైకి చేరుకుంటారు.

సమ్మక్క భర్త అయిన పగిడిద్ద రాజు ఆలయం మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం పూనుగొండ్లలో ఉంది. పెనుక బుచ్చిరాములు పగిడిద్దరాజు ప్రధాన పూజారి. మేడారం - పూనుగొండ్ల మధ్య 70కిలోమీటర్ల దూరం ఉంటుంది. జాతర సందర్భంగా పూనుగొండ్ల నుంచి మేడారం వరకు పడిగెరూపంలో ఉన్న పగిడిద్దరాజును కాలినడకన మేడారం తీసుకువస్తారు. మార్గమధ్యంలో పెనక వంశీయుల ఇళ్లలోనే బస చేస్తారు. పగిడిద్దరాజు తమ్ముడైన గోవిందరాజులు ఆలయం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామంలో ఉంది. గోవిందరాజుల ప్రధాన పూజారి దబ్బగట్ల గోవర్ధన్. మేడారం- కొండాయి మధ్య పదిహేను కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇదంతా అటవీమార్గం. జాతర జరిగే బుధవారం ఉదయం నుంచి కొండాయిలో ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంత్రం పడిగే రూపంలోని గోవిందరాజులుని తీసుకుని మేడారం బయలుదేరుతారు. గోవిందరాజులు ప్రయాణంలో ప్రధాన పూజారులు, వడ్డెలకు నీరు తగలకుండా జాగ్రత్తలు తీసుకుంటారు. మార్గమధ్యంలో జంపన్నవాగు దాటే చోటు, ఇతర ప్రాంతాల్లో నీటి వనరులు అడ్డుగా వస్తే వడ్డెలు దబ్బగట్ల గోవర్ధన్‌ను ఎత్తుకుని నీటి ప్రవాహం దాటిస్తారు.

దేవ దూతలు

వనదేవతల సేవలో ఆదివాసీ పూజారులు

- కొక్కెర కిష్టయ్య, కాక సారయ్యది కీలక పాత్ర
- నిష్ఠ, పవిత్రత, ఉపవాస దీక్షలతో పూజలు

మేడారం, ఫిబ్రవరి 20: మేడారం జాతరలో వారు కనిపించే దైవ దూతలు. వనదేవతలను జనారణ్యానికి తీసుకువచ్చే దైవాలు.. తల్లులను తీసుకవచ్చే సమయంలో వీరిపాదాలు తాకి పరమపుణ్యంగా భావించే లక్షలాది మంది భక్తులు... ఇదంతా నాలుగు రోజుల మహాఘట్టం. ఇది ముగిస్తే ఇక వాళ్లు సామాన్యులే. సాధారణ జీవనం గడిపే పూజారులు కొక్కెర కిష్టయ్య కాక సారయ్య. పూజారులంటే వేదాలు చదివి విద్య నేర్చుకున్నవారు కాదు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయంతో ముడిపడి ఉండే పూజావిధానమే వీరిది. సంస్కృతి, సంప్రదాయాలు, పవిత్రత, కట్టుబాట్లు, ఆచార వ్యవహారాలు వీడకుండా జాతర సమయంలో ఈ పూజారులు దైవాలుగా నిలుస్తారు. మహాజాతరకు తల్లులను తీసుకువచ్చే పూజారులు నిష్ఠతో ఉండటంతోపాటు తమ సంస్కృతి, ఆచారాలకు అనుగుణంగా పూజావిధానం కొనసాగిస్తారు.

సమ్మక్కను గద్దెకు చేర్చే కొక్కెర కిష్టయ్య

మేడారం మహాజాతరలో సమ్మక్క ఆగమనం భక్తుల్లో ఉద్వేగాన్ని నింపుతుంది. చిలుకల గుట్ట నుంచి సమ్మక్కను గద్దెకు చేర్చే ప్రధాన పూజారి కొక్కెర కిష్టయ్య. మేడారంలోనే కిష్టయ్య నివాసం ఉంటాడు. జాతర సమయంలో మినహా మిగతా రోజుల్లో కిష్టయ్య అతి సామాన్యంగా జీవిస్తారు. వ్యవసాయమే వీరి జీవనాధారం. కిష్టయ్యకు భార్య వినోదతో పాటు పిల్లలు శ్రీలేఖ, శ్రీవాణి, వినోద్ ఉన్నారు. 7వ తరగతి వరకు చదివిన కిష్టయ్య తమ పిల్లలను ఉన్నత చదువులు చదివించి వారిని జీవితంలో స్థిరపరచాలని కిష్టయ్య కోరిక. కాగా, వీరికి సమ్మక్క ప్రధాన పూజారిగా వారసత్వంగా వస్తోంది. గతంలో కిష్టయ్య తాత సమ్మయ్య సమ్మక్కను గద్దెకు తీసుకువచ్చేవారు. ఆయన మృతి తరువాత కిష్టయ్య బాబాయి సాంబశివరావు తల్లిని గద్దెకు తీసుకువచ్చేవారు. ఆయన కూడా చనిపోవడంతో 2012 నుంచి ఆ బాధ్యతను కిష్టయ్య తీసుకున్నారు. 2014, 2016, 2018, 2020, 2022లోనూ సమ్మక్కను గద్దెకు తీసుకవచ్చిన కిష్టయ్య ఈసారి కూడా కొనసాగుతున్నారు. కిష్టయ్యకు సిద్దబోయిన మునీందర్, బొక్కయ్య పర్యవేక్షకులుగా ఉంటారు. సిద్దబోయిన స్వామి(కొమ్ము), మల్యాల ముత్తయ్య(జలకం), దోబే నాగేశ్వర్‌రావు (దూపదీపం)లు సమ్మక్క తల్లిని గద్దెకు చేర్చడంలో కీలక పూజారులు. వీరితో పాటు సిద్దబోయిన లక్ష్మణ్‌రావు, నర్సింగరావు, జనార్దన్, సాంబశివరావులు కీలకంగా వ్యవహరిస్తారు. వీరంతా కూడా సామాన్య జీవితాన్ని గడుపుతారు. జాతర సమయంలో మాత్రం నిష్ఠతో తల్లుల సేవలో నిమగ్నమవుతారు.





కన్నెపల్లి నుంచి కాక సారయ్య

కన్నెపల్లి సారలమ్మ కొలువైన పల్లె... ఈ పల్లెలో సామాన్య రైతుగా సాధారణ వ్యక్తిగా జీవనం కొనసాగిస్తున్న కాక సారయ్య ప్రధాన పూజారి. 47 ఏళ్ల వయసున్న సారయ్య కన్నెపల్లిలోనే నివాసం ఉంటున్నాడు. కన్నెపల్లి నుంచి సారలమ్మను గద్దెకు చేర్చే సారయ్యకు జాతర సమయంలోనే దేవదూతగా భక్తులకు కనిపిస్తాడు. పదో తరగతి వరకు చదువుకున్న సారయ్యకు ముగ్గురు సంతానం. భార్య సరళతోపాటు పిల్లలు సాహిత్య, దిలీప్‌కుమార్, ప్రేమ్‌కుమార్ ఉన్నారు. సారయ్యకు కూడా వ్యవసాయమే జీవనాధారం. 2002 నుంచి సారలమ్మను గద్దెకు తీసుకరావడంలో ప్రధాన పూజారిగా కొనసాగుతున్నారు. అంతకుముందు సారయ్య తండ్రి కాక రత్నయ్య తల్లిని గద్దెకు తీసుకువచ్చేవారు. తండ్రి అనారోగ్యంతో ఉండటంతో సారయ్యే సారలమ్మ తల్లిని గద్దెకు తీసుకవచ్చే బాధ్యతను తీసుకున్నాడు. 2005లో సారయ్య తండ్రి రత్నయ్య మృతిచెందడంతో సారయ్య పూర్తిగా సారలమ్మ తల్లి సేవలో నిమగ్నమయ్యాడు. ప్రతీ వారం సారలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కాగా, కాక సారయ్య సహాయకులుగా కాక కిరణ్, కాక వెంకటేశ్వర్లు వ్యవహరిస్తారు. సోలెం వెంకన్న సారలమ్మకు రక్షకుడిగా హనుమాన్ జెండాతో గద్దెల వద్దకు చేరుకుంటారు. అలాగే బొంది లక్ష్మయ్య(జలకం), కాక భుజంగరావు (దూపదీపం)లతో పాటు కాక వంశీయులు, కుల పెద్దలు ఇతర కార్యక్రమాలు చేపడుతారు. వీరందరిదీ కూడా సాధారణమైన జీవితమే. జాతర సమయంలోనే వీరు దైవదూతలుగా భక్తులకు కనిసిస్తారు. జాతర ముగిశాక వీరు పల్లెల్లో సామాన్య రైతులే.





తల్లులకు రక్షణగా..

- మేడారం జాతరకు రోప్ పార్టీలు రె'ఢీ'
- 502 మంది సిబ్బందితో డ్రై ప్రాక్టీస్
- కన్నెపల్లి, చిలుకలగుట్ట నుంచి ముందస్తు తర్ఫీదు
- రోప్ పార్టీ తీరును పర్యవేక్షిస్తున్న అధికారులు



తల్లుల రాక కోసం రిహార్సల్స్ చేస్తున్న రోప్ పార్టీ పోలీసులు

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 20: మేడారం జాతరలో కీలక ఘట్టాలైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపన్న, గోవిందరాజులను వారి పుణ్యస్థలాల నుంచి జన ప్రదేశానికి తీసుకువచ్చేందుకు పోలీసు శాఖలోని రోప్ పార్టీ కీలకంగా పని చేస్తుంది. గత ఐదు రోజులుగా మేడారం జాతరలో సిబ్బంది డ్రై ప్రాక్టీస్ (ముందస్తు సాధన) చేస్తున్నారు. కన్నెపల్లి, చిలుకలగుట్ట నుంచి పోలీసు సిబ్బంది అధికారులతో కలిసి సాధన చేస్తున్నారు. కోయ తెగల ఆచారాలను గౌరవిస్తూ సమ్మక్క, సారలమ్మలు వనం నుంచి జనంలోకి ప్రవేశించే సమయంలో రోప్ పార్టీ సేవలు కీలకంగా మారనున్నాయి. పోలీసు శాఖ ఏర్పడినప్పటి నుంచి అటు తల్లులకు ఇటు భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చొరవ చూపుతూ కన్నెపల్లి నుంచి సారలమ్మ, చిలుకలగుట్ట నుంచి సమ్మక్క, ఏటూరునాగారం మండలం కొండాయి గ్రామం నుంచి గోవిందరాజులు, కొత్తగూడ మండలం పూనుగొండ్ల గ్రామం నుంచి కాలినడకన గిరిజన పూజారులు దేవరలను తీసుకువస్తున్న అపురూప ఘట్టంలో పోలీసుల రోప్ పార్టీ కీలక భూమిక పోషిస్తోంది. గిరి'జన' దేవతామూర్తులు అడవి ప్రాంతాల నుంచి సక్రమంగా గద్దెల వరకు చేర్చడంలో రోప్ పార్టీ పోలీసుల సేవలు ప్రశంసనీయం. ప్రాణాలను బిగబట్టి సుమారు ఆరు గంటల పాటు లక్షల మంది భక్తజన సందోహం నుంచి తల్లులకు ఇబ్బంది ఏర్పడకుండా తుడుందెబ్బ వలంటీర్లను గౌరవిస్తూ అతి పొడవైన తాడును రోడ్లకు ఇరుపక్కలా పట్టుకుని విధుల్లో నిమగ్నమవుతారు. దేవరలను భక్తులు దర్శించుకునేందుకు, కొందరు తాకి తరించేందుకు వస్తున్న వారిని రోప్ పార్టీ అడ్డుకుని ట్రాఫిక్ జామ్ కాకుండా చూస్తుంది. అవిభక్త వరంగల్ జిల్లాలోని వరంగల్ పోలీసు కమిషనరేట్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్ జిల్లాల నుంచి సిబ్బందిని మేడారం జాతరకు ఎంపిక చేశారు. గత అనుభవం ఉన్నటువంటి పోలీసు సిబ్బందిని 2024 మేడారం జాతరకు విధులు నిర్వర్తించేందుకు తీసుకున్నారు. ఇంకా వరంగల్‌లో మేడారం విధులు నిర్వర్తించి రాష్ట్రంలోని ఇతర జిల్లాలలో పనిచేస్తున్న అధికారులను సైతం పిలిచి పని చేయిస్తున్నారు. 10 నుంచి 15 జాతరలలో రోప్ పార్టీకి సేవలందించిన వారు ప్రస్తుత జాతరకు పని చేస్తున్నారు. రోప్ పార్టీ సేవల వల్ల ఎక్కడా తొక్కిసలాట జరగకపోవడంతో పాటు ప్రాణనష్టం జరుగలేదని సీనియర్ పోలీసు అధికారి వెల్లడించారు.

2024 రోప్ పార్టీలో 502 మంది

మేడారంలో ఈ యేడు నిర్వహించే జాతరకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు 502 మందిని రోప్ పార్టీలో తీసుకున్నట్టు రోప్ పార్టీ ఇన్‌చార్జి బి.సదానందంగౌడ్ తెలిపారు. గత సంవత్సరం 482 మంది సిబ్బంది ఉండగా ఈ యేడు భక్తుల తాకిడి ఎక్కువవుతుందని గ్రహించి ఎక్కువ మందిని తీసుకున్నట్టు వెల్లడించారు. ఇందులో ఎస్సీ స్థాయి నుంచి పోలీసు కానిస్టేబుల్ వరకు పని చేస్తున్నారు. 22 మంది ఉన్నతాధికారులతో పాటు 210 మంది మెయిన్ రోప్ పార్టీ, 250 మంది క్లియరెన్స్ కవర్ రోప్ పార్టీలో విధులు నిర్వర్తిస్తారు. మంచిర్యాల డీసీపీ సుధీర్ కేకన్, సీనియర్ డీసీపీ మురళీధర్, ములుగు అడిషనల్ డీసీపీ బి.సదానందం, హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డిలతో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆర్ఎస్ఐలు, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు రోప్ పార్టీ విధులు నిర్వర్తిస్తున్నారు.

జాతర ప్రదేశాల్లోనే వీరి సేవలు..

ఈ నెల 21, 22, 23 తేదీలలో నిర్వహించే మేడారం జాతరలో తల్లులను గద్దెల వద్దకు తీసుకురావడం, తిరిగి వనప్రవేశం చేసే సమయాల్లో విధులు నిర్వర్తించే రోప్ పార్టీ జాతర ప్రాంగణంలో పని చేస్తారు. గద్దెల ప్రాంతంలో భక్తులు గుమికూడకుండా చూడడంతో పాటు క్యూలైన్లలో తొక్కిసలాట జరుగకుండా చూస్తారు. లోకల్ దొంగలతో పాటు ఇతర రాష్ట్రాల దొంగలను సైతం పట్టుకునేందుకు జనం మధ్యలో ఉండి పని చేస్తారు. పార్టీకి పూర్తి పర్యవేక్షణాధికారి సుధీర్ కేకన్ ఆదేశాల మేరకు పది మైళ్ల దూరంలో విస్తరించి ఉన్న జాతరను పర్యవేక్షిస్తూ పని చేస్తారు. 24న వనదేవతలు తిరుగు ప్రయాణం తర్వాత రోప్ పార్టీ సిబ్బంది వారి వారి స్వస్థలాలకు చేరుకుని రిపోర్టు చేస్తారు.



అర్చకులకు వేతనాలను వెంటనే మంజూరు చేయించాలి

- తెలంగాణ అర్చక ఉద్యోగ రాష్ట్ర జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ

వడ్డెపల్లి, ఫిబ్రవరి 20: గ్రామీణ ప్రాంతాల్లోని దేవాలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు వేతనాలను వెంటనే మంజూరు చేయించాలని తెలంగాణ అర్చక ఉద్యోగ రాష్ట్ర జాక్ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ అన్నారు. మంగళవారం హనుమకొండలోని తెలంగాణ రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఉపేంద్రశర్మ మాట్లాడుతూ ధూప దీప నైవేద్య అర్చకులకు వేతనాలు రావడం లేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అర్చకులకు రూ. 10 వేల వేతనం ప్రకటించిన ఎన్నికల కోడ్ రావడంతో ఇవ్వలేదని అన్నారు. నూతన ప్రభుత్వం ధూప దీప నైవేద్యాల కింద పనిచేస్తున్న అర్చకులకు వేతనాలు ఇప్పించే విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని సిరిసిల్ల రాజయ్యను కోరారు. రాజయ్యను కలిసిన వారిలో జేఏసీ నాయకులు కె. రామారావు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి అగ్రంపహాడ్ జాతర



విద్యుత్ కాంతులతో విరజిల్లుతున్నా అగ్రంపహాడ్‌లోని వనదేవతల గద్దెల ప్రాంగణం

- నేడు సారలమ్మ గద్దెకు రాక..
- భారీ పోలీస్ బందోబస్తు..రోప్ పార్టీ
- జాతరకు తరలివస్తున్న భక్తులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 20 : ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా పూజారులు బుధవారం సారలమ్మ గద్దెకు తీసుకురానున్నారు. ఈ క్రమంలో అన్ని శాఖల అధికారులు, పూజారులు, ప్రజాప్రతినిధులు వనదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. బుధవారం ఉదయం గుల్లపల్లి సాంబశివరావు ఇంటి నుంచి పసుపు కుంకుమలు డప్పు చప్పుళ్లతో శివసత్తుల పూనకాలతో భారీ బందోబస్తు నడుమ మధ్యాహ్నం గద్దెకు చేరుకుంటుంది. ఒగ్గుని పల్లెలోని బొమ్మగాని సత్యం ఇంటి నుంచి ఘటం కుండం తీసుకుని సమ్మక్క పూజారి గోనెల సారంగపాణి ఇంట్లో పెడతారు. సాయంత్రం గోనెల రవీందర్ ఇంట్లో ప్రత్యేక పూజలు నిర్వహించి వరాల కొండను తీసుకుని వస్తారు. రాత్రి 9 గంటలకు గోనెల వెంకన్న ఇంటినుండి భారీ పోలీసు బందోబస్తు మధ్య సారలమ్మ గద్దెకు చేరుకుంటారు. భక్తులు ఎంతగానే ఎదుచూసే ఘట్టం సారాలమ్మ రాకతో ప్రారంభమౌతుంది.

జాతరలో వెలిసిన దుకాణాలు

సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకునే భక్తులకు కనువిందు చేసేవిధంగా జాతరలో జాయింట్ వీల్స్ రంగుల రాట్నం, కోళ్ల దుకాణాలు, రకరకాల మిఠాయి దుకాణాలు, మద్యం షాపులు, హోటళ్లు వెశాయి. దూర ప్రాంతాల నుండి వచ్చే బక్తుల విడిది కోసం ప్రత్యేక గదులు, డేరాలు ఇతరాలు జాతరలో అందుబాటులో ఉన్నాయి. విద్యుత్ దీపాలతో జాతర ప్రాంగణం, తోరణాలు విరజిల్లుతున్నాయి.

ఆదాయం పెంపే లక్ష్యం: జాతర చైర్మన్ రమేష్

భక్తులకు సర్వదర్శనంతోపాటు ప్రత్యేకంగా రూ100 టికెట్లు, బీఐపీలకు రూ.500 టికెట్లు ఏర్పాటు చేశాం. కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే ఆదేశానుసారం ఎవ్వరికీ వీఐపీ పాసులు ఇవ్వడంలేదు. జాతర ఆదాయం పెంచి, మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యం.

అధికారులు జాతరలో సేవలందించాలి

- ఎమ్మెల్యే రేవూరి, కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఆత్మకూరు : రాష్ట్రంలో రెండో మేడారం జాతరగా పేరు గాంచిన సమ్మక్క జన్మస్థానమైన అగ్రంపహాడ్‌లో మొదటి మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చే లక్షలాది మంది భక్తులు సకల సేవలు అందించాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌లు ఆదేశాలు జారీ చేశారు. మంగళవారం హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని అగ్రంపహాడ్ జాతర పనులను ఎమ్మెల్యే, కలెక్టర్, జాతర చైర్మన్ రమేష్, మాజీ ఎంపీపీ బీరం సునంద సుధాకర్ రెడ్డి, పరకాల ఏసీపీ కిషోర్ కుమార్, ఆర్డీవో శ్రీనివాస్, తహసీల్దార్ జగన్మోహన్‌రెడ్డి, ఎండోమెంట్ అధికారి శేషగిరి జాతరలో పనులను పరిశీలించారు. అనంతరం జాతర ప్రాంగణంలో చైర్మన్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతర నిర్వహించే రోజులలో అధికారులు స్థానికంగా అందుబాటులో ఉండి సేవలందించాలని అన్నారు. ఎంతో భక్తి శ్రద్ధలతో దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులకు సేవలు కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. పోలీసులు 24 గంటలు డేగ కన్నుతో భక్తులకు రక్షణ కల్పించాలని అన్నారు. అడుగడున సీసీ కెమెరాలు, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని అన్నారు. విద్యుత్ అధికారులకు అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత సరఫరా చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులలు నీటి సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని, మరుగుదొడ్ల వద్ద నీటి కొరత ఉంటే చర్యలు తప్పవన్నారు. ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీడీవోలు పారిశుధ్య లోపం జరగకుండా పనులు చేయించాలని అన్నారు. పోలీసులు నిరంతరాయంగా పెట్రోలింగ్ నిర్వహిస్తూ, మఫ్టీలో సైతం కాపుకాస్తూ, ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. సమ్మక్క సారలమ్మను వనం నుంచి గద్దెల వద్దకు తీసుకువచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని తెలిపారు. జాతరలో తొక్కిసలాట జరగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు అంకిత భావంతో పనిచేసి, జాతరను విజయవంతం చేయాలని అన్నారు.

జాతరతోపాటు, ఎక్కడైనా గుడుంబా అమ్మకాలు నిషేధమని, అమ్మకాలు జరిపినట్లు దృష్టికి వస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కక్కెర్ల రాధిక రాజు గౌడ్, స్థానిక ఎంపీటీసీ బొమ్మగాని భాగ్య రవి గౌడ్, యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మాదాసి శ్రీధర్, మాజీ ఎంపీపీ గోపు మల్లికార్జున్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

కాంగ్రెస్‌లోకి డీసీసీబీ చైర్మన్..!

5వ పేజీ తరువాయి

ముందస్తు ప్రణాళితో కాంగ్రెస్‌లోకి వెళుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇదిలా ఉంటే ప్రభుత్వం మారిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా డీసీసీబీ, మునిసిపల్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు ప్రవేశపెడుతున్న విషయం తెలిసిందే. ఇదే సందర్భంలో వరంగల్ డీసీసీబీ చైర్మన్ పదవికి కూడా అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు ప్రచారం జరుగుతున్న క్రమంలో మార్నేని.. వేం నరేందర్‌రెడ్డిని కలిసి చర్చించినట్లు తెలియడం రాజకీయం చర్చనీయాంశమైంది. ఈ విషయంపై రవిందర్‌రావును సంప్రదించగా.. 30 ఏళ్లపాటు నరేందర్‌రెడ్డితో కలిసి టీడీపీలో పనిచేశానని, ఆ పరిచయం మేరకే సీఎం సలహాదారుడిగా ఎంపికైన సందర్భంగా సొసైటీల అంశంపై ఆయనను మర్యాదపూర్వకంగా కలిశానని చెప్పారు. ఈ సందర్భంగా 'గతంలో టీడీపీలో కలిసి పనిచేశాం.. మళ్లీ ఇప్పుడు కాంగ్రెస్‌లో కలిసి పనిచేద్దాం రండి' అని నరేందర్‌రెడ్డి తనను ఆహ్వానించారని తెలిపారు. ఇక కాంగ్రెస్ ఆకర్ష్‌లో భాగంగా మార్నేని చేరిక విషయంపై నరేందర్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో మాట్లాడారని, అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని తెలుస్తోంది.

తప్పిపోయిన మహిళను చేరదీసిన పోలీసులు

కుటుంబసభ్యులకు అప్పగింత



తల్లిని కుమారుడికి అప్పగిస్తున్న కానిస్టేబుల్ రాకేష్

ఐనవోలు, ఫిబ్రవరి 20: అనారోగ్య కారణాలతో తప్పిపోయిన మహిళను గుర్తించిన పోలీసులు ఆమెను చేరదిసి కుటుంసభ్యులకు అప్పగించారు. ఖిలా వరంగల్ పడమర కోటకు చెందిన మేకల ఏలిషా కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి నుంచి తప్పిపోయి ముల్కలగూడెంనకు చేరింది. గమనించిన గ్రామస్థులు ఎస్సై అనిల్‌కుమార్‌కు సమాచారం అందించారు. దీంతో మంగళవారం కానిస్టేబుల్ గూడురు రాకేష్ గ్రామానికి వెళ్లి ఏలిషాతో మాట్లాడి కుటుంబసభ్యుల వివరాలను సేకరించారు. ఆమె కుమారుడు పవన్‌కు తల్లి సమాచారాన్ని అందించగా ఆయన వచ్చి తల్లిని ఇంటికి తీసుకెళ్లాడు. పోలీసులు ప్రత్యేక చొరవతీసుకొని తన తల్లిని అప్పగించినందుకు ఆమె కుమారుడితోపాటు గ్రామస్థులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

జాతరకు అమ్మవారిపేట ముస్తాబు



ముస్తాబైన సమ్మక్క దేవత గద్దె, సారలమ్మ దేవత గద్దె

- వెలిసిన దుకాణాలు - మొదలైన మొక్కులు
- నేడు గద్దెపైకి సారలమ్మ రాక
- బల్దియా ఆధ్వర్యంలో సౌకర్యాలు
- పోలీసుల భారీ బందోబస్తు

వడ్డెపల్లి, ఫిబ్రవరి 20 : కాజీపేట మండలం కొత్తపల్లి హవేలి శివారు అమ్మవారిపేట దామెర గుట్ట (ఉర్సు)ల వద్ద ప్రతీ రెండేళ్లకోసారి జరిగే సమ్మక్క-సారలమ్మ జాతరకు సర్వం సిద్ధమైంది. జాతర ప్రాంగణంలో దుకాణ సముదాయాలను చిరు వ్యాపారులు ఏర్పాటు చేసుకున్నారు. విద్యుత్, తాగునీరు, వైద్య, పారిశుద్య సౌకర్యాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ ఏర్పాటు చేసింది. రెవెన్యూ, పోలీసు బందోబస్తును జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేశారు. జాతర ఆవరణలో విద్యుత్ లైట్లతో పాటు మెర్క్యూరీ లైట్లను అలంకరించారు. సమ్మక్క- సారలమ్మ, భూలక్ష్మీదేవి, పగిడిద్ద రాజు గద్దెలచుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుతో పాటు రంగులతో తీర్చి దిద్దారు. భక్తుల దర్శనార్థం భారీకేడ్లను ఏర్పాటు చేశారు. తాత్కాలిక స్నాన ఘట్టాలు, మరుగు దొడ్లను జాతరలో నిర్మించారు. ఆర్టీసీ బస్సు సౌకర్యాన్ని సైతం ఏర్పాటు చేశారు.

నేటి నుంచి సమ్మక్క- సారలమ్మ జాతర..

అమ్మవారిపేట దామెర గుట్టల వద్ద ఈ నెల 21 నుంచి 24 వరకు సమ్మక్క- సారలమ్మ జాతర నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. 21న సాయంత్రం 6.45 గంటలకు చినవొడ్డే నామని శివమూర్తి సారలమ్మ దేవతను దామెర గుట్ట సొరంగం నుంచి భాజా భజంత్రీలు, డప్పు చప్పుళ్లతో తీసుకొచ్చి గద్దెపైన ప్రతిష్ఠించడంతో మహా జాతర ప్రారంభమవుతుంది. 22న పెద్ద వొడ్డే బొరిశెట్టి శ్యాంసుందర్ సమ్మక్క దేవతను పోలీసు బందోబస్తు మధ్య దామెర గుట్ట వద్ద నుంచి తరలించి గద్దెపై ప్రతిష్ఠిస్తారు. 23న లక్ష్మీదేవికి వొడువాల బియ్యం సమర్పిస్తారు. 24న సమ్మక్క-సారలమ్మ దేవత లు వన ప్రవేశం చేయడంతో మహా జాతర ముగుస్తుంది.

మొదలైన మొక్కులు..

అమ్మవారిపేట సమ్మక్క- సాలరమ్మ జాతరకు భక్తులు తరలి వచ్చి మొక్కులను చెల్లించుకుంటున్నారు. ఉర్సు, కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, శంభునిపేట, రంగశాయిపే, రామన్నపేటతోపాటు కొత్తపల్లి, భట్టుపల్లి, తిమ్మాపూర్, అల్లీపూర్, మామునూరు, జక్కలొద్ది, అమ్మవారిపేట, కొండపర్తి తదితర గ్రామాల నుంచి భక్తులు తరలి వచ్చి వన దేవతలను దర్శించుకొని తరిస్తారు.

నేడు గద్దెపైకి సారలమ్మ రాక..

అమ్మవారిపేట సమ్మక్క- సారలమ్మ జాతరలో భాగంగా మొదటి రోజు (బుధవారం) సారలమ్మ దేవత గద్దెపైకి రానుంది. చినవొడ్డే నామని శివమూర్తి దామెర గుట్ట సొరంగం వద్ద గిరిజన సంప్రదాయ ప్రకారం ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగింపుతో అమ్మవారిని సాయంత్రం గద్దెపై ప్రతిష్ఠిస్తారు. దీంతో జాతరలో మొక్కులు ప్రారంభమవుతాయి. గిరిజన సంప్రదాయ ప్రకారం అమ్మవారికి వడ్డెలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

మొదటి మొక్కు గట్టమ్మకే..

అమ్మవారిపేట జాతర ప్రవేశ మార్గంలో ఉన్న గట్టమ్మకు ఆనవాయితీ ప్రకారం భక్తులు మొదటి మొక్కను గట్టమ్మకే చెల్లించుకుంటారు. పసుపు కుంకుమలు, బెల్లం శాక, కొబ్బరి కాయలు, నైవేద్యం, నూతన వస్త్రాలను సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు. మడికొండ పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. ఎండోమెంట్ ఈవో వందిళ్ల కమల జాతర ప్రాంగణంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

అమ్మవారిపేట జాతరను విజయవంతం చేయాలి...

- ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

వడ్డెపల్లి : అమ్మవారిపేట సమ్మక్క- సారలమ్మ జాతరను విజయవంతంగా నిర్వహించాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్. నాగరాజు అధికారులను కోరారు. మంగళవారం అమ్మవారిపేట సమ్మక్క- సాలరమ్మ జాతర ప్రాంగణంలో అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ జాతరకు ప్రభుత్వం నుంచి రూ. 2లక్షల 50 వేలు మంజూరు చేయించినట్లు తెలిపారు. అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరలో భక్తులకు సకల సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమావేశం అనంతరం సమ్మక్క గద్దెను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. సమావేశంలో మునిసిపల్ కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ అనిసూర్ ర షీద్, కార్పొరేటర్ జలగం అనిత రంజిత్, ఎండోమెంట్ ఈవో కమల, మునిసిపల్ డీఈ సంతోష్, ధర్మకర్తలు ఆవునూరి రాంమూర్తి, బైరి నాగరాజు, బైరి హరినాథ్, దాసి రాందేవ్, చింత ప్రకాష్, ఆవునూరి కుమారస్వామి, మైదం వీరస్వామి, ఆవునూరి రామన్న తదితరులు పాల్గొన్నారు.

కాజీపేటలో నాయిని విస్తృత పర్యటన

స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యేకు వినతి పత్రం అందజేస్తున్న స్థానికులు

కాజీపేట, ఫిబ్రవరి 20 : కాజీపేటలో మంగళవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సుడిగాలి పర్యటన చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు 47, 62, 63వ డివిజన్లలోని ప్రజలతో మమేకమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 47వ డివిజన్ బోడగుట్టలో స్థానికులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ముస్లిం కాలనీలో తాగునీటి సమస్య ఉందని, వర్షాకాలంలో వరద నీరు చేరడంతో రోడ్లన్నీ బురదమయం కావడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అక్కడే ఉన్న మునిసిపల్ అధికారులకు తాగునీటి సమస్య, రోడ్ల మరమ్మతుకై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం 63వ డివిజన్ జూబ్లీమార్కెట్ మసీద్, కమేలా స్థలాన్ని పరిశీలించారు. స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. రూ. 25 లక్షలతో మంజూరైన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం 62వ డివిజన్‌లో ఎస్సీకాలనీ, శ్మశాన వాటికను పరిశీలించారు. రూ.40 లక్షల సీడీఎఫ్ ఫండ్ ద్వారా విష్ణుపురి నుంచి సోమిడి వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు నిధులు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే వెంట స్థానిక కార్పొరేటర్‌లు విజయ శ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్‌లు గుంటి కుమార స్వామి, రావుల సదానందం, గొట్టిముక్కుల రమణారెడ్డి, సుంచు అశోక్, డివిజన్ అధ్యక్షులు షేక్ అజ్గర్, నాయకులు ఎమ్డీ అంకూస్, మేరుగు రాజయ్య, పల్లపు వెంకటస్వామి, జయాకర్, సిరిల్ లారెన్స్, దొంగల కుమార్, బైరబోయిన రమేశ్, నవీన్, తోపాటు స్థానిక నాయకులు, జిల్లా అధికారులు పెద్దఎత్తున హాజరయ్యారు.

ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థికి షీల్డ్‌ను అందజేస్తున్న దృశ్యం

ధర్మసాగర్, ఫిబ్రవరి 20 : శ్రీనివాసరామానుజన్ మ్యాథ్స్ ఒలింపియాడ్ 2024గాను హనుమకొండ టీచర్స్ కాలనీలోని సిమ్యూలేటర్ క్లాసెస్ ఐఐటీ ఫౌండేషన్ విద్యార్థి ప్రతిభ చూపినట్లు పాఠశాల డైరెక్టర్ నేహజైన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అరిన్ జైన్ రాష్ట్ర స్థాయిలో మూడో స్థానంలో గెలుపొందగా, శ్రీహితజ జిల్లా స్థాయిలో కన్సోలేషన్ బహుమతిని సాధించారు. వివిధ ఒలింపియాడ్ పరీక్షల్లో ఫలితాలను సాధించిన విద్యార్థులను డైరెక్టర్ నేహ జైన్ అభినందించారు. కాగా, లోక్‌సత్తా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు జయప్రకాష్ నారాయణ, శ్రీనివాసరామానుజన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అమరేష్ గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి: కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హనుమకొండ రూరల్, ఫిబ్రవరి 20 : ఎన్నికల నిబంధనలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో నోడల్ కమిటీని ఏర్పాటు చేసి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎన్నికల సిబ్బంది శిక్షణ, ఓటింగ్ శాతం పెంచేందుకు స్వీప్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలని తెలిపారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి, ఎన్నికల అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల ఏర్పాట్లపై జిల్లాలో 16 మంది నోడల్ అధికారులను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మహేందర్‌జీ, డీఆర్‌వో వైవి.గణేష్, వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ ఎం.ఎ.బారి, స్వీప్ నోడల్ అధికారి హరిప్రసాద్, జడ్పీ సీఈవో విద్యాలత, డిప్యూటీ సీఈవో రవి, డీటీసీ శ్రీనివాస్, ఆర్ అండ్ బీ డీఈఈ సురేశ్‌బాబు, సీపీవో సత్యనారాయణరెడ్డి, అగ్రికల్చర్ జేడీ రవీందర్‌సింగ్, మైనింగ్ ఏడీ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక అభివృద్ధి ఫలాలు ఆదివాసీలకు అందాలి

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్



సదస్సులో మాట్లాడుతున్న వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 20 : సాంకేతిక అభివృద్ధి ఫలాలు ఆదివాసీలందరికీ అందాలని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. మంగళవారం యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ఎడ్యుకేషన్ విభాగం, కేయూ ఎడ్యుకేషన్ విభాగం సంయుక్తంగా 'ది ఇంపాక్టు ఆఫ్ డిజిటలైజేషన్ ఆన్ సోషియో- ఎకానమిక్ కండీషన్స్ ఇన్ తెలంగాణ, ఈ - క్రిటికల్ సర్వే ఆఫ్ సెలక్టెడ్ ఏరియాస్' అనే అంశంపై ఒక్క రోజు సదస్సు జరిగింది. ఈ సదస్సులో ముఖ్యఅతిథిగా హాజరై కీలక ప్రసంగం చేసిన వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ మాట్లాడుతూ.. ప్రపంచానికి మన దేశం విజ్ఞానాన్ని అందించిందని అన్నారు. డిజిటల్ యుగంలోనూ దేశం శరవేగంగా ముందుకు సాగుతోందని చెప్పారు. యువత డిజిటల్ అక్షరాస్యతలో ముందున్నారని చెప్పారు. ఇన్ఫార్మేషన్ టెక్నాలజీ సామాజ వికాసానికి తోడ్పడాలని వినాశనకారిగా ఉండకూడదని చెప్పారు. డిజిటల్ టెక్నాలజీని అందరు ఆహ్వానించాలని చెప్పారు. ఆదివాసీలు, గిరిజన ప్రాంతాలు మారుమూల పల్లెల్లో డిజిటల్ అక్షరాస్యత పెరిగినప్పుడే మూఢనమ్మకాలు, అసమానతలు తగ్గుతాయని చెప్పారు. క్షేత్రస్థాయిలో పరిశోధనలు జరుగాలని అన్నారు. హైదరాబాద్ హెచ్‌సీయూ డాక్టర్ జేవీ మధుసూదన్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, ఎడ్యుకేషన్ విభాగం డీన్ ప్రొఫెసర్ ఎన్.రాంనాథ్‌కిషన్, రిటైర్డు ప్రొఫెసర్ డి.రాజేంద్రప్రసాద్‌లు మాట్లాడారు. కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నర్సింహాచారి, ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డి, అడ్జంట్ ప్రొఫెసర్ కృష్ణమాచారి, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, పోరిక రమేశ్, స్కాలర్లు సందీప్, హెచ్‌సీయూ స్కాలర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్యానికి సెల్యూట్ చేసేలా ఉంటుంది



'కొత్త కథ చూపించాలనే ప్యాషన్‌తో 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. ఈ సినిమా చూశాక ప్రేక్షకులు గర్వంగా, గుండెల నిండా దేశభక్తితో మన సైనికులకు సెల్యూట్ చేస్తారు' అని హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా శక్తి ప్రతాప్‌సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్ కథానాయిక. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం ఈ చిత్రం తెలుగు, హిందీ ట్రైలర్స్‌ను రామ్‌చరణ్, సల్మాన్‌ఖాన్ ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'తెలుగులో ఇదే తొలి ఏరియల్ వార్ డ్రామా. ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురి చేసేలా, అబ్బురపరిచే సన్నివేశాలు ఇందులో చాలా ఉన్నాయి. కచ్చితంగా ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది' అన్నారు. మానుషి చిల్లర్ మాట్లాడుతూ 'ఆపరేషన్ వాలెంటైన్ నాకు చాలా స్పెషల్ మూవీ. షూటింగ్‌లో వరుణ్‌తేజ్ సహకారం మరువలేనిది. నా డ్రీమ్ రోల్‌ను చేశాను' అని తెలిపారు. సమష్టి కృషికి రూపం ఈ సినిమా, యాక్షన్ డ్రామా, ఫన్ ఎమోషన్స్ లాంటి అన్ని ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉన్నాయి అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాలో కీలకమైన పాత్ర చేశాను, విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటాయి అని నవదీప్ తెలిపారు.

విఐ ఆనంద్‌తో అనిల్ సుంకర మరో చిత్రం



'ఊరు పేరు భైరవకోన' చిత్రంతో తాజాగా విజయం పొందిన దర్శకుడు విఐ ఆనంద్‌తో ఆ చిత్ర సమర్పకుడు, నిర్మాత అనిల్ సుంకర మరో సినిమా నిర్మించనున్నారు. ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతూ కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేశారు అనిల్ సుంకర. 'విఐ ఆనంద్ సూపర్ నేచురల్ అడ్వెంచర్స్ చేయడంలో దిట్ట. కొత్త సినిమా కూడా కథ, సెటప్ పరంగా యూనిక్‌గా ఉంబోతోంది. ఇందులో హీరో, మిగిలిన వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, సహ నిర్మాతలు: రాజేశ్ దండా, అజయ్ సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికపాటి, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర.

సవాల్‌గా స్వీకరించా..

పలు తెలుగు చిత్రాల్లో బాల నటుడిగా అలరించిన దీపక్ సరోజ్ ఇప్పుడు 'సిద్ధార్థ్‌రాయ్' చిత్రంతో హీరోగా వెండితెర ఎంట్రీ ఇవ్వబోతున్నారు. యశస్వీ దర్శకత్వంలో ప్రదీప్ పూడి, జయ అడపాక, సుధాకర్ బోయిన నిర్మించారు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా దీపక్ సరోజ్ మీడియాతో మాట్లాడుతూ.. బాల నటుడిగా 'మిణుగురులు' చిత్రంతో నంది పురస్కారం అందుకున్నాను. చదువు పూర్తి అయ్యాక యశస్వీ నన్ను కలసి 'సిద్ధార్థ్ రాయ్' కథ చెప్పారు. కథా నేపథ్యం విని షాక్ అయ్యాను. అసలు ఇలాంటి పాత్ర నేను చేయగలనా అనుకున్నాను. కానీ మా డైరెక్టర్‌ను నమ్మి ముందుకెళ్లామన్నారు.

మెప్పించే ముఖ్య గమనిక



విరాన్ ముత్తంశెట్టి, లావణ్య జంటగా నటించిన చిత్రం 'ముఖ్య గమనిక'. వేణు మురళీధర్ వి. దర్శకత్వంలో రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించారు. ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన హీరో విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'కుటుంబ నేపథ్యాన్ని పక్కన పెట్టి తన కష్టంతో పైకి రావాలనుకుంటున్నాడు విరాన్. ఈ సినిమాతో ఆయన సక్సెస్ కొట్టాలి' అని ఆకాంక్షించారు. విరాన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. అల్లు అర్జున్ నాకు అందించిన సహకారం మరువలేనిది' అన్నారు. వేణు మురళీధర్ మాట్లాడుతూ 'విరాన్, లావణ్య జంట ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ. కిరణ్ సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు.

కమెడియన్ కాదు కామిక్ యాక్టర్



హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రుతో కలసి నిర్మించిన చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది. చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "సుందరం మాస్టర్ ట్రైలర్ చాలా బావుంది. హర్షను కమెడియన్ అనడం నాకు నచ్చదు. ఆయనో కామిక్ యాక్టర్. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. కొత్తవాళ్లను ప్రోత్సహిస్తున్న రవితేజకు అభినందనలు' అన్నారు. హర్ష మాట్లాడుతూ 'మా సినిమాకు చిరంజీవి గారు ఇచ్చిన మద్దతు మర్చిపోలేను. పదేళ్ల క్రితం ప్రేక్షకుల మధ్యలో ఉన్న నేను ఇప్పుడు ఇలా వేదికపై ఉన్నాను. మనం గట్టిగా అనుకుంటే ఏదైనా సాధించగలం' అన్నారు. ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అవుతుందో తెలియదు కానీ మా అందరికీ గౌరవాన్ని తీసుకొస్తుంది అని దర్శకుడు చెప్పారు. హర్ష వల్లే మేం ఈ రోజు ఇక్కడ నిలబడగలిగాం, ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది అని సుధీర్ కుమార్ తెలిపారు.

గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారుతారా?

త్రిష అసహనం



తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అన్నాడీఎంకే బహిష్కృత నేత ఏవీ రాజుపై హీరోయిన్ త్రిష మండిపడ్డారు. "గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారిపోయే జీవితాలు కొందరివి... ఇలాంటి నీచమైన మనుషులను చూస్తుంటే చాలా అసహ్యంగా ఉంది. దీనిపై త్వరలోనే న్యాయపరంగా కఠిన చర్యలు కోరతాను" అంటూ ఆమె మంగళవారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇటీవల ఏవీ రాజు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఓ ఎమ్మెల్యే హీరోయిన్ త్రిషకు డబ్బులిచ్చి కూవత్తూరు పంచాయతీ లోని ఓ రిసార్ట్‌కు తీసుకొచ్చారని, ఈ విషయం నటుడు, మాజీ ఎమ్మెల్యే కరుణాస్‌కు తెలుసని అన్నారు. ఈ వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపుతున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా త్రిషపై అసభ్యంగా మాట్లాడిన ఏవీ రాజును అరెస్టు చేయాలని నటుడు, దర్శకుడు చేరన్ డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా బహిరంగంగా సినీ పరిశ్రమలోని సభ్యులు కించపరిచేలా మాట్లాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని పెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, ప్రధాన కార్యదర్శి బీఎస్ స్వామినాథన్ సంయుక్తంగా విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

ఉత్కంఠ పెంచి వినోదం పంచేలా

అర్జున్ కల్యాణ్, కుషిత్ కల్లపు హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'బాబు నంబర్ వన్ బుల్‌షిట్ గై'. లక్ష్మణవర్మ దర్శకత్వంలో దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. మార్చి 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అర్జున్ కల్యాణ్ మాట్లాడుతూ 'హీరోగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది. థ్రిల్లర్, డ్రామా ఉన్న కథతో మూడు భాషల్లో తెరకెక్కించాం' అని తెలిపారు. 'దిలీప్‌గారు రాజీ పడకుండా సినిమాను నిర్మించారు. ఉత్కంఠ కలిగించడంతో పాటు వినోదం పంచేలా ఉంటుంది. నటీనటులు, టీమ్ అంతా చాలా కష్టపడి ఒక మంచి సినిమాను రూపొందించాం. మా సినిమాను ఆదరించాలి' అని దర్శకుడు ప్రేక్షకులను కోరారు. కుటుంబంతో కలసి చూసేలా ఈ సినిమా ఉంటుందని కుషిత చెప్పారు. దర్శకుడు సాయిరాజేశ్, నిర్మాత ఎస్కేఎన్, వికేక్ కూచిబొట్ల ముఖ్య అతిథులుగా పాల్గొని సినిమా ఘనవిజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

విదేశాల్లో చదువుకునే దేశీ విద్యార్థుల కోసం
గ్లోబల్ స్టూడెంట్ హెల్త్‌కేర్ ప్లాన్

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్

న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్.. విదేశీ విద్యకు వెళ్లే దేశీ విద్యార్థుల కోసం గ్లోబల్ స్టూడెంట్ హెల్త్‌కేర్ ప్లాన్ పేరిట ఒక ప్రత్యేకమైన పాలసీ తీసుకువచ్చింది. ఇది క్యాష్‌లెస్ హెల్త్ పాలసీ. దీని ప్రీమియం కూడా డాలర్లలో చెల్లించవచ్చు. 12-40 వయోశ్రేణిలోని వారి కోసం ఈ హెల్త్‌కేర్ ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో నాలుగు ఆప్షన్లుంటాయి. 30 లక్షల డాలర్ల వరకు ఇది కవరేజీ కల్పిస్తుంది. 3 నెలల నుంచి ఏడాది కాలానికి పాలసీ టర్మ్‌ను ఎంచుకోవచ్చు. నెట్‌వర్క్ ఆస్పత్రులు, క్లినిక్‌లు, వైద్యులు, వృత్తినిపుణుల సేవలను ప్రపంచవ్యాప్తంగా అందుబాటులో ఉంచడం ద్వారా పాలసీదారుల ఆరోగ్య సంరక్షణ అవసరాలను ఇది తీర్చగలుగుతుంది. ఇది డెంటల్ కవరేజీ, వైద్యుల హోమ్ విజిట్లు, ప్రత్యామ్నాయ ఔషధాలు వంటి సేవలు కూడా ఇది అందిస్తుంది.

నియామకాల జోరు తగ్గదు..

వర్క్ ఫ్రమ్ హోమ్ కుదరదు
టీసీఎస్ సీఈఓ కృతివాసన్



ముంబై: నియామకాల జోరు తగ్గిస్తున్నామన్న వార్తలను టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) తోసిపుచ్చింది. అలాంటి ఆలోచనే లేదని కంపెనీ సీఈఓ కృతివాసన్ నాస్కామ్ నిర్వహించిన ఒక సదస్సులో స్పష్టం చేశారు. కాకపోతే డిమాండ్‌ను బట్టి నియామకాల ప్రక్రియలో మార్పు ఉండొచ్చని తెలిపారు. ఆర్థిక వ్యవస్థలు కోలుకుంటున్న సూచనలు కనిపిస్తున్నందున, పని చేసేందుకు మరింత మంది ఉద్యోగులు అవసరమవుతారన్నారు. ప్రస్తుతం టీసీఎస్‌లో 6 లక్షల మంది ఉద్యోగులుండగా అందులో 35.7 శాతం మంది (2 లక్షలకు పైగా) మహిళలేనని ఆయన చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారత ఐటీ పరిశ్రమ కొత్తగా 60,000 మందిని చేర్చుకోవచ్చని గత వారం విడుదల చేసిన నివేదికలో నాస్కామ్ పేర్కొంది.

ఆఫీసుకు రావాల్సిందే: తమ కంపెనీలో పని చేసే ఉద్యోగులు ఇంకా ఇంటి నుంచే పని (డబ్ల్యూఎఫ్‌హెచ్) చేస్తామంటే కుదరదని టీసీఎస్ సీఈఓ స్పష్టం చేశారు. ఇంటి నుంచే పని చేస్తే జూనియర్లు సీనియర్ల నుంచి పని ఎలా నేర్చుకుంటారని ఆయన ప్రశ్నించారు. తమ ఉద్యోగుల్లో 40 శాతం మంది ఆఫీసుకు వచ్చి పని చేస్తున్నట్టు తెలిపారు. తమ క్లయింట్ కంపెనీల్లో అయితే నూటికి నూరు శాతం ఉద్యోగులు ఆఫీసుకు వచ్చి పని చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. కృత్రిమ మేధ (ఏఐ) ఎంతగా ఎదిగినా మానవ మేధకు ప్రత్యామ్నాయం కాదన్నారు. క్రియాశీలక, వ్యూహాత్మక ఆలోచన ఏఐతో సాధ్యం కాదన్నారు. కాకపోతే మానవ ఆలోచనా నైపుణ్యాలకు ఏఐ కొంత వరకు సాయపడుతుందన్నారు.

2027 నాటికి

రూ.1.41 లక్షల కోట్లు

భారత ఏఐ మార్కెట్‌పై నాస్కామ్-బీసీజీ అంచనా



ముంబై: దేశంలో కృత్రిమ మేధ (ఏఐ) మార్కెట్ 25-35 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు (సీఏజీఆర్)తో అభివృద్ధి చెందుతున్నదని.. 2027 నాటికి భారత ఏఐ మార్కెట్ పరిమాణం 1,700 కోట్ల డాలర్ల (సుమారు రూ.1.41 లక్షల కోట్లు) స్థాయికి చేరుకోవచ్చని ఓ రిపోర్టు అంచనా వేసింది. కంపెనీలు ఆధునిక సాంకేతికత కోసం భారీగా వెచ్చిస్తుండటం, దేశీయంగా ఏఐ నిపుణులతోపాటు ఏఐలో పెట్టుబడులు వేగంగా పెరుగుతుండటం వంటి పలు అంశాలు ఇందుకు దోహదపడుతున్నాయని నివేదిక పేర్కొంది. ఐటీ రంగ అసోసియేషన్ నాస్కామ్, బీసీజీ సంయుక్తంగా రూపొందించిన ఈ నివేదికను నాస్కామ్ టెక్నాలజీ అండ్ లీడర్‌షిప్ ఫోరమ్ సదస్సులో మంగళవారం విడుదల చేశారు. మరిన్ని విషయాలు..

- ప్రపంచవ్యాప్తంగా ఏఐలో పెట్టుబడులు 2019 నుంచి 24 శాతం చొప్పున వృద్ధి చెందుతూ వచ్చాయి. గత ఏడాదిలో దాదాపు 8,300 కోట్ల డాలర్ల పెట్టుబడులు తరలివచ్చాయి.
- మెజారిటీ పెట్టుబడులు డేటా అనలిటిక్స్, జెనరేటివ్ ఏఐ టెక్నాలజీ, మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) అల్గోరిథమ్స్ అండ్ ప్లాట్‌ఫామ్స్ విభాగాల్లోకి వచ్చాయి.
- దేశీయంగా టెక్ సర్వీసెస్, ప్రొడక్ట్ కంపెనీలు ఏఐ పెట్టుబడుల్లో 93 శాతం డిజిటల్ కంటెంట్, డేటా అనలిటిక్స్, సప్లై చెయిన్ సేవల అభివృద్ధి కోసం వెచ్చించాయి.
- ఏఐ నిపుణులు అత్యధికంగా ఉన్న దేశాల్లో భారత్ రెండో స్థానంలో ఉంది. దేశంలో 4.20 లక్షల మంది నిపుణులు ఏఐ సాంకేతిక విధులను నిర్వహిస్తున్నారు.
- ఏఐ నైపుణ్య వ్యాప్తి కూడా ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో మూడు రెట్లు అధికం. గత ఏడేళ్లలో ఏఐ నైపుణ్యం కలిగిన వ్యక్తులు 14 రెట్లు పెరిగారు. 2027 వరకు ఏఐ నిపుణుల డిమాండ్‌లో 15 శాతం సీఏజీఆర్ నమోదు కానుంది.
- భారత్‌లోని టెక్నాలజీ ఇండస్ట్రీలో గడిచిన ఏడాది కాలంలో ఏఐ/ఎంఎల్ ఉద్యోగాలు 15 శాతానికి పైగా పెరిగాయి. ఏఐ ఇంజనీర్ ఉద్యోగావకాశాలు వార్షిక ప్రాతిపదికన 67 శాతం పెరిగాయి.
- కృత్రిమ మేధ నిపుణుల ప్రాధాన్యతను గుర్తించి, ప్రధాన కంపెనీలు తమ ఉద్యోగులకు ఈ సాంకేతికతలో శిక్షణ ఇచ్చేందుకు భారీగా వెచ్చిస్తున్నాయి. కొన్ని కంపెనీలు ఉద్యోగుల నైపుణ్య శిక్షణ కోసం వచ్చే మూడేళ్ల కాలానికి 100 కోట్ల డాలర్ల మేర కేటాయింపులు జరుపుతున్నాయి.

తెలంగాణ స్టార్టప్‌లకు జపాన్ తోడ్పాటు

రూ.1,336 కోట్ల రుణ సాయం

హైదరాబాద్: తెలంగాణలో ఏర్పాటయ్యే స్టార్టప్‌లకు ఆర్థిక సాయం అందించేందుకు జపాన్ ముందుకొచ్చింది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి రూ.1,336 కోట్ల రుణసాయం అందించనుంది. దీనికి సంబంధించిన ఒప్పందంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి వికాస్ షీల్, భారత్‌లో జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) ప్రధాన ప్రతినిధి సైటో మిత్సునోరి సంతకాలు చేశారు. తెలంగాణ పట్టణ, గ్రామీణ ప్రాంతాల నుంచి సరికొత్త వ్యాపార ఆలోచనలతో ముందుకొచ్చే స్టార్టప్‌లకు జపాన్ అందించే ఈ రుణం నుంచి ఆర్థిక సాయం అందిస్తారు. ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలు స్థాపించే స్టార్టప్‌లకీ ఈ పథకం ద్వారా ప్రత్యేక రుణ సాయం అందిస్తారు.

దేశీయ నౌకాయాన రంగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. బ్లూ ఎకానమీ పాలసీ కింద 2047 నాటికి ఈ రంగంలో రూ.75 లక్షల కోట్ల నుంచి రూ.80 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించాలని లక్ష్యంగా పెట్టుకుంది. దేశీయ కంపెనీల నౌకల కొనుగోళ్లు, లీజింగ్‌ని ప్రోత్సహించేందుకూ నౌకాయాన అభివృద్ధి నిధి (ఎండీఎఫ్) పేరుతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపింది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	62,560 ▼	57,350 ▼	77,000 ▼
ముంబై	62,139 ▲	56,919 ▲	70,898 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

20వ తేదీ		విజయవాడ	525
హైదరాబాద్	534	విశాఖపట్నం	535
21వ తేదీ		వరంగల్	536
చిత్తూరు	603		
గోదావరి	525	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	135	గోదావరి	139
వరంగల్	135	విజయవాడ	139
కరీంనగర్	135	గుంటూరు	139
మహబూబ్‌నగర్	135	ఒంగోలు	139
కర్నూలు	135	చిత్తూరు	140
విశాఖపట్నం	127		

సోనీ-జీ విలీనంపై మళ్లీ చర్చలు !

నిజం లేదన్న జీ గ్రూప్

న్యూఢిల్లీ: సోనీ-జీ ఎంటర్‌టైన్మెంట్ కంపెనీల విలీనంపై మళ్లీ వార్తలు వినిపిస్తున్నాయి. ఇందుకోసం జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (జెడ్ఈఈఎల్) చొరవ తీసుకున్నట్టు సమాచారం. దీంతో రెండు కంపెనీల మధ్య గత 15 రోజులుగా ముంబైలో చర్చలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. జీ గ్రూప్ మాత్రం ఈ వార్తలను తోసిపుచ్చింది. అలాంటి ప్రయత్నాలేవీ జరగడం లేదని స్పష్టం చేసింది. 2021 డిసెంబరులో విలీనానికి సంబంధించి రెండు కంపెనీల మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. అయితే తుది చర్చలు ఎంతకీ తేలకపోవటంతో సోనీ గ్రూప్ గత నెల 22న ఈ విలీన ప్రతిపాదనను రద్దు చేసుకుంటున్నట్టు ప్రకటించింది. దీంతో 1,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.83,000 కోట్లు) విలువైన ఈ విలీనాన్ని సోనీ గ్రూప్ ఆమోదించేలా ఆ సంస్థను ఆదేశించాలని ఎన్‌సీఎల్‌టీని ఐ జీగ్రూప్ ఆశ్రయించింది. ఈ విలీన వార్తలతో బీఎస్ఈలో మంగళవారం జీ ఎంటర్‌టైన్మెంట్ షేరు 8.03 శాతం లాభంతో రూ.193 వద్ద ముగిసింది.

బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్‌తో రెనో జట్టు

న్యూఢిల్లీ: దేశంలోని గ్రామీణ ప్రాంతాల్లో కార్ల లభ్యత పెంచడం లక్ష్యంగా డిజిటల్ సర్వీసుల కంపెనీ బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్‌తో రెనో ఇండియా భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఉభయ సంస్థలు ఈ మేరకు ఒక ఎంఓయూపై సంతకాలు చేశాయి. గ్రామీణ, సెమీ అర్బన్ మార్కెట్లలో రెనో క్విడ్, ట్రైబర్, కైగర్ కార్ల లభ్యత మరింత పెంచేందుకు ఈ ఎంఓయూ దోహదపడుతుంది. బీఎల్ఎస్ ఈ-సర్వీసెస్‌కు గల 1,016 డిజిటల్ స్టోర్లు, లక్ష టచ్ పాయింట్ల విస్తృత నెట్‌వర్క్‌ను ఉపయోగించుకుని తమ కార్లపై గ్రామీణుల్లో చైతన్యం కల్పిస్తామని రెనో తెలిపింది.

ఆరో రోజూ అదే జోరు



మార్కెట్లో కొనసాగిన బుల్ ర్యాలీ

- సరికొత్త రికార్డు స్థాయికి నిఫ్టీ
- మళ్లీ 73,000 ఎగువకు సెన్సెక్స్

ముంబై: భారత స్టాక్ మార్కెట్లో వరుసగా ఆరో రోజూ సూచీల ర్యాలీ కొనసాగింది. ఆరంభ నష్టాల నుంచి తేరుకుని నిఫ్టీ సరికొత్త ఉన్నత శిఖరాన్ని అధిరోహించగా.. సెన్సెక్స్ మళ్లీ 73,000 మైలురాయిని దాటింది. బ్యాంకింగ్, ఎఫ్ఎంసీజీ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. మంగళవారం ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 349.24 పాయింట్ల లాభంతో 73,057.40 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 74.70 పాయింట్ల వృద్ధితో 22,196.95 వద్ద క్లోజైంది. సూచీకి సరికొత్త జీవిత కాల గరిష్ఠ ముగింపు స్థాయిది. అంతేకాదు, సూచీ 22,215.60 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును సైతం నమోదు చేసింది. గడిచిన ఆరు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 1,984 పాయింట్లు, నిఫ్టీ 580 పాయింట్లు లాభపడ్డాయి. సెన్సెక్స్‌లోని 30 కంపెనీల్లో 19 పాజిటివ్‌గా ముగిశాయి.

వర్ల్‌పూల్ ఇండియాలో 24% వాటా విక్రయం: అమెరికాకు చెందిన గృహోపకరణాల తయారీ దిగ్గజం వర్ల్‌పూల్ కార్పొరేషన్ తన భారత అనుబంధ విభాగమైన వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటాకు సమానమైన 3.13 కోట్ల షేర్లను ఓపెన్ మార్కెట్ ద్వారా రూ.4,089.45 కోట్లకు విక్రయించింది. తద్వారా వర్ల్‌పూల్ ఇండియాలో మాతృసంస్థ వాటా 75 శాతం నుంచి 51 శాతానికి తగ్గింది. నిధుల సమీకరణతో పాటు రుణభారం తగ్గించుకునే ప్రయత్నాల్లో భాగంగా వర్ల్‌పూల్ ఇండియాలో 24 శాతం వాటా విక్రయించనున్నట్లు గత ఏడాది నవంబరు 30వ తేదీనే మాతృసంస్థ ప్రకటించింది. మంగళవారం బీఎస్ఈలో వర్ల్‌పూల్ ఇండియా షేరు 3.24 శాతం నష్టంతో రూ.1,287.70 వద్ద స్థిరపడింది.

విభోర్ స్టీల్ లిస్టింగ్ అదుర్స్

తొలిరోజే 193 శాతం వృద్ధి చెందిన కంపెనీ షేరు

ఇంజనీరింగ్ పరిశ్రమల్లో ఉపయోగించే స్టీల్ ట్యూబ్స్ అండ్ పైపుల తయారీ సంస్థ విభోర్ స్టీల్ ట్యూబ్స్ లిస్టింగ్‌కు అపూర్వ స్పందన లభించింది. కంపెనీ తన షేర్లను మంగళవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.151తో పోలిస్తే, బీఎస్ఈలో కంపెనీ షేరు 178.81 శాతం ప్రీమియంతో రూ.421 వద్ద లిస్టయింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి 192.72 శాతం లాభంతో రూ.442 వద్దకు చేరుకుంది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.838.14 కోట్లుగా నమోదైంది. గత వారంలో ముగిసిన విభోర్ స్టీల్ ఐపీఓకూ దాదాపు 300 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది. 2003లో ప్రారంభమైన ఈ కంపెనీ మహారాష్ట్ర, తెలంగాణలో ప్లాంట్లను కలిగి ఉంది.

విస్తరణ బాటలో ఆసుస్ ఇండియా

హైదరాబాద్: ఆసుస్ ఇండియా.. రిపబ్లిక్ ఆఫ్ గేమర్స్ (ఆర్ఓజీ) స్టోర్లను మరింతగా విస్తరించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లో ఆసుస్ ఆర్ఓజీ బ్రాండ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు వెల్లడించింది. కాగా హైదరాబాద్‌లో కంపెనీ రెండో ఆర్ఓజీ స్టోర్‌ను ప్రారంభించింది. దీంతో హైదరాబాద్‌లో ఈ స్టోర్ల సంఖ్య 4కి చేరుకోగా ఏపీ, తెలంగాణల్లో ఆసుస్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్ (ఏఈఎస్), ఆర్ఓజీ స్టోర్ల సంఖ్య 13కి చేరిందని ఆసుస్ ఇండియా నేషనల్ సేల్స్ మేనేజర్ జిగ్నేష్ భవ్‌సర్ తెలిపారు. ఈ స్టోర్‌లో గేమింగ్ కమ్యూనిటీకి అవసరమైన కన్స్యూమర్ నోట్‌బుక్స్, ఆర్ఓసీ పర్సనల్ కంప్యూటర్లు, లాప్‌టాప్స్, యాక్సెసరీస్, క్రియేటర్ సిరీస్ అందుబాటులో ఉంటాయన్నారు.

ఏపీలో ఎన్‌టీపీసీ గ్రీన్ హైడ్రోజన్ ప్రాజెక్టు

న్యూఢిల్లీ: ఎన్‌టీపీసీ.. ఆంధ్రప్రదేశ్‌లో దేశంలోనే అతి పెద్ద హరిత ఉదజని (గ్రీన్ హైడ్రోజన్) ఉత్పత్తి యూనిట్ ఏర్పాటు చేయబోతోంది. ఎన్‌టీపీసీ అనుబంధ సంస్థ ఎన్‌టీపీసీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్ (ఎన్‌జీఈఎల్) ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేయనుంది. విశాఖ జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామం వద్ద ఈ ప్రాజెక్టు ఏర్పాటు కానుంది. ఇందుకు అవసరమైన భూమిని లీజుపై ఇచ్చేందుకు ఎన్‌జీఈఎల్, ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (ఏపీఐఐసీ) మధ్య మంగళవారం సంతకాలు జరిగాయి. రోజుకు 1,200 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఈ ప్రాజెక్టు ఏర్పాటు చేస్తారు. ఇక్కడ ఉత్పత్తి చేసే హరిత ఉదజనిని వివిధ ఎగుమతి మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ మెథనాల్ వంటి ఉత్పత్తులుగా మార్చి ఎగుమతి చేస్తారు.

సాయి నిహార్ డబుల్ ధమాకా



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్‌లో హైదరాబాద్ స్విమ్మర్ సాయి నిహార్ రెండు పతకాలు కొల్లగొట్టాడు. మంగళవారం గువాహటిలో జరిగిన ఈ పోటీల్లోని 200 మీటర్ల మెడ్లేలో స్వర్ణం సాధించిన సాయి.. 200 మీ. బ్యాక్‌స్ట్రోక్‌లో రజతం నెగ్గాడు. గుంటూరు కేఎల్ఈఎఫ్ విశ్వవిద్యాలయం నుంచి సాయి ఈ క్రీడల్లో పాల్గొన్నాడు. ఏపీకి చెందిన విజయనగరం అమ్మాయి పల్లవి వెయిట్ లిఫ్టింగ్‌లో రజతంతో మెరిసింది.

రాహుల్ అవుట్.. బుమ్రాకు రెస్ట్





రాంచీ చేరిన టీమిండియా

రాంచీ: ఇంగ్లండ్‌తో నాలుగో టెస్టు కోసం భారత జట్టు రాంచీలో అడుగుపెట్టింది. మంగళవారం ప్రయివేట్ చార్టర్‌లో ఇక్కడకు చేరిన టీమ్‌లో పేసర్ బుమ్రా కనిపించలేదు. వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా బుమ్రాకు రాంచీ టెస్టు నుంచి విశ్రాంతినిచ్చినట్టు బీసీసీఐ ప్రకటించింది. కాగా, ఈ టెస్టు బరిలోకి దిగుతాడనుకున్న కేఎల్ రాహుల్ కూడా జట్టుకు దూరమైనట్టు బోర్డు తెలిపింది. రాహుల్ ఐదో టెస్టు (ధర్మశాల)లో ఆడేదీ లేనిదీ అతడి ఫిట్‌నెస్‌పై ఆధారపడి ఉంటుందని బోర్డు వెల్లడించింది. ప్రస్తుతం రంజీల్లో ఆడుతున్న బెంగాల్ పేసర్ ముకేశ్ కుమార్‌ను బుమ్రా స్థానంలో పిలిచే అవకాశం ఉంది.

విరాట్ మళ్లీ తండ్రయ్యాడు



న్యూఢిల్లీ: స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ రెండోసారి తండ్రయ్యాడు. అతడి భార్య అనుష్క శర్మ ఈనెల 15న మగబిడ్డకు జన్మనిచ్చింది. ఇన్ని రోజులు గోప్యంగా ఉంచిన ఈ సమాచారాన్ని స్వయంగా విరుష్క దంపతులు మంగళవారం ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశారు. తమ చిన్నారికి అకాయ్ అనే పేరు పెట్టినట్టు చెప్పారు. 2017లో వివాహం చేసుకున్న కోహ్లీ, అనుష్కకు 2021లో కూతురు వామిక జన్మించిన సంగతి తెలిసిందే. 'మా జీవితంలో మధుర క్షణాలివి. ఈ సంతోషకర సమయంలో మీ ఆశీర్వాదాలు, శుభాకాంక్షలు కోరుకుంటున్నాం. వామికాకు సోదరుడు పుట్టాడని చెప్పడానికి సంతోషిస్తున్నాం. అలాగే మా గోప్యతను గౌరవిస్తారని ఆశిస్తున్నాం' అని తమ పోస్టులో పేర్కొన్నారు. దీంతో అభిమానులతో పాటు సెలెబ్రిటీలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. విరాట్ దంపతులు ప్రస్తుతం లండన్‌లో ఉన్నట్టు సమాచారం. ఈ కారణంతోనే ఇంగ్లండ్‌తో 5 టెస్టుల సిరీస్‌కు విరాట్ దూరమయ్యాడని తెలుస్తోంది.

ఏడు మ్యాచ్‌ల్లో 56 వికెట్లు. ఇందులో ఏడు సార్లు ఐదు వికెట్ల ప్రదర్శన. తాజాగా ముగిసిన రంజీ ప్లేట్ ట్రోఫీలో తన స్పిన్ మాయాజాలంతో మిస్టరీ స్పిన్నర్‌గా పేరుగాంచిన తనయ్ త్యాగరాజన్ పేరు ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో మార్మోగుతోంది. ముఖ్యంగా సెమీస్‌లో 13, ఫైనల్లో 10 వికెట్లు పడగొట్టి ఒక్కసారిగా అందరి దృష్టినీ ఆకర్షించాడు. రంజీ ప్లేట్ ట్రోఫీలో హైదరాబాద్ విజేతగా నిలవడంలో కీలకపాత్ర పోషించిన లెఫ్టార్మ్ ఆఫ్ స్పిన్నర్ తనయ్‌తో ఆంధ్రజ్యోతి ముచ్చటించింది. ఈ సందర్భంగా తనయ్ చెప్పిన విశేషాలు అతని మాటల్లోనే..

తనయ్

మ్యాచ్‌లు	7
వికెట్లు	56
సగటు	14.98
ఐదు వికెట్ల ప్రదర్శనలు	7

తొలి మెట్టు ఎక్కాం

ఆఫ్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్

తదుపరి లక్ష్యం రంజీ ఎలిట్ ట్రోఫీ



రంజీ ప్లేట్ గ్రూప్ నుంచి హైదరాబాద్ జట్టు తిరిగి ఎలిట్ గ్రూప్‌నకు అర్హత సాధించినందుకు హైదరాబాదీగా చాలా సంతోషంగా ఉంది. ప్లేట్ ట్రోఫీ సాధించడంతో తొలి మెట్టు ఎక్కాం. ఇది ఆరంభం మాత్రమే. వచ్చే సీజన్‌లో మా స్థాయికి తగ్గ ఆట తీరు కనబరుస్తాం. రంజీ ఎలిట్ ట్రోఫీ సాధించి, హైదరాబాద్ సత్తా నిరూపిస్తాం.

ఇది ఆరంభమే..

వాస్తవానికి హైదరాబాద్ జట్టును పరిశీలిస్తే ప్లేట్‌లో ఆడాల్సిన జట్టు కాదు. కాకపోతే గత సీజన్‌లో జరిగిన కొన్ని తప్పిదాల కారణంగా ఊహించని పరిణామాలు చూశాం. ఈ సీజన్ ఆరంభానికి ముందు జట్టంతా సమావేశమైనప్పుడు మనం కచ్చితంగా మార్పు చూపించాలని బలంగా నిశ్చయించుకున్నాం. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్‌లో దూకుడుగా ఆడి, ప్రత్యర్థి జట్లపై ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించుకున్నాం. ఈ వ్యూహాన్ని విజయవంతంగా అమలు చేసి, ఫలితం రాబట్టాం. హెచ్‌సీఏ యాజమాన్యం, సెలెక్టర్ల నుంచి కూడా మంచి మద్దతు లభించింది.

కష్టానికి తగిన ప్రతిఫలం

ఈ సీజన్ రంజీ ప్లేట్ గ్రూప్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలవడం సంతోషంగా ఉంది. నా కష్టానికి ప్రతిఫలం దక్కింది. ఇక నుంచి నిలకడగా రాణిస్తూ దేశంలోని టాప్ స్పిన్నర్లలో ఒకడిగా ఎదిగేందుకు శ్రమిస్తా. ఈ సీజన్‌లో మునుపటి కంటే నా బౌలింగ్ మెరుగుపర్చుకోవడానికి, ప్రయోగాలు చేయడానికి మంచి అవకాశాలు లభించాయి. ఈ టోర్నీలో చాలా నేర్చుకున్నా కూడా. తదుపరి టోర్నీలతో పాటు వచ్చే రంజీ సీజన్‌లో రాణించడానికి ఈ ప్రదర్శన ప్రేరణగా నిలుస్తుంది.

వైవిధ్యం చూపించా..

ఈ సీజన్ ప్రారంభానికి ముందే ఒక లక్ష్యంతో బరిలోకి దిగా. సంప్రదాయబద్ధ బౌలింగ్‌కే పరిమితం కాకుండా బంతి బంతికి వైవిధ్యం చూపించడంతో పాటు బ్యాటర్‌ను ఎంత తికమక పెడితే అన్ని ఎక్కువ వికెట్లు లభించే అవకాశముంటుందని భావించి, ఆ దిశగా సాధన చేశా. ఓవర్‌లో ఎక్కువ బంతులు వికెట్ తీసే బంతులు, స్ట్రైట్ లెంగ్త్‌తో మంచి బంతులు వేయగలగడంతో వికెట్లు తీయగలిగా. నా బౌలింగ్‌లో వైవిధ్యం, మార్పు రావడానికి కోచ్ రవితో పాటు సహచరులు సహకరించారు.

సవాళ్లు ఎదురయ్యాయి..

ప్లేట్ గ్రూప్‌లోని చిన్న జట్లలో నాణ్యమైన బ్యాటర్లు ఉండరనుకుంటారు. కానీ, ఈ సీజన్‌లో నాకు ప్రతి జట్టులోనూ ఇద్దరు, ముగ్గురు బ్యాటర్ల నుంచి సవాళ్లు ఎదురయ్యాయి. వాళ్లకి బౌలింగ్ చేయడాన్ని ఆస్వాదించా. ముఖ్యంగా ఫైనల్లో మేఘాలయ బ్యాటర్ రాజ్ బిస్వాతో పాటు మరో ఇద్దరు ఆటగాళ్లకు బౌలింగ్ చేయడం సవాల్‌గా అనిపించింది. ఇదేఎలిట్ గ్రూప్ లేదా ఐపీఎల్‌లోనో అయితే, బ్యాటర్లతో మరికొంత పోటీ ఎక్కువ ఉండేది. వచ్చే టోర్నీలకు ఇందుకు తగ్గట్టే సన్నద్ధమవుతా.

(ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి/హైదరాబాద్)

మార్చి 22 నుంచి ఐపీఎల్

టోర్నీ మొత్తం భారత్‌లోనే..
లీగ్ చైర్మన్ అరుణ్ ధూమల్



న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) ఎప్పుడు జరుగుతుంది.. భారత్‌లోనే నిర్వహిస్తారా? తదితర సందిగ్ధమైన అంశాలకు తెరదించాడు లీగ్ ఛైర్మన్ అరుణ్ ధూమల్. ఈ సీజన్ ఐపీఎల్ మ్యాచ్‌లన్నీ దేశంలోనే జరుగుతాయనీ, వచ్చేనెల.. అంటే మార్చి 22న లీగ్ ప్రారంభమవుతుందని ధూమల్ స్పష్టతనిచ్చాడు. పూర్తి షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామన్నాడు. ఈ ఏప్రిల్, మే నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో ఐపీఎల్ పూర్తి షెడ్యూల్‌ను బీసీసీఐ ఇంకా ప్రకటించలేదు. అయితే, ఐపీఎల్‌లో తొలి పదిహేను రోజుల షెడ్యూల్‌ను ముందుగా ప్రకటించి, మిగతా మ్యాచ్‌ల షెడ్యూల్‌ను సార్వత్రిక ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత వెల్లడిస్తామని ధూమల్ తెలిపాడు. వచ్చేనెలలో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడే అవకాశముంది. 2009లో తొలిసారిగా ఐపీఎల్‌ను పూర్తిగా విదేశం (దక్షిణాఫ్రికా)లో నిర్వహించిన నిర్వాహకులు.. సార్వత్రిక ఎన్నికల కారణంగా 2014 అంచెలో కొంత భాగం యూఏఈలో జరిపారు. ఇక, 2019లో ఎన్నికలున్నప్పటికీ మొత్తం టోర్నమెంట్ భారత్‌లోనే జరిగింది. అయితే, టీ20 ప్రపంచకప్ సన్నద్ధతను దృష్టిలో ఉంచుకొని ఈసారి ఐపీఎల్ ఫైనల్‌ను మే 26న జరిపే యోచనలో బీసీసీఐ ఉన్నట్టు సమాచారం.

నాకౌట్‌కు భారత జట్లు

ప్రపంచ టీటీ టీమ్ చాంపియన్‌షిప్

బుసాన్: ప్రపంచ టేబుల్ టెన్నిస్ టీమ్ చాంపియన్‌షిప్‌లో భారత పురుషులు, మహిళల జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించాయి. మంగళవారం జరిగిన తమ గ్రూపు చివరి మ్యాచ్‌లో పురుషుల బృందం 3-0తో న్యూజిలాండ్‌ను చిత్తుచేయగా, మహిళల జట్టు 3-2తో స్పెయిన్‌పై ఉత్కంఠ విజయాన్ని నమోదు చేసింది. మొత్తం 40 జట్లు పోటీపడ్డ ఈ టోర్నీలో 24 టీమ్‌లు నాకౌట్ దశకు చేరుకున్నాయి. ఇక, క్వార్టర్‌ఫైనల్ చేరాలంటే మరో రెండు మ్యాచ్‌లు నెగ్గాల్సి ఉంటుంది. క్వార్టర్స్‌కే చేరితే, పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖాయమవుతుంది.



రంజీ ప్లేట్ విజేత హైదరాబాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): హైదరాబాద్ జట్టు రంజీ ప్లేట్ గ్రూప్ విజేతగా అవతరించింది. మంగళవారం ఉప్పల్ స్టేడియంలో మేఘాలయతో ముగిసిన ఫైనల్లో హైదరాబాద్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 71/1తో రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ కొనసాగించిన హైదరాబాద్ 34.2 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 203 పరుగులు చేసి, లక్ష్యాన్ని ఛేదించింది. కెప్టెన్ తిలక్ వర్మ (64), ఓపెనర్ రాహుల్ సింగ్ (62) రాణించారు. అంతకుముందు తొలి ఇన్నింగ్స్‌లో మేఘాలయ 304, ఆంధ్ర 350కు ఆలౌట్ కాగా, రెండో ఇన్నింగ్స్‌లో మేఘాలయ 243 రన్స్ చేసింది.



హైదరాబాద్ జట్టుకు జగన్ బంపరాఫర్: రంజీ ప్లేట్ గ్రూప్‌లో విజేతగా నిలిచిన హైదరాబాద్ జట్టుపై హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్ మోహన్‌రావు వరాల జల్లు కురిపించారు. టీమ్‌కు రూ.10 లక్షలు, టోర్నీలో రాణించిన కెప్టెన్ తిలక్ వర్మ, తన్మయ్, తనయ్, నితీశ్, ప్రజ్ఞయ్ రెడ్డికి తలో రూ.50 వేలు ప్రకటించారు. ఇవికాక వచ్చే రంజీ ఎలిట్ సీజన్‌లో ట్రోఫీ సాధిస్తే హైదరాబాద్ జట్టుకు రూ.కోటి నగదు బహుమతితో పాటు జట్టులోని ప్రతి ప్లేయర్‌కు బీఎండబ్ల్యూ కారును బహుమానంగా ఇవ్వనున్నట్టు చెప్పారు.

చెస్‌లో 8ఏళ్ల చిన్నోడి సంచలనం



గ్రాండ్‌మాస్టర్‌కు షాకిచ్చిన భారత సంతతి చిన్నారి

సింగపూర్: భారత సంతతికి చెందిన ఎనిమిదేళ్ల బుడ్డోడు చదరంగ క్రీడలో సంచలనం సృష్టించాడు. స్విట్జర్లాండ్‌లో జరిగిన బర్గ్‌డార్ఫర్ స్టధాస్ ఓపెన్ చెస్ టోర్నమెంట్‌లో సింగపూర్ తరఫున ప్రాతినిథ్యం వహించిన భారత సంతతి చిన్నారి అశ్వథ్ కౌశిక్ నాలుగో రౌండ్‌లో ఉక్రెయిన్ గ్రాండ్‌మాస్టర్, 37 ఏళ్ల జాసెక్ స్టోపాపై విజయం సాధించాడు. క్లాసికల్ గేమ్ చెస్ చరిత్రలో గ్రాండ్‌మాస్టర్‌ను ఓడించిన అత్యంత పిన్న వయసు ఆటగాడిగా అశ్వథ్ సరికొత్త రికార్డు నెలకొల్పాడు. ప్రస్తుతం ఫిడే ర్యాంకింగ్స్‌లో 37,338 ర్యాంక్‌తో ఉన్న అశ్వథ్ భారత్‌కు చెందినవాడే. అయితే, అతని కుటుంబం 2017లో సింగపూర్‌కు వలస వెళ్లడంతో ఆ దేశం తరఫున ఆడుతున్నాడు. రెండేళ్ల క్రితం ఈస్టర్న్ ఆసియా యూత్ చాంపియన్‌షిప్‌లో అండర్-8 కేటగిరిలో పోటీపడ్డ అశ్వథ్.. ఆ టోర్నీలోని మూడు విభాగాల్లోనూ విజేతగా నిలిచాడు.

స్టోక్స్ చేతికి బంతి!



చివరి రెండు టెస్టుల్లో బౌలర్‌గానూ సేవలు

రాంచీ: ఓటమి బాధలో ఉన్న ఇంగ్లండ్ జట్టుకు, వారి అభిమానులకు ఓ గుడ్‌న్యూస్. ఈ సిరీస్‌లో కేవలం బ్యాటర్‌గానే సేవలందిస్తున్న కెప్టెన్ స్టోక్స్ తిరిగి బంతి చేతపట్టే అవకాశం ఉంది. వెన్ను నొప్పి కారణంగా అతను బౌలింగ్‌కు దూరంగా ఉంటున్నాడు. గత జూన్‌లో ఆసీస్‌తో జరిగిన టెస్టులో స్టోక్స్ చివరిసారి బౌలింగ్ చేశాడు. 'నేను కచ్చితంగా బౌలింగ్ చేస్తానని, చేయనని కూడా చెప్పలేను. నాపై వర్క్‌లోడ్ ఎలా ఉందనే విషయమై వైద్య సిబ్బందితో చర్చిస్తున్నా. సన్నాహకాల్లో అయితే వంద శాతం బౌలింగ్ చేయగలిగాను. టెస్టులోనూ చేస్తాననిపించింది. కానీ అది మరీ తొందరపాటు అవుతుందని దూరంగా ఉన్నా' అని స్టోక్స్ తెలిపాడు.

1200 రోజులు ఏం చేశారు?

- 'మార్గదర్శి'పై ఏపీ సర్కారుకు సుప్రీం ప్రశ్న
- విచారణ ఏప్రిల్ 9కి వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): మార్గదర్శి చిట్ ఫండ్ కేసుపై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. హిందూ అన్‌డివైడెడ్ ఫ్యామిలీ(హెచ్‌యూఎఫ్) పేరుతో డిపాజిట్లు సేకరించడం చట్టవిరుద్ధమని 2007లో అప్పటి ప్రభుత్వం మార్గదర్శిపై కేసు నమోదు చేసింది. ఈ కేసులో 2018లో హైకోర్టు మార్గదర్శికి క్లీన్ చిట్ ఇవ్వగా 2019లో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ సుప్రీంను ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ కేవీ విశ్వనాథన్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. ఏపీ ప్రభుత్వాన్ని ఉద్దేశించి.. 1200 రోజుల వరకు ఏం చేశారని న్యాయమూర్తులు ప్రశ్నించారు. మార్గదర్శి తరఫున అభిషేక్ మను సింఘ్వీ, హరీశ్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఆర్బీఐ నిబంధనలకు విరుద్ధంగా చందాదారుల నుంచి మార్గదర్శి రూ.2 వేల కోట్లు వసూలు చేసిందని ఏపీ ప్రభుత్వం తరఫున న్యాయవాది నిరంజన్ రెడ్డి తెలిపారు. ఆ డబ్బులు తిరిగి చెల్లించేశామని సింఘ్వీ అన్నారు. కాగా, హెచ్‌యూఎఫ్ పేరుతో డిపాజిట్లు సేకరించడం చట్ట విరుద్ధమని ఆర్బీఐ తరఫు న్యాయవాది రమేశ్ బాబు తెలిపారు. గతంలో ఈ కేసులో తమను భాగస్వాములను చేయలేదన్నారు. ఈ అంశంపై సమగ్ర నివేదిక సమర్పించాలని ఆర్బీఐని ధర్మాసనం ఆదేశించిందని ఉండవల్లి మీడియాకు తెలిపారు. సుదీర్ఘ వాదనలు జరగాల్సి ఉందని, తదుపరి విచారణను ఏప్రిల్ 9కి వాయిదా వేసిందన్నారు.

చొక్కా చింపి.. చేతులతో కొట్టి

'ఆంధ్రజ్యోతి' మరో విలేకరిపై వైసీపీ మూకల దౌర్జన్యం.. 'మాపైనే వార్తలు రాస్తావా?' అంటూ వీరశేఖర్‌పై దాడి

- ఏపీలోని కర్నూలు జిల్లా మద్దికెరలో ఘటన
- శ్రీకృష్ణకు 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ భానుప్రకాశ్ పరామర్శ



కర్నూలు జిల్లా మద్దికెర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్తున్న 'ఆంధ్రజ్యోతి' విలేకరి వీరశేఖర్, పాత్రికేయులు


కర్నూలు, హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఏపీలోని అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ అల్లరి మూకలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటన మరవకముందే.. అలాంటిదే మరో దౌర్జన్యం! కర్నూలు జిల్లా మద్దికెర 'ఆంధ్రజ్యోతి' విలేకరి కె.వీరశేఖర్‌పై వైసీపీ మూకలు దాడికి దిగాయి. మద్దికెరలో మంగళవారం పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి హెల్త్ క్లినిక్, మద్దికెర-బీఎన్ పేట రోడ్డు ప్రారంభానికి హాజరయ్యారు. కవరేజీకి వెళ్లిన వీరశేఖర్‌పై వైసీపీ నాయకుడు, స్థానిక వీఆర్వో సోదరుడు రంగస్వామి, మరి కొందరు దాడికి తెగబడ్డారు. 'మాకే వ్యతిరేకంగా వార్తలు రాస్తావా..? హౌసింగ్ బిల్లుల్లో అక్రమాలు జరిగాయని రాస్తావా? నీ అంతు చూస్తా'మంటూ వీరశేఖర్‌పై ఒక్కసారిగా దాడి చేశారు. చొక్కా పట్టుకుని, చేతులతో కొట్టారు. ఈనాడు విలేకరి తిక్కన్న తదితరులు శేఖర్‌కు రక్షణగా నిలిచారు. అనంతరం వీరశేఖర్, ఇతర పాత్రికేయులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలోనే వైసీపీ మూకలు దాడికి పాల్పడటం తీవ్రమైన చర్య అని, వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని ఐజేయూ జాతీయ సమితి సభ్యులు కె.నాగరాజు, జి.కొండప్ప, ఏపీయుడబ్ల్యూజే జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఈఎన్ రాజు, శ్రీనివాసులుగౌడ్ డిమాండ్ చేశారు.

ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణకు పరామర్శ

హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణను 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ భానుప్రకాశ్, 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్, నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్ తదితరులు మంగళవారం పరామర్శించారు. కాగా, టీడీపీ నాయకుడు జేసీ పవన్‌కుమార్‌రెడ్డి సైతం శ్రీకృష్ణను పరామర్శించారు. దాడి ఘటనపై ఆరా తీశారు. ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స వివరాలు అడిగి తెలుసుకున్నారు.

మూడు రోజుల తర్వాత తొలి అరెస్టు

రాప్తాడు సమీపంలో ఆదివారం ఏపీ సీఎం జగన్ పాల్గొన్న సిద్ధం సభలో అనంతపురం జిల్లా 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేసిన వైసీపీ గుండాల్లో చాలామంది అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ అన్బురాజన్‌ను కలిసి జర్నలిస్టులు డిమాండ్ చేయగా మంగళవారం కూడేరు మండలం మరుట్లకు చెందిన మిద్దె ఎర్రిస్వామిని రాప్తాడు పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 307, 147, 148 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో మూడు రోజులకు ఇదే తొలి అరెస్టు. ఇప్పటివరకు మొత్తం ముగ్గురిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. అయితే, శ్రీకృష్ణపై దాడికి పాల్పడ్డ వారిని పట్టుకోకుండా పోలీసులు అలసత్వం వహిస్తున్నారన్న విమర్శలు వస్తున్నాయి.



సీఎం క్యాంపు కార్యాలయంలో జగన్ సమక్షంలో వైసీపీలో చేరిన ఆళ్ల రామకృష్ణారెడ్డి

ఆళ్ల పీచేముడ్

- వైసీపీని వీడినంత వేగంగానే వెనక్కి..
- మంగళగిరికి డబ్బులు ఇవ్వడం లేదని జగన్‌ను తిట్టి కాంగ్రెస్‌లోకి వెళ్లిన ఆళ్ల
- రెండు నెలలు తిరక్కుండానే యూటర్న్
- జగన్‌తోనే పేదలకు అభివృద్ధి అని వ్యాఖ్య

అమరావతి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి)/మంగళగిరి: వైసీపీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (మంగళగిరి) కాంగ్రెస్ పార్టీలో చేరినంత వేగంగానే తిరిగి జగన్ పంచన చేరారు. తాడేపల్లిలోని జగన్ క్యాంప్ కార్యాలయానికి మంగళవారం వెళ్లి ఆయన్ను కలిసి, ఆయన సమక్షంలో మళ్లీ పార్టీలో చేరారు. ఆళ్లను జగన్ హత్తుకుని ప్రేమగా భుజం చరిచారు. ఈ ఫొటో సెషన్ తర్వాత ఆళ్ల విలేకరులతో మాట్లాడుతూ, జగన్ మరో 30 ఏళ్ల సీఎంగా ఉండేలా జనం దీవిస్తే, రాష్ట్రంలో పేదల బతుకులు మారిపోతాయని కితాబిచ్చారు. వచ్చే ఎన్నికల్లో మంగళగిరి వైసీపీ నుంచి బీసీ అభ్యర్థే రంగంలో ఉంటారని, తాను ఈసారి పోటీలో ఉండబోనని స్పష్టం చేశారు. మంగళగిరి నియోజకవర్గ ఇన్‌చార్జిగా గంజి చిరంజీవి నియామకంతో కోపోద్రిక్తుడై ఎమ్మెల్యే ఆళ్ల గత డిసెంబరు 11న వైసీపీకి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తన నియోజకవర్గం అభివృద్ధికి ఇస్తానన్న రూ.1200 కోట్లను ఇవ్వకుండా ముఖ్యమంత్రి జగన్ మోసం చేశారని అప్పట్లో ఆళ్ల ఆరోపించారు. చేసిన పనులకూ బిల్లులు చెల్లించలేదని వాపోయారు. అవే తన రాజీనామాకు కారణం అన్నట్టు మాట్లాడారు. అయితే, స్పీకర్ ఆయన రాజీనామాపై నిర్ణయం తీసుకోలేదు. ఇంతలోనే ఆళ్ల యూటర్న్ తీసుకున్నారు. ఆయన పునరాగమనం వెనుక వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి వ్యూహం ఉన్నట్టు వైసీపీ వర్గాలే చెబుతున్నాయి. మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ తరఫున పోటీలో ఉన్న నారా లోకేశ్‌ను ఎలాగైనా ఓడించాలనే పట్టుదలతో ఉన్న జగన్.. అక్కడ అత్యధిక శాతం ఓటర్లు చేనేతవర్గం నుంచి ఉండడంతో పద్మశాలీ నేత గంజి చిరంజీవి వైపు మొగ్గు చూపారు. సిటింగు ఎమ్మెల్యే ఆళ్లని కాదని చిరంజీవిని ఇన్‌చార్జిగా నియమించారు. అయితే, చిరంజీవి నియామకంతో చేనేతవర్గం వైపు నుంచి పార్టీకి బ్రహ్మాండమైన జోష్ వస్తుందన్న అధిష్ఠానం అంచనాలు కూడా తలకిందులయ్యాయి. గుంటూరు వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్‌గా ఉన్న ఎంపీ విజయసాయిరెడ్డి ఈ విషయం గమనించారు. ఆయన సూచనతో చిరంజీవి స్థానంలో కాండ్రు కమలను మంగళగిరి ఇన్‌చార్జిగా వైసీపీ అధిష్ఠానం నియమించింది. ఆళ్లను తిరిగి పార్టీలోకి తీసుకొచ్చేందుకు విజయసాయి నేరుగా రంగంలోకి దిగారు. ఆళ్ల సోదరుడు అయోధ్యరామిరెడ్డి సహకారంతో ఆయనతో మంతనాలు సాగించి పునరాగమనానికి లైన్‌క్లియర్ చేశారు.

8నుంచి జూబ్లీహిల్స్‌లోని శ్రీవారి ఆలయ బ్రహ్మోత్సవాలు

తిరుపతి (రవాణా), ఫిబ్రవరి 20: హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు మార్చి 8 నుంచి 16వ తేదీ వరకు జరగనున్నాయి. 7వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. మరుసటి రోజు నుంచి ఉదయం 8 నుంచి 9గంటల దాకా, రాత్రి 8నుంచి 9గంటల వరకు వాహన సేవలు నిర్వహిస్తారు. మార్చి 17న సాయంత్రం 3 నుంచి 5గంటల వరకు పుష్పయాగం జరుగుతుంది. తిరుపతిలో మంగళవారం బ్రహ్మోత్సవాల గోడపత్రికను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి తదితరులు ఆవిష్కరించారు. ఆలయ డిప్యూటీ ఈవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

కర్నూలు 'ఈనాడు' కార్యాలయంపై వైసీపీ దాడి

ఆఫీసుపై రాళ్ల వర్షం...పగిలిన అద్దాలు.. తలుపులు బద్దలుకొట్టే ప్రయత్నం.. రోడ్డుపై వేసి పత్రిక ప్రతులకు నిప్పు

- ఎమ్మెల్యే కాటసాని అనుచరుల బీభత్సం
- 'వ్యతిరేకవార్తలు రాస్తారా..అంతు చూస్తాం' అంటూ గంటన్నరకుపైగా భయ వాతావరణం
- ఫ్లెక్సీపై 'ఆంధ్రజ్యోతి', ఎండీ రాధాకృష్ణకు వ్యతిరేకంగా రాతలు
- అప్రజాస్వామికం: విపక్షాలు, సంఘాలు



కర్నూలు 'ఈనాడు' ప్రాంతీయ కార్యాలయంలోకి చొచ్చుకొచ్చి ఆందోళన నిర్వహిస్తున్న వైసీపీ శ్రేణులు

కర్నూలు, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా 'ఈనాడు' ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూకలు దాడి చేసి బీభత్సం సృష్టించాయి. రాళ్లు రువ్వి అద్దాలు ధ్వంసం చేశాయి. తలుపులు బద్దలుకొట్టి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించాయి. పత్రిక ప్రతులను రోడ్డుపై వేసి నిప్పు పెట్టాయి. అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి ఘటన మరవకముందే.. ఏకంగా ఒక పత్రిక కార్యాలయంపైనే దాడి చేయడం పాత్రికేయ వర్గాలను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. దాడికి వచ్చిన మూకలు పట్టుకున్న ఫ్లెక్సీపై 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణ ముర్దాబాద్ అని రాసి ఉంది. వివరాల్లోకి వెళితే.. పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముఖ్య అనుచరులైన కర్నూలు కార్పొరేటర్లు గాజుల శ్వేతారెడ్డి, సంగాల సుదర్శన్‌రెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, ఇప్పల నారాయణరెడ్డి, షైతాపు నరసింహులు, వైసీపీ యువజన విభాగం నాయకుడు అక్కిమి హనుమంతరెడ్డి, జిల్లా వ్యవసాయ మండలి చైర్మన్ బెల్లం మహేశ్వరరెడ్డి తదితరుల ఆధ్వర్యంలో వైసీపీ శ్రేణులు కర్నూలు నగరంలో ర్యాలీ తీశారు. రాజ్ థియేటర్ ఎదురుగా ఉన్న 'ఈనాడు' ప్రాంతీయ కార్యాలయంపై దాడికి తెగబడ్డారు. పెద్దఎత్తున కేకలు వేస్తూ కర్రలు, రాళ్లతో చెలరేగిపోయారు. రాళ్లు రువ్వి కిటికీల అద్దాలు ధ్వంసం చేశారు. ఆఫీసుపై ఉన్న పత్రిక బోర్డును ధ్వంసం చేశారు. 'ఈనాడు' సంస్థల అధినేత రామోజీరావుకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బీభత్సం సృష్టించారు. 'మా నాయకుడికి వ్యతిరేకంగా వార్తలు రాస్తారా..? మీ అంతు చూస్తాం' అంటూ బెదిరింపులకు దిగారు. గంటన్నరకు పైగా వైసీపీ మూకలు అలజడి సృష్టించాయి. వారు రావడం గమనించి.. ఈనాడు సిబ్బంది అప్రమత్తమై ఆఫీసుకు తాళం వేయడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అయితే, యాడ్ ఎగ్జిక్యూటివ్ అల్లాస్వామి తలుపులు వేసి కిందకు దిగుతుండగా వైసీపీ శ్రేణులు చుట్టుముట్టి 'మీ ఇష్టానుసారంగా వార్తలు రాస్తారా..? మీ అంతు చూస్తాం..' అంటూ దాడికి ప్రయత్నించారు. అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకున్నారు. 'ఈనాడు' కార్యాలయంపై దాడిని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, పాణ్యం టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే గౌరు చరిత తీవ్రంగా ఖండించారు.

జగన్, డీజీపీ బాధ్యత వహించాలి : ఏపీయూడబ్ల్యూజే

కర్నూలు 'ఈనాడు' ప్రాంతీయ కార్యాలయంపై పోలీసుల సమక్షంలోనే వైసీపీ మూకలు దాడులు చేయడం దుర్మార్గమని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు అన్నారు. పత్తికొండలో ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలోనే వైసీపీ మూకలు 'ఆంధ్రజ్యోతి' విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ కార్యకర్తలు దాడి చేయడం అప్రజాస్వామికమన్నారు. కర్నూలులో దాడికి గురైన 'ఈనాడు' కార్యాలయాన్ని మంగళవారం సాయంత్రం ఆయన పరిశీలించారు. ఆ పత్రిక సిబ్బందితో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండాలని, అన్ని విధాలుగా యూనియన్ అండగా ఉంటుందని ఐవీ సుబ్బారావు భరోసా ఇచ్చారు. జగన్ ప్రోత్సాహంతోనే వైసీపీ నాయకులు దాడులకు పాల్పడుతున్నారని విమర్శించారు. డీజీపీ సూచనల మేరకే పోలీసులు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని ఆరోపించారు.

అడవిని కాల్చేస్తున్న అగ్గి!

- ఈ ఏడాది ఇప్పటివరకు కాలిన అటవీ విస్తీర్ణం 442.47 హెక్టార్లు..
- ఇటీవల ఒక్కరోజే 171 ప్రమాదాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): అడవిలో రాజుకుంటున్న అగ్గికి చెట్లు, విలువైన అటవీ సంపద కాలి బూడిదవుతోంది. అరుదైన వన్యప్రాణులు, జంతుజాలం సైతం మంటలకు ఆహుతి అవుతోంది. రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు కూడా తోడవడంతో మంటలార్పడం అటవీ సిబ్బందికి సాధ్యపడటం లేదు. ప్రస్తుతం అడవుల్లో చెట్ల నుంచి ఆకులు రాలుతున్నాయి. వర్షాలు తగ్గిపోవడంతో దట్టంగా పెరిగిన గడ్డి ఎండిపోయింది. చిన్న మంట రాజుకుంటే చాలు దానిని నియంత్రించడం ఎవరి తరం కావట్లేదు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాలో భారీగా మంటలు వ్యాపించిన విషయం తెలిసిందే. మంటలు ఆర్పేందుకు అటవీ సిబ్బంది ఎంత ప్రయత్నించినా మంటలు అదుపు చేయలేకపోయారు. ఈ ఏడాది (50 రోజులు) ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా 1,099 అగ్ని ప్రమాదాలు జరిగాయి. వీటిల్లో 442.47 హెక్టార్ల విస్తీర్ణానికి పైగా అటవీ ప్రాంతం కాలిపోయింది. అత్యధికంగా ప్రమాదాలు నెలకొంటున్న జిల్లాల్లో నాగర్‌కర్నూల్ తొలి స్థానంలో ఉంది. తర్వాత స్థానాల్లో నిజామాబాద్, ములుగు, సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాలున్నాయి. సోమవారం (ఈ నెల 19వ తేదీ) ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 171 అగ్నిప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లాలో 66, నిజామాబాద్ జిల్లాలో 35, ములుగు, సిరిసిల్ల జిల్లాల్లో 15 చొప్పున, కామారెడ్డి జిల్లాలో 14, నిర్మల్ జిల్లాలో 8, సంగారెడ్డి జిల్లాలో 6 చోట్ల అగ్ని ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ఈ ప్రమాదాలను నివారించడంలో అటవీ శాఖ విఫలమైందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వేసవి మొదట్లోనే ఇలా ఉంటే.. రాను రాను ఎలా ఉంటుందోనన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

టీజీవో అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు

- తొమ్మిది మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నిక



హైదరాబాద్, మన్సూరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఏలూరి శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఎన్నికలు మంగళవారం హైదరాబాద్‌లోని ఎల్బీనగర్ చింతల్‌కుంటలో నిర్వహించారు. అధ్యక్షుడితో కలిపి తొమ్మిది మంది సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా ఎ. సత్యనారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా బి. శ్యామ్, ఉపాధ్యక్షుడిగా ఎ.జగన్‌మోహన్ రావు, కోశాధికారిగా ఎమ్. ఉపేందర్ రెడ్డి, జాయింట్ సెక్రటరీగా ఎ. పరమేశ్వర రెడ్డి, మహిళా ప్రతినిధిగా జి. దీపా రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా మాచర్ల రామకృష్ణగౌడ్, కార్యనిర్వాహక సభ్యుడిగా పంతంగి యాదగిరి గౌడ్‌లను ఎన్నుకున్నారు. వీరితోపాటు సలహాదారులుగా టి. రవీందర్‌రావు, జి. పురుషోత్తం రెడ్డి, వాంకుడోత్ సురేష్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ఎన్నికతో చాలాకాలంగా కొనసాగుతున్న మాజీ మంత్రి శ్రీనివాస గౌడ్, టీజీవో మాజీ అధ్యక్షురాలు మమత ఆధిపత్యానికి చెక్ పడిందని పలువురు ఉద్యోగులు అంటున్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు కోసం గెజిటెడ్ అధికారులతా శక్తివంచన లేకుండా పనిచేస్తామని చెప్పారు. ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు తీసుకొస్తామని, తమ జెండా, ఎజెండా ఉద్యోగుల సంక్షేమం మాత్రమేనని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కరువు భత్యం బకాయిలు త్వరలో విడుదల అయ్యేలా చొరవ తీసుకుంటామని తెలిపారు. సీపీఎస్ అంశం, ఈ-కుబేర్‌లో ఉన్న బిల్లుల విడుదల, జీవో-317 సమస్య, సాధారణ బదిలీల విషయం ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మంది గెజిటెడ్ ఉద్యోగులు ఉండగా 9,000 మందికిపైగా సభ్యత్వ నమోదు చేసుకున్నారు. ఎన్నికల విషయంలో ఇంజినీరింగ్ విభాగాల నుంచి కొంతమంది ఓటింగ్ కోసం పట్టుబట్టడంతో కొంత గందరగోళం నెలకొంది. జీఏడీ నియమించిన ఎన్నికల అధికారులు నిబంధనల ప్రకారం ఎన్నికల ప్రక్రియను పూర్తి చేసి నూతన కార్యవర్గాన్ని అధికారికంగా ప్రకటించారు.

సచివాలయ మహిళా ఉద్యోగుల అడ్‌హక్ కమిటీ

ఏపీ సచివాలయ మహిళా ఉద్యోగుల సంక్షేమ సంఘం పేరును డా. బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సెక్రటేరియట్ ఉమెన్ ఎంప్లాయీస్ అసోసియేషన్‌గా పేరు మార్చారు. రాష్ట్రం ఏర్పడిన పదేళ్ల తరువాత మహిళా ఉద్యోగులంతా కలిసి అడహక్ కమిటీని ఏర్పాటు చేశారు. కమిటీ అధ్యక్షురాలిగా వి.పద్మ, అసోసియేట్ ప్రెసిడెంట్లుగా పద్మావతి, డి.లత, జనరల్ సెక్రటరీగా కె. గీత, ఆర్గనైజింగ్ సెక్రటరీగా కె. రమాదేవి, ట్రెజరర్‌గా జి.లావణ్యలతను ఎన్నుకున్నారు. కాగా, ప్రభుత్వ ఉద్యోగులు, పింఛనుదారుల వేతన సవరణ గురించి విశ్రాంత ఐఏఎస్ అధికారి శివశంకర్ ఆధ్వర్యంలో ఏర్పాటైన నూతన పే రివిజన్ కమిషన్ సంబంధిత వర్గాల నుంచి అభిప్రాయాలు సేకరించడం అభినందనీయం అని తెలంగాణ పింఛనుదారుల జేఏసీ హర్షం వ్యక్తం చేసింది.

అబద్ధాలతో కాంగ్రెస్ అధికారంలోకి!

(మొదటిపేజీ తరువాయి)

ఆ పార్టీతో పొత్తు ఉండదని స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ బలపడుతోందని, తాజా ఎన్నికల్లో 13.9 శాతం ఓట్లు రావడమే దీనికి సంకేతమని చెప్పారు. రానున్న రోజుల్లో ఇక్కడ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో మెజారిటీ సీట్లను బీజేపీ గెలుచుకోబోతుందని చెప్పారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రాబోతుందని జోస్యం చెప్పారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు భారతరత్న ఇవ్వడాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని హిమంత ఆక్షేపించారు.



భువనగిరిలో ఏర్పాటు చేసిన సంకల్ప యాత్ర సభలో అభివాదం చేస్తున్న ప్రమోద్ సావంత్, ఈటల రాజేందర్ తదితరులు

కాంగ్రెస్ సర్కారు ఎక్కువ కాలం ఉండదు: ఏలేటి

అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలబడదని.. త్వరలోనే రాష్ట్రంలో రామరాజ్యం రాబోతుందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. భైంసా సభలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదనే ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చారన్న విషయాన్ని మరిచిపోయినట్లున్నారని విమర్శించారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ ఖాళీ అవుతున్నాయని కేంద్ర మంత్రి బీఎల్ వర్మ చెప్పారు. ప్రజలు ఆ పార్టీలను నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వికారాబాద్ జిల్లా తాండూరు నుంచి ప్రారంభించిన బీజేపీ విజయ సంకల్ప యాత్రలో ఆయన ప్రసంగించారు.

బీఆర్ఎస్‌తో పొత్తంటే చెప్పులతో కొట్టండి: సంజయ్

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్‌తో బీజేపీ పొత్తు ఉంటుందని చెప్పేవారిని చెప్పులతో కొట్టాలని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ పిలుపునిచ్చారు. తాండూరులో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే పొత్తు పెట్టుకోలేదన్నారు. తప్పుడు లీకులతో మీడియాను తప్పుదారి పట్టిస్తున్నారని చెప్పారు. కేసీఆర్‌వి లుచ్చా రాజకీయాలని, ఆయన మహా డేంజర్ అని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ పొత్తు జరిగితే కార్యకర్తలు బట్టలూడదీసి కొడతారని తెలిపారు. కేసీఆర్ గతంలో ఢిల్లీకి వెళ్లి వంగి వంగి దండాలు పెట్టి, బీజేపీకి నష్టం చేశారని.. ఇప్పుడు ఆయన్ను ఎవరూ నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ఆయన ఢిల్లీ వెళ్లినా ఎవరూ అపాయింట్‌మెంట్ ఇవ్వరని చెప్పారు. 'కేసీఆర్ మెడలు వంచినం, నిరుద్యోగ సమస్యలపై పోరాడి జైలుకెళ్లినం. అయినా ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారు' అని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు మన వాడే.. ఎప్పటికైనా మన వద్దకే వస్తాడని కార్యకర్తలతో అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చి ఉంటే కేసీఆర్, కేటీఆర్‌లను లోపల వేసి ఉండేవాళ్లమని, బుల్డోజర్లతో ఫాంహౌస్ కూల్చేసి ఆ భూమిని పేదలకు పంపిణీ చేసేవాళ్లమని చెప్పారు.

రాహుల్‌కు ట్యాక్స్ కడుతున్న కాంగ్రెస్ సర్కార్: కిషన్‌రెడ్డి

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాహుల్‌కు ట్యాక్స్ చెల్లిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆరోపించారు. నారాయణపేట జిల్లాలోని కృష్ణ వద్ద ఆయన శంఖం పూరించి విజయ సంకల్ప యాత్రను ప్రారంభించారు. అనంతరం రైతులతో ముఖాముఖి, రోడ్‌షోలో పాల్గొన్నారు. తెలంగాణలో మార్పే లక్ష్యంగా యాత్ర చేస్తున్నట్లు తెలిపారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి రాష్ట్రంలో ఏ పార్టీతోనూ పొత్తు ఉండబోదని, కేవలం ప్రజలతోనే పొత్తు పెట్టుకుంటామని స్పష్టం చేశారు. 2013లో ఇదే కృష్ణ నుంచి తెలంగాణ సాధన కోసం యాత్ర చేశామని, అప్పుడు కాంగ్రెస్ మెడలు వంచి రాష్ట్రాన్ని సాధించడంలో బీజేపీ ముఖ్యపాత్ర పోషించిందని చెప్పారు. ప్రధానిగా మోదీ మళ్లీ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రుపాలా అన్నారు. మోదీని ప్రపంచ దేశాలు గ్లోబల్ లీడర్‌గా గుర్తిస్తున్నాయని ఎంపీ లక్ష్మణ్ చెప్పారు.

10 ఎంపీ సీట్లు గెలుస్తాం: గోవా సీఎం ప్రమోద్

తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి వస్తుందని గోవా సీఎం ప్రమోద్ సావంత్ ఆశాభావం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్రను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. తెలంగాణలో లోక్‌సభ ఎన్నికల్లో 10 సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేస్తున్నామని, గెలుస్తామన్న పూర్తి విశ్వాసం ఉందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల్లో ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని విమర్శించారు. రాష్ట్రంలో నీళ్లు, నిధులు, నియామకాలకోసం ఉద్యమించారని, అవన్నీ మాజీ సీఎం కేసీఆర్ ఇంటికే పరిమితమయ్యాయని విమర్శించారు. డబుల్ ఇంజన్ సర్కారుతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. జాతిపిత అవుదామనుకున్న కేసీఆర్, తన కుటుంబాన్ని ముందు పెట్టడంవల్లే అధికారం కోల్పోయారని మాజీ మంత్రి ఈటల రాజేందర్ విమర్శించారు. కాంగ్రెస్ హామీలపై ఇప్పుడే విమర్శించబోనని, అమలు చేయని పక్షంలో వదిలిపెట్టేదిలేదన్నారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఓట్లు వేస్తే వృథా అని, సురక్షితంగా, సుభిక్షంగా ఆత్మగౌరవంతో గల్లా ఎగరేసుకుని బతకాలంటే నరేంద్ర మోదీకి ఓటు వేసి గెలిపించాలన్నారు.

24న రాష్ట్రానికి అమిత్ షా!

కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ నెల 24న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. విజయ సంకల్ప యాత్రలో ఆయన పాల్గొంటారు.

ఐఈఆర్పీలను క్రమబద్ధీకరించాలి

- బోయినపల్లి వినోద్ కుమార్

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మానసిక వైకల్యంతో బాధపడుతున్న విద్యార్థులకు చదువు చెబుతూ సేవలందిస్తున్న ఐఈఆర్పీ(ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్)లను క్రమబద్ధీకరించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 20 సంవత్సరాలుగా ఐఈఆర్పీలు సేవలు అందిస్తున్నారన్నారు. గత ప్రభుత్వ కాలంలో వీరిని రెగ్యులరైజ్ చేయడానికి ప్రయత్నాలు జరిగాయని, ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆ ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం మెగా డీఎస్సీ వేయాలని నిర్ణయించిన క్రమంలో 996 మంది ఐఈఆర్పీలను క్రమబద్ధీకరించాలన్నారు. వీరిని రెగ్యులరైజ్ చేసిన తర్వాతే మిగిలిన పోస్టులను డీఎస్సీలో భర్తీ చేయాలని సూచించారు.

ట్రక్కులు, ప్రైవేట్ బస్సులపై ఆంక్షలు

హైదరాబాద్‌లోకి రాత్రి 10 నుంచి ఉదయం 8 వరకే అనుమతి

సర్క్యులర్ జారీ చేసిన హైదరాబాద్ సీపీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులకు చెక్ పెట్టేలా హైదరాబాద్ పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. రద్దీ సమయాల్లో భారీ వాహనాలతో ఇబ్బందులను దూరం చేయాలని నిర్ణయించారు. ఆ తరహా వాహనాలపై ఆంక్షలు విధించారు. ఇకపై ట్రక్కులు, ప్రైవేటు బస్సులు, నిర్మాణ రంగం ఉపయోగించే భారీ వాహనాలను ఉదయం 8 నుంచి రాత్రి 10 గంటల వరకు నగరంలో నిషేధించారు. ఆ తరహా వాహనాలను రాత్రి 10 నుంచి ఉదయం 8 గంటల వరకే అనుమతిస్తామని స్పష్టం చేశారు. మంగళవారం ఈ మేరకు సర్క్యులర్ జారీ చేశారు. వాహనాలను క్యాటగిరీలుగా విభజించి.. వేర్వేరు సమయాల్లో నిషేధాజ్ఞలు విధించారు. హైదరాబాద్‌లోకి ప్రవేశించేందుకు నగరం చుట్టూ ఉన్న 94 రహదారుల్లో ఈ ఆంక్షలు అమలవుతాయని ఆ సర్క్యులర్‌లో స్పష్టం చేశారు. ఆ వివరాలు..

- ఎన్-3/టీ-4 క్యాటగిరీకి చెందిన 10/12 టన్నుల పైన బరువు కలిగిన నాన్-లోకల్ భారీ వాహనాలు.. ట్రక్కులు, లారీలు, టస్కర్‌లు, ట్రైలర్‌లకు నగరంలోకి అస్సలు అనుమతి ఉండదు.
- ఎన్-3/టీ-4 క్యాటగిరీ 10/12 టన్నుల సామర్థ్యముండే లోకల్ లారీలు, కన్‌స్ట్రక్షన్ ఎక్విప్‌మెంట్‌కు సంబంధించిన లారీలు, ట్రక్కులు, టస్కర్‌లు, ట్రైలర్స్‌ను ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు నగరంలోకి అనుమతించరు. రాత్రి 11 తర్వాత మాత్రమే 64 రూట్లలో అనుమతిస్తారు.
- 3.5-12 టన్నుల మధ్య బరువుండే ఎన్-2 క్యాటగిరీ, 12 టన్నుల్లోపు లోడ్ సామర్థ్యమున్న టీ-4 క్యాటగిరీ వాహనాల(డీసీఎం, టెంపో వంటివి)కు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4వరకు.. తిరిగి రాత్రి 9నుంచి ఉదయం 8 గంటల వరకు మాత్రమే నగరంలో అనుమతి ఉంటుంది. ఇతర సమయాల్లో వాటిపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయి.
- ఎం-3 క్యాటగిరీ ప్రైవేట్ బస్సులకు రాత్రి 10 నుంచి ఉదయం 8 వరకే సిటీలోకి అనుమతి ఉంటుంది.
- నెమ్మదిగా వెళ్లే ఎడ్లబండ్లు, తోపుడు బండ్లు, సైకిల్ రిక్షాలు, పవర్ టిల్లర్లు, ట్రాక్టర్లు నిర్ణీత 61 రోడ్ల మీదుగా మాత్రమే నగరంలోకి రావాల్సి ఉంటుంది. బిజీ రోడ్లలో వాటికి అనుమతి లేదు.
- 2-6 టన్నుల సామర్థ్యంతో.. నిర్మాణ రంగ వ్యర్థాలను తరలించే వాహనాలకు ఉదయం 11.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు, రాత్రి 10 నుంచి ఉదయం 9 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఇతర సమయాల్లో వాటిపై నిషేధాజ్ఞలు కొనసాగుతాయి. 10 టన్నులపైన సామర్థ్యమున్న నిర్మాణ వ్యర్థాల వాహనాలను రాత్రి 11 నుంచి ఉదయం 7 గంటల వరకే అనుమతిస్తారు.

గతంలోనూ..

2007-08 కాలంలోనూ ఈ తరహా నిషేధాజ్ఞలు నగరంలో కొనసాగాయి. అప్పటి ట్రాఫిక్ అదనపు కమిషనర్ వీఎస్‌కే కౌముది, పోలీసు కమిషనర్ బయ్యారపు ప్రసాదరావు ఈ తరహా ఆంక్షలను విధించారు. అయితే.. ప్రైవేటు బస్సులు, భారీ లారీలు/ట్రక్కులకు రాత్రి 10 నుంచి ఉదయం 8 వరకు అనుమతి ఉండడంతో.. ఆ సమయంలో ప్రమాదాల సంఖ్య పెరిగినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా అర్ధరాత్రి 12 నుంచి ఒంటి గంట వరకు ప్రమాదాల సంఖ్య పెరిగినట్లు హైదరాబాద్ ట్రాఫిక్ విభాగం అప్పట్లో గుర్తించింది.

ఆధారాలు బయటపెట్టు.. లేదా క్షమాపణ చెప్పు!

» ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్‌కు టీపీసీసీ నేతల అల్టిమేటం

» దీపాదాస్ మున్షీపై చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం..

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపా దాస్ మున్షీపై బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన ఆరోపణలకు సంబంధించి ఆధారాలుంటే బయటపెట్టాలని టీపీసీసీ నేతలు డిమాండ్ చేశారు. లేదంటే ఆయనపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికైనా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ దీపామున్షీకి క్షమాపణలు చెప్పి.. తన ఆరోపణలు వెనక్కి తీసుకోవాలన్నారు. తెలంగాణ కాంగ్రెస్ నేతలు తమ సీట్లను కాపాడుకోవడానికి దీపాదాస్ మున్షీకి బెంజ్ కారును కానుకగా ఇచ్చారంటూ ఓ కార్యక్రమంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ చేసిన ఆరోపణలపై కాంగ్రెస్ నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మంగళవారం గాంధీభవన్ ఏఐసీసీ అధికార ప్రతినిధి సుజాత పాల్ మాట్లాడుతూ.. దీపామున్షీపై వ్యాఖ్యలు చేయడం ద్వారా ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్.. తన పురుషాధిక్యత, మహిళా వ్యతిరేకతను బయటపెట్టుకున్నాడన్నారు. దీపాదాస్ మున్షీ తెలంగాణ కాంగ్రెస్‌కు ఇన్‌చార్జిగా ఉండడంతో బీజేపీ నేతలకు నిద్ర పట్టట్లేదని ఎమ్మెల్సీ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ స్వీప్ చేయబోతోందని, బీజేపీకి ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేకపోవడంతో ఆ పార్టీ నేతలు పిచ్చిలేసినట్లు మాట్లాడుతున్నారని ఫైర్ అయ్యారు. టీపీసీసీ ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. బీజేపీ నేతలు తమ పార్టీ నేతలపైన నిరాధార ఆరోపణలు చేస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. కాగా, పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి.. తెలంగాణకు ఏం చేసిందో చెప్పుకొనే దమ్ముందా అంటూ సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. 'తెలంగాణకు బీజేపీ చేసిన అన్యాయాలను ప్రజల ముందుంచి.. లెంపలేసుకునే ఆ పార్టీ నేతలు యాత్రలు చేయాలి. బీజేపీ, బీఆర్ఎస్ ఇప్పుడు కొత్తగా పొత్తు పెట్టుకోవడమేంటి? ఎప్పట్నుంచో ఆ రెండు పార్టీలకు పొత్తుంది. ఆ రెండు తోడు దొంగ పార్టీలన్న సంగతి ప్రజలకూ తెలుసు' అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

ఆడపిల్లల ఆత్మహత్యలను అరికట్టండి

» సర్కార్ సమీక్ష చేయాలి: ఎమ్మెల్సీ కవిత

మోతె, ఫిబ్రవరి 20: "గురుకుల విద్యార్థినులు ఆత్మహత్యలకు పాల్పడటం బాధాకరం. రాష్ట్రంలో ఆడపిల్లల వరుస ఆత్మహత్యలను అరికట్టాలని ప్రభుత్వాన్ని చేతులు జోడించి వేడుకుంటున్నా" అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న సూర్యాపేట జిల్లా ఇమాంపేట గురుకుల విద్యార్థిని అస్మిత కుటుంబసభ్యులను మంగళవారం ఆమె పరామర్శించారు. మోతె మండలంలోని బుర్కచర్ల గ్రామానికి వెళ్లి అస్మిత తల్లితో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నలుగురు విద్యార్థినుల ఆత్మహత్యలపై పకడ్బందీగా దర్యాప్తు చేపట్టాలని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అస్మిత కుటుంబ సభ్యులకు రూ.50 వేల ఆర్థికసాయం అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ వారి కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని కవిత చెప్పారు.

పాడి రైతుల బకాయిలు విడుదల చేయాలి

» సర్కారుకు విజయ పాల ఉత్పత్తిదారుల సంఘం విజ్ఞప్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విజయ డెయిరీకి పాలుపోస్తున్న రైతులకు పాల బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఆ డెయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఇప్పటికే 50 రోజుల బిల్లులు పేరుకుపోయాయని, రైతులు ఇబ్బంది పడుతున్నారని మంగళవారం సంఘం అధ్యక్షుడు జనగామ సోమిరెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఫెడరేషన్ నుంచి.. నెయ్యి కోసం రూ.6 కోట్లు, మెగా డెయిరీ కోసం రూ.18 కోట్లు తీసుకున్నదని, కానీ పాల ఉత్పత్తిదారులకు మాత్రం బిల్లులు చెల్లించలేదని తెలిపారు. నాలుగేళ్ల నుంచి ప్రోత్సాహకాలు చెల్లించలేదని.. ఇన్సెంటివ్ బకాయిలను విడుదల చేయాలని ఆయన కోరారు.

ఉపాధ్యాయుడి దాష్టీకంపై తిరగబడ్డ విద్యార్థులు

» చితకబాదడంపై ఆగ్రహం.. రోడ్డుపై బైఠాయింపు

తిరుమలాయపాలెం, ఫిబ్రవరి 20: ఓర్పుతో విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయుడు... మార్కులు తక్కువ వచ్చాయని అసహనంతో విద్యార్థులను విచక్షణరహితంగా చితకబాదిన ఘటన మంగళవారం ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలంలో సుబ్లేడులో జరిగింది. దెబ్బలకు తాళలేక విద్యార్థులు తిరగబడటంతో సదరు ఉపాధ్యాయుడు గదిలోకి వెళ్లి తలుపు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తరువాత టీచర్‌ను శిక్షించాలని విద్యార్థులు ఆందోళనకు దిగారు. సుబ్లేడు క్రాస్‌రోడ్డు వద్ద ఉన్న తెలంగాణ గురుకుల పాఠశాలలో 64మంది విద్యార్థులు పదో తరగతి చదువుతున్నారు. ఇదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న లక్ష్మణరావు... పరీక్షలో మార్కులు తక్కువ వచ్చాయని మంగళవారం 15 మంది విద్యార్థులను విచక్షణారహితంగా కొట్టాడు. పిల్లలు ఇదేంటని ప్రశ్నిస్తే... "నాకే ఎదురు చెబుతారా?" అంటూ మరింత రెచ్చిపోయాడు. దీంతో దెబ్బలకు తాళలేక విద్యార్థులు ఉపాధ్యాయుడిపై దాడికి యత్నించటంతో... వెంటనే ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకున్నాడు. అనంతరం లక్ష్మణరావుపై చర్యలు తీసుకోవాలని ఖమ్మం-వరంగల్ రహదారిపై విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న తిరుమలాయపాలెం ఎస్ఐ గిరిధర్‌రెడ్డి అక్కడికి చేరుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడారు.విద్యార్థులకు సర్దిచెప్పటంతో వారు ఆందోళనను విరమించారు. తరువాత సదరు ఉపాధ్యాయుడిని పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

వైద్య శాఖలో లంచాల లొల్లి

» డైరెక్టరేట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్‌కు రూ.70 వేలిచ్చా

» వెల్దుర్తి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఆడియో హల్‌చల్

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 20: మెదక్ జిల్లా వెల్దుర్తి పీహెచ్‌సీ సూపర్‌వైజర్ ఇందిర మరో అధికారితో జరిపిన ఫోన్ సంభాషణ సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తోంది. డిప్యూటేషన్ కోసం ఆమె నుంచి పెద్దఎత్తున వసూలు చేసినట్లు బయటపడింది. ఇందిర గత జూన్‌లో 317 జీవో కింద కరీంనగర్ జిల్లా నుంచి వెల్దుర్తి వచ్చారు. అనారోగ్య, వ్యక్తిగత కారణాలతో హైదరాబాద్‌కు డిప్యూటేషన్ వేయించుకున్నారు. ఆ సందర్భంగానే డబ్బులు చెల్లించినట్లు తెలుస్తోంది. ఆడియో రికార్డింగ్‌లోని ఆమె మాటల ప్రకారం "డిప్యూటేషన్ రిలీవ్ కోసం మెదక్ డీఎంహెచ్‌వో చందునాయక్‌కు రూ.30వేలిచ్చా. వాటిని అటెండర్ పాషా ద్వారా తీసుకున్నారు. రూ.500 లేదా రూ.వెయ్యి తీసుకుని ఇచ్చే రిలీవ్ లెటర్లకు కూడా రూ.30 వేలు వసూలు చేస్తున్నారు" అని ఉంది. కాగా, కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక డిప్యూటేషన్లను రద్దు చేశారు. ఇందిరను మళ్లీ వెల్దుర్తికి కేటాయించారు. అయితే, హైదరాబాద్‌లో డిప్యూటేషన్ కొనసాగించడం కోసం డీహెచ్ (డైరెక్టరేట్ ఆఫ్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్) కాళ్లమీద పడి రూ.70వేలు ఇచ్చానని ఆడియోలో ఉంది. మెదక్ డీఎంహెచ్‌వోతోపాటు సీనియర్ అసిస్టెంట్ అన్వర్ పేర్లను ప్రస్తావించారు. కాగా, ఆడియో వైరల్ కావడంతో ఈ నెల 12న ఇందిరను సస్పెండ్ చేశారు. ఈమె జూన్‌లో హైదరాబాద్‌కు డిప్యూటేషన్ కోసం అప్పటి రాష్ట్రస్థాయి అధికారికి దళారీ ద్వారా రూ.2లక్షలు ఇచ్చారని సమాచారం. ఈ అంశం వైద్య ఆరోగ్య శాఖలో చర్చనీయాంశమవుతోంది. దీంతో ఈ నెల 12న ఇందిరను సస్పెండ్ చేశారు. మరుసటి రోజు పీహెచ్‌సీ డాక్టర్ సౌజన్య తనను గదిలో బంధించారని.. 'ఏదో జరిగింది. క్షమాపణ చెప్పి కాళ్ల మీద పడితే నీ ఉద్యోగం పోదు'అని చెబుతూ వీడియో తీశారని ఇందిర వివరించారు. కాగా,ఇందిర చేసిన ఆరోపణల్లో నిజం లేదని చందునాయక్ తెలిపారు.

లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 8-10 సీట్లు

» బీఆర్ఎస్‌కు 3-5, బీజేపీకి 2-4 స్థానాలు

» సౌత్ ఫస్ట్, పీపుల్స్ పల్స్ సర్వే వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అత్యధిక ఎంపీ స్థానాలు గెలుచుకుంటుందని సౌత్ ఫస్ట్, పీపుల్స్ పల్స్ సంస్థలు పేర్కొన్నాయి. తెలంగాణలోని రాజకీయ పరిస్థితిపై సంయుక్తంగా నిర్వహించిన సర్వే ఫలితాలను ఈ సంస్థలు మంగళవారం వెల్లడించాయి. రాష్ట్రంలో మొత్తం 17 స్థానాలకు గాను కాంగ్రెస్ 8-10, బీఆర్ఎస్ 3-5, బీజేపీ 2-4, ఇతరులు ఒకటి గెలుచుకుంటాయని పేర్కొన్నాయి. ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 39.4 శాతం ఓట్లను సాధించగా.. సాధారణ ఎన్నికల్లో 40శాతం ఓట్లు పొందే అవకాశం ఉందన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 42 శాతం, పట్టణాల్లో 37 శాతం ప్రజలు ఆ పార్టీకి మద్దతుగా నిలుస్తున్నారని సర్వే వివరించింది. కాగా, అయోధ్య రామ మందిర ప్రారంభం, మోదీపైనే బీజేపీ ఆశలు పెట్టుకుందని.. కానీ, తెలంగాణలో అయోధ్య ప్రభావం ఆ పార్టీ ఊహిస్తున్నట్లు లేదని విశ్లేషించింది.

నేడు కొడంగల్‌లో సీఎం రేవంత్ పర్యటన

» రూ. 4,369 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

» కొడంగల్ ఎత్తిపోతలు, మెడికల్, ఇంజనీరింగ్, డిగ్రీ కాలేజీలకు శ్రీకారం

మహబూబ్‌నగర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బుధవారం తన సొంత నియోజకవర్గమైన కొడంగల్‌లో పర్యటించనున్నారు. సీఎం అయిన తర్వాత నియోజకవర్గానికి తొలిసారి వస్తుండటంతో అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నెలలో సీఎం బిజీ షెడ్యూల్ కారణంగా రెండు సార్లు పర్యటన వాయిదాపడగా ఎట్టకేలకు బుధవారం ఖరారైంది. ఈ పర్యటనలో నారాయణపేట, కొడంగల్, మక్తల్ నియోజకవర్గాలకు సాగు, తాగునీరు అందించే నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ. 2945 కోట్లు. ఇవికాకుండా ప్రభుత్వ ఇంజనీరింగ్ కాలేజీ, 50 సీట్లతో కొడంగల్ మెడికల్ కాలేజీ, కోస్గిలో మహిళా డిగ్రీ కాలేజీ, సింగిల్ లేన్ రోడ్ల నుంచి డబుల్ లేన్‌గా మార్చే పనులు, ఆర్‌అండ్‌బీ అతిథి గృహం, గురుకుల పాఠశాలలు, హాస్టళ్ల భవనాలు, కొత్త జూనియర్ కాలేజీల భవనాలు తదితర రూ. 1424 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. సాయంత్రం 4 గంటలకు కోస్గి పట్టణానికి హెలికాప్టర్ ద్వారా చేరుకోనున్న సీఎం అక్కడ జూనియర్ కళాశాల మైదానంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. అనంతరం డీఆర్‌డీఏ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలించి మహిళా సమాఖ్య భవనం వెనకాల ఉన్న మైదానంలో బహిరంగ సభలో పాల్గొని తిరుగు ప్రయాణంలో రోడ్డు మార్గం ద్వారా వెళ్లనున్నారు. సభ ఏర్పాట్లను కలెక్టర్ శ్రీహర్ష, ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించారు. తొలిసారి సీఎం నియోజకవర్గానికి వస్తుండటంతో గ్రామాలకు, మునిసిపాలిటీలకు ప్రత్యేక నిధులు కేటాయించాలనే ప్రతిపాదనలు ఉన్నాయి.

చిరకాల స్వప్నం నారాయణపేట - కొడంగల్

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ పై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టిన సీఎం రేవంత్... ఇప్పటికే కొడంగల్ ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీని ఏర్పాటు చేశారు. తన చిరకాల స్వప్నమైన పేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఇప్పటికే పరిపాలనా అనుమతులు లభించాయి. వాస్తవానికి ఈ ఎత్తిపోతల పథకానికి 2014లో జీఓ 69ని అప్పటి రాష్ట్ర గవర్నర్ నరసింహన్ జారీ చేయగా తర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదు. కాగా, సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేసిన రెండు నెలల్లోపే పాత జీవోను రద్దు చేసి జీవో 14ను జారీ చేశారు. భీమాకు కేటాయించిన 20 టీఎంసీల్లో ఒకటి, రెండు దశలకు కేటాయించిన 12.90 టీఎంసీలు పోను 7.10 టీఎంసీల నీటిని ఈ పథకానికి వినియోగించుకోనున్నారు.

ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగానికి కేంద్రం పచ్చజెండా



కేంద్రమంత్రి గడ్కరీతో సమావేశమైన సీఎం రేవంత్, చిత్రంలో మంత్రి కోమటిరెడ్డి

ఈ రోడ్లను అప్‌గ్రేడ్ చేయాలని వినతి

1. మరికల్-నారాయణపేట్-రామసముద్ర(63 కి.మీ)
2. పెద్దపల్లి-కాటారం(66 కి.మీ)
3. పుల్లూర్- అలంపూర్- జటప్రోలు-పెంట్లవెల్లి- కొల్లాపూర్- లింగాల్-అచ్చంపేట- డిండి- దేవరకొండ-మల్లేపల్లి-నల్లగొండ(225 కి.మీ)
4. వనపర్తి-కొత్తకోట-గద్వాల-మంత్రాలయం(110 కి.మీ)
5. మన్నెగూడ-వికారాబాద్-తాండూర్-జహీరాబాద్-బీదర్(134 కి.మీ)
6. కరీంనగర్-సిరిసిల్ల-కామారెడ్డి-ఎల్లారెడ్డి-పిట్లం(165 కి.మీ)
7. ఎర్రవెల్లి క్రాస్ రోడ్-గద్వాల-రాయచూర్(67 కి.మీ)
8. జగిత్యాల-పెద్దపల్లి-కాల్వ శ్రీరాంపూర్-కిష్టంపేట-కల్వపల్లి-మోరంచపల్లి-రామప్ప దేవాలయం-జంగాలపల్లి(164 కి.మీ)
9. సారపాక-ఏటూరునాగారం(93 కి.మీ)
10. దుద్దెడ-కొమురవెల్లి-యాదగిరిగుట్ట-రాయగిరి క్రాస్‌రోడ్(63 కి.మీ)
11. జగ్గయ్యపేట-వైరా-కొత్తగూడెం(100 కి.మీ)
12. సిరిసిల్ల-వేములవాడ-కోరుట్ల(65 కి.మీ)
13. భూత్పూర్-నాగర్‌కర్నూల్-మన్ననూర్- మద్దిమడుగు-గంగలకుంట- సిరిగిరిపాడు(166 కి.మీ)
14. కరీంనగర్-రాయపట్నం(60 కి.మీ)

(మొదటిపేజీ తరువాయి)

కలుసుకున్నారు. సీఎం వెంట ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర రహదారుల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి శ్రీనివాసరాజు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి ఆర్‌ఆర్‌ఆర్ అంశాన్ని గడ్కరీ దృష్టికి తీసుకువచ్చారు. రాష్ట్రంలోని పలు జాతీయ రహదారుల విస్తరణకు అనుమతులతోపాటు.. పలు కీలకమైన రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు రాష్ట్ర రహదారుల జాబితాను గడ్కరీకి అందజేశారు. వాటిని జాతీయ రహదారులుగా ప్రకటించాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం (చౌటుప్పల్-భువనగిరి-తూప్రాన్-సంగారెడ్డి-కంది) పరిధిలో కరెంటు స్తంభాలు, భవనాలు తదితర వనరుల తరలింపునకు సంబంధించిన యుటిలిటీస్ తొలగింపు వ్యయానికి సంబంధించి కేంద్ర-రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనపై చర్చ జరిగింది. 10 నెలల క్రితం యుటిలిటీస్ తరలింపు భారాన్ని(రూ.200 కోట్లు) రాష్ట్ర ప్రభుత్వమే భరించాలంటూ ఎన్‌హెచ్ఏఐ అధికారులు స్పష్టం చేశారు. దానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పుకోకపోవడంతో ఈ విషయంలో ప్రతిష్టంభన నెలకొందని సీఎం రేవంత్ వివరించారు. తమ సర్కారు ఏర్పాటయ్యాక ఆ వ్యయాన్ని భరిస్తామంటూ ఎన్‌హెచ్ఏఐకి లేఖ పంపినట్లు గుర్తుచేశారు. దీనిపై గడ్కరీ ఎన్‌హెచ్ఏఐ అధికారులను ఆరా తీశారు. "యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని మెలిక పెట్టిందెవరు?" అంటూ తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ వ్యయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తే.. భవిష్యత్‌లో టోల్ ఆదాయాల్లో సంబంధిత రాష్ట్రాలకు సగం చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆర్ఆర్ఆర్ యుటిలిటీస్ తరలింపు వ్యయాన్ని కేంద్రమే భరిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. ఆర్ఆర్ఆర్ భూసేకరణ, విధానపరమైన ప్రక్రియలను వేగవంతంగా పూర్తిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి సూచించారు. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిని ఆరువరుసలకు పెంచడం, హైదరాబాద్-కల్వకుర్తి రోడ్డును నాలుగు వరుసల రహదారిగా విస్తరించడం, కీలక రాష్ట్ర రహదారులను జాతీయ రహదారులుగా గుర్తించడంపై రేవంత్ చేసిన విజ్ఞప్తులకు గడ్కరీ సానుకూలంగా స్పందించారు. కన్‌స్ట్రక్షన్ ఆఫ్ రూరల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్(సీఆర్ఐఎఫ్) నిధుల మంజూరుకు అవసరమైన ప్రతిపాదనలను పంపాలని రేవంత్‌కు సూచించారు.

గెలుపు గుర్రాలపై రేవంత్‌కు స్వేచ్ఛ

» లోక్‌సభ అభ్యర్థులను గుర్తించి ప్రతిపాదించండి

» సీఎం రేవంత్‌రెడ్డికి అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్

» సీట్ల వారీగా కసరత్తును వివరించిన రేవంత్

» ఎన్నికల తర్వాతనే రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికలకు గాను అభ్యర్థుల జాబితాను త్వరలో ఖరారు చేసి కేంద్ర ఎన్నికల కమిటీకి సమర్పించాలని కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డికి సూచించింది. గెలుపు గుర్రాలను గుర్తించి, వారిని ప్రతిపాదించే విషయంలో రేవంత్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలిసింది. రేవంత్, ఉప ముఖ్యమంత్రి భట్టిలు పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో మంగళవారం సాయంత్రం సుదీర్ఘంగా చర్చలు జరిపారు. తెలంగాణలోని ఏయే నియోజకవర్గాల్లో ఎవరెవరు గెలిచేందుకు అవకాశాలున్నాయో వివరించారు. ఈ మేరకు తాను చేసిన కసరత్తును వేణుగోపాల్‌కు రేవంత్‌రెడ్డి వివరించినట్లు సమాచారం. సీఎం ప్రతిపాదనలపై భట్టి కూడా పూర్తి ఏకాభిప్రాయం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. కాగా, బీఆర్ఎస్ ప్రజల్లో బలం కోల్పోతున్నదని.. ఆ పార్టీ నుంచి అనేక మంది కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని, వారి విషయంలో ఏం చేయాలో దిశానిర్దేశం చేయాలని రేవంత్, భట్టి అధిష్ఠానాన్ని కోరినట్లు సమాచారం. "మనం గేట్లు తెరిస్తే బీఆర్ఎస్ దాదాపు ఖాళీ అవుతుంది. లోక్‌సభ ఎన్నికల్లో ఆ పార్టీకి ఒక్క సీటు కూడా వచ్చే అవకాశాలు లేవు. అందుకే బీజేపీతో కాళ్ల బేరానికి ప్రయత్నిస్తున్నారు" అని నివేదించినట్లు విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. మరోవైపు మంత్రివర్గ విస్తరణను లోక్‌సభ ఎన్నికల తర్వాతే చేపట్టడం మంచిదని రాష్ట్ర నాయకులతో పాటు ఢిల్లీ పెద్దలు కూడా భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఇప్పుడే చేస్తే అసంతృప్త నేతలు బయలుదేరతారని, ఇది లోక్‌సభ ఎన్నికల సమయంలో పార్టీకి సమస్యగా మారుతుందని పేర్కొన్నట్లు సమాచారం. కొన్ని నామినేటెడ్ పోస్టులపై కూడా వేణుగోపాల్‌తో రేవంత్, భట్టి చర్చించినట్లు చెబుతున్నారు. కాగా, బీఆర్ఎస్ పట్ల ప్రజల్లో రోజురోజుకూ విలువ తగ్గిపోతోందని, కేసీఆర్ సర్కార్ పాల్పడిన అవినీతిని అసెంబ్లీలో బట్టబయలు చేశామని భట్టి వివరించారు. ప్రధాన ప్రతిపక్ష నేత అయి ఉండి కేసీఆర్ అసెంబ్లీకి కూడా రాకపోవడం కాంగ్రెస్ నైతిక విజయమని, అవినీతి ఆరోపణలను ఎదుర్కోగల శక్తి ఆయనకు లేదని భట్టి చెప్పినట్లు సమాచారం.

మిర్చి రైతులకు ఇబ్బందులు కలగొద్దు

» ధరల విషయంలో నష్టపోకుండా చూడండి

» అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

» ఏపీ ఏలూరు జిల్లాలో రాట్నాలమ్మకు మొక్కులు

» ఆయిల్‌పామ్ రైతులతో మాటామంతి..



ఆంధ్రప్రదేశ్‌లోని రాట్నాలమ్మ అమ్మవారి గుడిలో తన అభిమానులతో మంత్రి తుమ్మల

హైదరాబాద్/సత్తుపల్లి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్లకు మిర్చి పోటెత్తుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మార్కెటింగ్‌శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయ, మార్కెటింగ్‌శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. ధరలో ఏ మాత్రం తేడా రాకుండా చూడాలని, ట్రేడర్ల వైఖరితో రైతులు నష్టపోకుండా చూడాలని సూచించారు. మిర్చి అమ్మకాలు ఎక్కువ జరిగే మార్కెట్లకు రాష్ట్రస్థాయి, జోనల్‌స్థాయి అధికారులను పర్యవేక్షకులుగా నియమించినట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుంటూ పర్యవేక్షణ చేయాలని సూచించారు. రాష్ట్రంలో 3.91 లక్షల ఎకరాల్లో రైతులు మిర్చి సాగుచేశారని ఇప్పటివరకు సుమారు 95 వేల మెట్రిక్ టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చినట్లు తుమ్మల తెలిపారు. రానున్న రోజుల్లో సుమారు మూడున్నర లక్షల టన్నుల మిర్చి మార్కెట్‌కు వచ్చే అవకాశాలున్నాయన్నారు. జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారులు, మార్కెట్ కమిటీ కార్యదర్శులు ఎలాంటి అక్రమాలకు తావివ్వకుండా మిర్చి అమ్మకాలు సజావుగా సాగేలా చూడాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే అధికారులపై చర్యలకు వెనకాడబోమని హెచ్చరించారు. వేరుశనగ దిగుబడి కూడా 1.92 లక్షల టన్నులు వచ్చే అవకాశముందని, ఇప్పటికే 93 వేల టన్నులు మార్కెట్‌కు వచ్చిందని, రైతుల సొంత అవసరాలు పోగా ఇంకా 46 వేల టన్నులు మార్కెట్‌కు వచ్చే అవకాశముందని, అధికారులు తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాగా, ఆయిల్‌పామ్ సాగు చేస్తున్న రైతుల ఇబ్బందులు తనకు తెలుసని, ఆయిల్‌పామ్‌కు కనీస మద్దతు ధర ప్రకటించేలా తనవంతు ప్రయత్నం చేస్తానని తుమ్మల పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా సత్తుపల్లి సరిహద్దు ఏపీలోని ఏలూరు జిల్లా విజయరాయి సమీపంలోని రాట్నాలమ్మ అమ్మవారి గుడిలో ఆయన మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఏపీ ప్రాంత రైతులు, అభిమానులతో మాట్లాడారు. తెలంగాణలో తమ ప్రభుత్వం కూడా ఆయిల్‌పామ్ సాగుకు రైతులను ప్రోత్సహిస్తోందని చెప్పారు. తనకు ఎన్ని పదవులున్నా వ్యవసాయంతో మాత్రమే సంతృప్తి ఉంటుందన్నారు. తుమ్మలను కలిసిన వారిలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, ఏపీ ఆయిల్‌పామ్ రైతులు, టీడీపీ నేతలున్నారు.

2 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలు

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొట్టమొదటగా 2 వ్యవసాయ మార్కెట్ కమిటీలకు కొత్త పాలకవర్గాలను ఏర్పాటు చేసినట్లు తుమ్మల తెలిపారు. సదాశివపేట మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సడకుల కుమార్, బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బొడ్డు గంగయ్యలను నియమిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్‌రావు ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు. చైర్మన్‌తోపాటు కార్యవర్గాన్ని కూడా నియమించినట్లు, వీరి పదవీకాలం రెండేళ్లు ఉంటుందని మంత్రి వివరించారు.



రిటర్నింగ్ అధికారి నుండి ధ్రువీకరణ పత్రం అందుకుంటున్న అనిల్ కుమార్ యాదవ్

రాజ్యసభకు ఏకగ్రీవం

» రేణుకాచౌదరి, అనిల్ కుమార్ యాదవ్, వద్దిరాజు ఎన్నిక

» ధ్రువీకరణ పత్రాలు అందుకున్న అనిల్, రవిచంద్ర.. నేడు తీసుకోనున్న రేణుక చౌదరి

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్న మూడు రాజ్యసభ సీట్లకు కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాజ్యసభ ఎన్నికల నామినేషన్ల ఉపసంహరణ గడువు మంగళవారం సాయంత్రం 3 గంటలకు ముగిసింది. మూడు సీట్లకు ముగ్గురు మాత్రమే పోటీలో ఉండటంతో వారు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రిటర్నింగ్ అధికారి ఉపేందర్‌రెడ్డి ప్రకటించారు. ఈ మూడు రాజ్యసభ సీట్లకు కాంగ్రెస్ పార్టీ నుంచి రేణుకా చౌదరి, అనిల్ కుమార్ యాదవ్, బీఆర్ఎస్ నుంచి వద్దిరాజు రవిచంద్ర నామినేషన్లు దాఖలు చేసిన సంగతి తెలిసిందే. వారితో పాటు శ్రమజీవి పార్టీ తరఫున రెండు నామినేషన్లు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు నామినేషన్ వేశారు. అయితే వారిని ప్రతిపాదించే ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో ఆ మూడు నామినేషన్లూ తిరస్కరణకు గురయ్యాయి. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణకూ గడువు ముగియడంతో.. మూడు సీట్లకు రేణుకాచౌదరి, అనిల్ కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్రల నామినేషన్లు మాత్రమే మిగిలాయి. పోటీదారులు ఎవరూ లేకపోవడంతో వారి ఎన్నిక ఏకగ్రీవం అయిపోయింది. అనిల్ కుమార్ యాదవ్, వద్దిరాజు రవిచంద్ర మంగళవారం సాయంత్రమే రిటర్నింగ్ అధికారి నుంచి గెలుపు ధృవీకరణ పత్రాలను తీసుకున్నారు. రేణుకా చౌదరి బుధవారం తీసుకోనున్నారు.

గాంధీభవన్‌కు ర్యాలీగా అనిల్

రిటర్నింగ్ అధికారి నుంచి గెలుపు ధృవీకరణ పత్రాన్ని అందుకున్న అనిల్ కుమార్ యాదవ్.. అసెంబ్లీ నుంచి గాంధీభవన్‌కు భారీ ర్యాలీతో వెళ్లారు. ఈ ర్యాలీలో టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు అంజన్‌కుమార్ యాదవ్, పార్టీ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య తదితరులు పాల్గొన్నారు. అనంతరం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ ఇది తన జీవితంలో మర్చిపోలేని రోజని అన్నారు. తనకు ఈ అవకాశాన్ని ఇచ్చిన పార్టీ జాతీయ, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రం నుంచి ఒక బీసీ బిడ్డను పెద్దల సభకు పంపుతున్నారంటే.. ఇది రాష్ట్రంలోని బీసీలందరికీ గర్వకారణమని, ఇది తన విజయం కాదని, కాంగ్రెస్ పార్టీ విజయమన్నారు. బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. పార్టీ అధిష్ఠానం తమ సామాజిక వర్గానికి గొప్ప అవకాశం కల్పించిందన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలిచిన గొల్ల కురుమలు.. రానున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ పెద్ద ఎత్తున మద్దతివ్వాలని విజ్ఞప్తి చేశారు.

ఏకగ్రీవంగా రాజ్యసభకు వైసీపీ అభ్యర్థులు

అమరావతి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులు వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా రఘునాథరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు మంగళవారంరిటర్నింగ్ అధికారి విజయరాజు వారికి ధృవీకరణ పత్రాలు అందించారు. ధృవీకరణ పత్రాలు స్వీకరించాక వారు ముగ్గురూ తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రాజ్యసభకు ఎన్నికైనందుకు వారిని సీఎం అభినందించారు. దీంతో రాష్ట్రం నుంచి 11మంది రాజ్యసభ సభ్యులూ వైసీపీకి చెందినవారే అయ్యారు.

విద్యుత్ కోతలపై సర్కారు సీరియస్

నల్లగొండ ఎస్ఈ, మిర్యాలగూడ డీఈలకు మెమో

డిప్యూటీ సీఎం భట్టి ఆదేశాలతో విచారణ కమిటీ

నల్లగొండ/నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 20: వ్యవసాయ రంగానికి కరెంటు కోతలు విధించడం పట్ల సర్కారు సీరియస్ అయింది. విద్యుత్ సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరించారన్న ఆరోపణల నేపథ్యంలో నల్లగొండ ఎస్ఈ చంద్రమోహన్, మిర్యాలగూడ డీఈ వెంకటేశ్వర్లుకు విద్యుత్ శాఖ సోమవారం రాత్రి చార్జ్ మెమో ఇచ్చింది. మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని త్రిపురారం మండలంలో కరెంటు కోతలు ఎక్కువగా ఉన్నాయని ఆ ప్రాంత రైతులు ఈ నెల 15న రాత్రి సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. ఈ ఘటన అనంతరం ముకుందాపురం ఫీడర్ పరిధిలోని నిడమనూరు, త్రిపురారం మండలాల్లో కరెంటు కోతలపై రైతులు పలుమార్లు నిరసనలు చేశారు. ఈ ఆందోళనలను సీరియస్‌గా తీసుకున్న డిప్యూటీ సీఎం, విద్యుత్‌శాఖ మంత్రి భట్టి విక్రమార్క విచారణకు ఆదేశించారు. దీంతో ఉన్నతాధికారులు.. టీఎస్ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ నర్సింహులు, సీజీఎం భిక్షపతిని విచారణ అధికారులుగా నియమించారు. వారు ఈ నెల 16న క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఫీడర్‌లో కనెక్షన్లు, అక్రమ విద్యుత్ వినియోగంపై మిర్యాలగూడ విద్యుత్ డీఈ వెంకటేశ్వర్లు ముందస్తు జాగ్రత్తలు, చర్యలు తీసుకోలేదని గుర్తించారు. అందుకు అనుగుణంగా నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేశారు. జిల్లా స్థాయిలో ఉన్నతాధికారి అయిన ఎస్ఈ చంద్రమోహన్ సరిగా పర్యవేక్షించలేదని నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. ముకుందాపురం ఫీడర్ పరిధిలో త్రిపురారం, నిడమనూరు మండలాలకు చెందిన గ్రామాలు ఉన్నాయి. ఈ రెండు మండలాల ఏఈల మధ్య సమన్వయం లేకపోవడం, ఇష్టానుసారంగా ఎల్‌సీలు తీసుకోవడం, కాంట్రాక్టర్లు విద్యుత్ సబ్‌స్టేషన్ సంబంధిత పనులను గంటలు, రోజుల తరబడి నిర్వహించడంతో వ్యవసాయానికి కరెంటు కోతలు అధికమయ్యాయని విచారణలో తేలింది. ఏఈల మధ్య సమన్వయం లేదని తెలిసినా డీఈ వారిని సమన్వయపరచకపోగా.. నిర్లక్ష్యం చేసినట్లు గుర్తించారు. డీఈతో పాటు ఇద్దరు ఏఈలు, ఎస్ఈపై రిపోర్టు చేశారు. దీనిపై టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారూఖీ సీరియస్ అయ్యారు. డీఈ వెంకటేశ్వర్లు, ఎస్ఈ చంద్రమోహన్‌కు సోమవారం రాత్రి చార్జ్ మెమోలు ఇచ్చారు. ఇద్దరు అధికారులు ఇచ్చే సమాధానాలను పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలు తీసుకుంటామని సీఎండీ తెలిపారు. దీంతో ఏఈలపైనా చర్యలు ఉండే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. దీనిపై ఎస్ఈ చంద్రమోహన్‌ను వివరణ కోరగా.. డీఈ, ఏఈల పర్యవేక్షణపై.. విద్యుత్ కోతలపై రైతులు నిరసనలపై సమాధానం ఇవ్వాలని చార్జ్ మెమో ఇచ్చారని పేర్కొన్నారు.

కేఆర్ఎంబీ పిటిషన్‌పై విచారణ ఏప్రిల్‌కు వాయిదా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల్లోని కృష్ణానదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ కేంద్రాలను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావాలని ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్ పై సుప్రీం కోర్టులో మంగళవారం విచారణ జరిగింది. తెలంగాణ ప్రభుత్వం ఎటువంటి అనుమతి లేకుండా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల నుంచి విద్యుత్ ఉత్పత్తి చేస్తుందని ఆరోపిస్తూ ఏపీ ప్రభుత్వం 2021లో సుప్రీం కోర్టును ఆశ్రయించింది. ఏపీ ప్రభుత్వ పిటిషన్‌పై కేఆర్ఎంబీ, తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ జెన్‌కో సీఎండీలకు ఉన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. దీనిపై మంగళవారం జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంపై సుదీర్ఘ వాదనలు వినిపించాల్సి ఉందని, అందువల్ల మరికొంత సమయం కావాలని తెలంగాణ తరఫున న్యాయవాది వైద్యనాథన్ కోరారు. దీనికి ఏపీ తరఫున న్యాయవాది ఉమాపతి అభ్యంతరం వ్యక్తం చేస్తూ, తామిప్పుడే వాదనలు వినిపించేందుకు సిద్ధమన్నారు.ఇరువురి వాదనలు విన్న సుప్రీంకోర్టు విచారణను ఏప్రిల్ 30కు వాయిదా వేసింది.

రెండు చెరువుల నిర్మాణానికి కేంద్రం ఊతం

» ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన కింద ఎంపిక

హైదరాబాద్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన(పీఎంకేఎస్‌వై) కింద సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలంలో రెండు చెరువుల నిర్మాణం కోసం సహాయం చేయాలని కేంద్రం నిర్ణయించింది. పీఎంకేఎస్‌వైలోని ప్రతి పంటకు నీరు(హర్ ఖేత్ కో పానీ) కింద ఈ చెరువుల నిర్మాణం జరగనుంది. యేస్గి, వడేగావ్‌తాండలలో స్థానిక నదుల ప్రవాహాలపై చెరువులను నిర్మించనున్నారు. ఈ మేరకు కేంద్ర జల వనరుల సంఘం(సీడబ్ల్యూసీ)లోని కృష్ణా గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్(కేజీబీవో) స్టేట్ టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) ఆమోదం తెలిపింది. ఈ విషయమై తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్)కి మంగళవారం కేంద్రం లేఖ రాసింది.

ప్రాణం ఉండగానే శవమని తేల్చారు

» మెదక్ జిల్లా కొంపెల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాకం

తూప్రాన్, ఫిబ్రవరి 20: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ యువకుడు ప్రాణాలతో ఉండగానే ఓ ప్రైవేటు ఆస్పత్రి యాజమాన్యం మరణించినట్టు ప్రకటించింది. పంచనామాకు వచ్చిన పోలీసులు ఆ యువకుడు ప్రాణాలతో ఉన్నట్టు గుర్తించడంతో వారి నిర్వాకం బయటపడింది. అనంతరం ఆ యువకుడిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి ప్రాణం వదిలాడు. మెదక్ జిల్లా తూప్రాన్‌కు చెందిన అర్కల వంశీ(25) ఆదివారం రాత్రి కొంపెల్లి వద్ద ఓ విందుకు వెళ్లి బైక్‌పై ఇంటికి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన వంశీని స్థానికులు సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. సోమవారం ఉదయం వంశీని పరిశీలించిన వైద్యులు అతను మరణించడాని పోలీసులకు, బాధిత కుటుంబానికి సమాచారం ఇచ్చారు. అయితే, మృతదేహాన్ని పంచనామా చేసేందుకు వచ్చిన పోలీసులు వంశీ ప్రాణాలతో ఉన్నట్టు గుర్తించి, వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. కానీ వంశీ సోమవారం రాత్రి మృతి చెందాడు. పోస్టుమార్టం అనంతరం వంశీ మృతదేహాన్ని కుటుంబీకులకు మంగళవారం అప్పగించారు.

అంత్యక్రియలకు సిద్ధం చేశాక లేచి కూర్చుంది

» వెంటిలేటర్ తీసేసిన తర్వాత బతికిన మహిళ

అమలాపురం రూరల్, ఫిబ్రవరి 20: 'వెంటిలేటర్ తీసేస్తే పది నిమిషాలకు మించి బతకరు. బంధువులకు కబురు పెట్టుకోండి. వైద్యం చేయడానికి కూడా ఏమీ లేదు..' అని అమలాపురంలోని పెద్ద ప్రైవేటు ఆస్పత్రి వైద్యులు తేల్చేశారు. అంత్యక్రియలకు అన్నీ సిద్ధం చేశారు. తీరా వెంటిలేటర్‌ను తీసేసి ఆస్పత్రి నుంచి ఇంటికి తీసుకొచ్చిన తర్వాత ఆమె మళ్లీ లేచి కూర్చొంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం రూరల్ మండలం జనుపల్లి మన్నా కాలనీలో ఈ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. మన్నా కాలనీకి చెందిన లంకలపల్లి శ్రీరామమూర్తి, సత్యవేణి దంపతులు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న 59 ఏళ్ల సత్యవేణికి ఈ నెల 17న బీపీ పడిపోవడంతో ఆమెను అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించాడు. 18వ తేదీకి ఆమె పరిస్థితి విషమంగా మారింది. అప్పటికే ఆమె అవయవాలు ఏ ఒక్కటీ పనిచేయడం లేదని నిర్ధారించుకున్న వైద్యులు ఇక చేసేదేమీ లేదని... వెంటిలేటర్ తీసేస్తే చనిపోతుందని చెప్పేశారు. దీంతో బంధువులు మలేసియాలో ఉంటున్న కొడుకు వరుస బిడ్డ (సోదరి కుమారుడు)ను హుటాహుటిన రప్పించారు. అదే రోజున అంత్యక్రియలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసి సత్యవేణిని ఆస్పత్రి నుంచి అంబులెన్సులో ఇంటికి తీసుకువచ్చారు. కొద్దిసేపటికే ఆమె లేచి కూర్చుని మీరంతా ఎందుకొచ్చారని ప్రశ్నించడంతో అందరూ అవాక్కయ్యారు. ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు ఆమె అల్పాహారం తీసుకుంటూ గడిపింది. మంగళవారం ఉదయం మళ్లీ బీపీ డౌన్ కావడంతో ఆమెను మరో ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతానికి ఆమె ఐసీయూలో చికిత్స పొందుతోంది.

ఆ కర్కోటక తండ్రి 25 ఏళ్లు జైల్లోనే!

» కన్నకూతురిపై అత్యాచారం కేసులో నాంపల్లి కోర్టు తీర్పు

బోయినపల్లి, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కన్న కూతురుపైనే అత్యాచారానికి పాల్పడ్డ ఆ తండ్రికి ఆలస్యంగానైనా శిక్ష పడింది. తండ్రి అనే మాటకే కళంకం తెచ్చేలా వ్యవహరించిన ఆ దుర్మార్గుడికి కోర్టు 25 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. రెండేళ్ల క్రితం బోయినపల్లి హనుమాన్ దేవాలయం సమీపంలోని గుడిసెల్లో జరిగిన ఈ ఘటన అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. కేసు దర్యాప్తు చేసిన అప్పటి సీఐ కె.రవి కుమార్ వివరాల ప్రకారం.. నాగర్ కర్నూల్ జిల్లాలోని ఓ తండాకు చెందిన 30 ఏళ్ల వ్యక్తికి భార్య, కూతురు, కుమారుడు ఉన్నారు. అతడు చెత్తబండిని తరలించే వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తూ బోయినపల్లి హనుమాన్ దేవాలయం వద్ద ఉండే గుడిసెల్లో ఓ చోట కుటుంబంతో కలిసి ఉండేవాడు. భార్యతో గొడవలు రావడంతో దూరంగా ఉన్నాడు. తర్వాత అతడు.. మరో యువతిని పెళ్లి చేసుకున్నాడు. రెండో భార్యతో అతడికి ఓ కూతురు కలిగింది. కొన్నాళ్లకు అందరూ ఒకేచోట ఉన్నారు. అయితే మొదటి భార్యకు తన వల్ల కలిగిన బాలికపై అతడు కన్నేశాడు. ఆమెపై అత్యాచారం చేసేవాడు. 2022 మార్చి 17న రాత్రి బాలికపై అతడు అత్యాచారం చేస్తుండగా నిద్రలేచిన రెండో భార్య దారుణాన్ని చూసింది. ఈ ఘటనపై మరుసటి రోజు ఆమె బోయినపల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు. విచారణ జరిపిన నాంపల్లి 12వ మెట్రోపాలిటన్ న్యాయస్థానం న్యాయమూర్తి టి.అనిత... నిందితుడైన బాలిక తండ్రిని దోషిగా నిర్ధారించారు. అతడికి 25 ఏళ్ల శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారని అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎ.రామ్‌రెడ్డి వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

తొలగించిన నర్సులను విధుల్లోకి తీసుకోవాలి

» మంగళవారం ప్రజావాణిలో 1,588 అర్జీలు

బేగంపేట, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో ప్రాణాలను పణంగా పెట్టి విధులు నిర్వహించిన అవుట్ సోర్సింగ్ స్టాఫ్‌నర్సులను తొలగించడంతో వారు న్యాయం కోసం ప్రజాభవన్‌లో ప్రజావాణిని ఆశ్రయించారు. సిద్దిపేట జిల్లాలో కోవిడ్ సమయంలో 350 మంది స్టాఫ్ నర్సులను అప్పటి ప్రభుత్వం అవుట్ సోర్సింగ్ పద్ధతిలో తీసుకుంది. కొందరిని వేరే ఆస్పత్రులకు పంపగా.. చివరికి 100 మందిని తొలగించింది. దీంతో వారు మంగళవారం ప్రజావాణికి వివరించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని ఇందిరా క్రాంతిపథం-గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా ఉద్యోగుల సంఘం ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించింది. మంగళవారం ప్రజావాణికి 1,588 అర్జీలు వచ్చినట్లు నోడల్ అధికారి దివ్య దేవరాజన్ తెలిపారు.

మేడిగడ్డ, అన్నారం కాపాడుకునేదెట్ల?

బ్యారేజీలను పరిశీలించిన డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్.. చేపట్టాల్సిన చర్యలపై సమాలోచన



మేడిగడ్డలో 20వ పిల్లరు కుంగడానికి కారణాలపై ఆరా తీస్తున్న బృందం

హైదరాబాద్, మహదేవపూర్ రూరల్/మహదేవపూర్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): వానా కాలం భారీ వరదల నుంచి కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం బ్యారేజీలను ఏ విధంగా కాపాడుకోవాలనే అంశంపై ప్రభుత్వం కసరత్తు ముమ్మరం చేసింది. జూలై తర్వాత గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉండడంతో యుద్ధప్రాతిపదికన మరమ్మతులు/పునరుద్ధరణకు ఉపక్రమించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా మహదేవపూర్ మండలంలోని అన్నారం, మేడిగడ్డ బ్యారేజీలను మంగళవారం సాగు నీటి శాఖ ఈఎన్‌సీ (అడ్మిన్) జి.అనిల్‌కుమార్‌తో పాటు స్టేట్ డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎస్‌డీఎస్‌వో) చీఫ్ ఇంజనీర్ ప్రమీల, డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానల్ (డీఎస్ఆర్‌పీ) మెంబర్/డిజైన్ ఎక్స్‌పర్ట్ టి.రాజశేఖర్, భూసార పరీక్షల నిపుణుడు రాములు తదితరులు బ్యారేజీలను పరిశీలించారు. ఏయే మరమ్మతులు చేయాలనేదానిపై వీరు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు. దాని ఆధారంగానే చర్యలకు ఉపక్రమించనున్నారు. ప్రధానంగా బ్యారేజీల రక్షణయే కీలకం కానుంది. కాగా, అనిల్‌కుమార్‌తో కలిసి 20 మంది బృందం సభ్యులు ఉదయం 10 గంటలకు అన్నారం బ్యారేజీకి చేరుకున్నారు. తొలుత బ్యారేజీ వంతెనపై నుంచి పిల్లర్లను పరిశీలించి నేరుగా గోదావరి నదిలోకి వెళ్లి 39వ పియర్ వద్ద ఏర్పడిన సీపేజీ, లీకేజీపై ఆరా తీశారు. ఇందుకు గల కారణాలు, అధికారులు తీసుకున్న జాగ్రత్తలను అడిగి తెలుసుకున్నారు. గంటన్నరపాటు అక్కడ ఉన్న బృందం సభ్యులు మేడిగడ్డ బ్యారేజీకి చేరుకుని కుంగిన వంతెనను పరిశీలించారు. వంతెన కింద గోదావరిలోకి వెళ్లి బ్లాక్-7లో పగుళ్లు తేలిన 20వ పిల్లరుతో పాటు బ్లాక్-7లోని మిగతా పిల్లర్లను చూశారు. రెండు బ్యారేజీల్లో సీపేజీ, పిల్లర్లు దెబ్బతినడానికి కారణాలను రామగుండం సీఈ సుధాకర్, అన్నారం ఈఈ యాదగిరి, మేడిగడ్డ ఈఈ తిరుపతిరావును అడిగి తెలుసుకున్నారు. చేపట్టాల్సిన చర్యలపై బృందం సమాలోచన చేశారు. ప్రస్తుతం అన్నారం బ్యారేజీలోని పలు గేట్లు మూసి ఉండగా వాటిని ఎత్తే విషయమై స్థానిక ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు.

గతంలో ఇలా..

మేడిగడ్డ బ్యారేజీ అక్టోబరు 21వ తేదీన కుంగిపోయింది. మరుసటి రోజే అన్నారం, సుందిళ్లలో సీపేజీలు బయటపడ్డాయి. వీటి నివారణకు కెమికల్ గ్రౌటింగ్ చేశారు. కాగా, ఈ నెల 17న అన్నారంలో 49వ వెంట్ వద్ద భారీ సీపేజీ ఏర్పడింది. బ్యారేజీ పునాదుల (రాఫ్ట్) కింద నిర్మించిన కటాఫ్ వాల్స్‌కి పగుళ్లు వచ్చి ఉంటాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ ఆథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఏర్పాటు చేసిన నిపుణుల కమిటీ తేల్చిచెప్పింది. లీకేజీలు పునరావృతం కావడాన్ని చూస్తే ఎగువ, దిగువ కటాఫ్ వాల్స్‌లో ఏదో ఒకదానికి లేదా రెండింటికీ పగుళ్లు వచ్చి ఉంటాయని స్పష్టం చేసింది. అన్నారం లీకేజీలపై ఎన్డీఎస్ఏ (దక్షిణాది) ప్రాంతీయ డైరెక్టర్ ఆర్.తంగమణి, కేంద్ర జల వనరుల సంఘం (సీడబ్ల్యూసీ) హైదరాబాద్ డైరెక్టర్లు రమేశ్‌కుమార్, దేవేందర్‌రావుతో కమిటీని ఏర్పాటు చేసి అధ్యయనం జరిపించింది. అన్నారం బ్యారేజీలో 28, 38 గేట్లకి ముందు ప్రాంతం నుంచి నీళ్లు లీక్ అవుతుండటాన్ని గుర్తించి, ఇసుక బస్తాలు, బౌల్డర్లను వేసి రింగ్ బండ్ నిర్మించారు. అన్నారం గేట్ల ముందుభాగంలో కాంక్రీట్ బ్లాకులతో అప్రాన్ నిర్మించగా, దాదాపు బ్లాకులన్నీ కొట్టుకుపోయి, చెల్లాచెదురయ్యాయి. ఈ బ్లాకులకు దిగువన ఇన్‌వర్టెడ్ ఫిల్టర్ సైతం కొట్టుకుపోయింది. మరోవైపు అన్నారం బ్యారేజీని 2019 జూన్‌లో ప్రారంభించగా అదే ఏడాది నవంబరులో సీపేజీలు బయటపడ్డాయి. 2020, 2021లోనూ ఇదే తరహా లీకులను గుర్తించగా పాలిమర్ ఆధారిత సీలంట్ అనే రసాయన మిశ్రమంతో కట్టడి చేశారు. స్టీల్‌తో రీ-ఎన్‌ఫోర్స్ చేయని పిల్లర్లకు పగుళ్లు వచ్చి ఎగువ, దిగువ కటాఫ్ వాల్స్‌కు సైతం గండ్లు పడి ఉండే అవకాశం ఉందని ఎన్‌డీఎస్ఏ గతంలోనే గుర్తు చేసింది. స్టీల్ కలిగి ఉన్న, స్టీల్ లేని పిల్లర్ల మధ్య దృఢత్వంలో వ్యత్యాసంతో కటాఫ్ వాల్స్‌కి నిలువనా పగుళ్లు వచ్చి ఉండే అవకాశం సైతం ఉందని అనుమానం వ్యక్తం చేసింది. గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్స్ (జీపీఆర్) వంటి సాంకేతిక లేదా ఇతర పద్ధతులను వినియోగించి సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించాలని, కటాఫ్ వాల్స్‌కి లేదా కటాఫ్‌వాల్స్-ర్యాఫ్ట్ మధ్య పగుళ్లు ఎక్కడ వచ్చాయో నిర్ధారించాలని కూడా సూచించింది. సమస్యలకు మూల కారణాన్ని గుర్తించి నివారణ చర్యలు తీసుకునే వరకు బ్యారేజీలో నీళ్లను నిల్వ చేయొద్దని స్పష్టం చేసింది. తాజాగా మరమ్మతులు చేసి, కొంత నీటిని నిల్వ చేయగా, భారీ సీపేజీతో బ్యారేజీనంతా ఖాళీ చేశారు.

తుమ్మిడిహెట్టిపై కదలిక

» డిసెంబరు కల్లా టెండర్లు పూర్తి

» వెనువెంటనే నిర్మాణం ప్రారంభం

హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో భాగంగా కట్టిన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నిర్మాణ/నిర్వహణ/డిజైన్ లోపాల కారణంగా వాటిపై ఆధారపడిన పంప్‌హౌస్‌లు నిరర్థకంగా మారాయని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఎన్నికల మ్యానిఫెస్టోలో పేర్కొన్న ప్రకారం పాత ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును తెరమీదకు తెచ్చేందుకు సన్నద్ధమైంది. ఆ ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణం దిశగా అడుగులు శరవేగంగా పడుతున్నాయి. ప్రాణహిత నదిపై 148 మీటర్ల ఎత్తుతో తుమ్మిడిహెట్టి బ్యారేజీని నిర్మించేందుకు మహారాష్ట్ర అనుమతి ఇచ్చినప్పటికీ ప్రాజెక్టుల రీ డిజైనింగ్‌లో భాగంగా దాన్ని గత ప్రభుత్వం పక్కనపెట్టింది. కాళేశ్వరం పేరుతో గోదావరి మీదే మూడు బ్యారేజీల నిర్మాణం చేపట్టింది. అయితే, గతేడాది(2023) అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయింది. సరిగ్గా అవే డిజైన్లతో నిర్మించిన అన్నారం, సుందిళ్ల కూడా సురక్షితం కాదని, వీటిలో ఎట్టి పరిస్థితుల్లోనూ పూర్తి స్థాయిలో నీటి నిల్వ చేయరాదని ఎన్‌డీఎస్ఏ స్పష్టం చేసింది. డిజైన్, నిర్మాణ, నిర్వహణ లోపంతోఈబ్యారేజీలు నిరర్థకంగా మారాయని తేల్చడం కొత్త ప్రభుత్వం ఆలోచనలకు కలిసి వచ్చింది. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజీ కడితే.. 71.5 కిలోమీటర్ల దాకా ఎలాంటి మోటార్లు లేకుండా కాలువల ద్వారా నీటిని నడిపించి మైలారం వరకు తీసుకొస్తారు. అక్కడి నుంచి నీటిని చిన్న పంపులతో ఎత్తిపోస్తే మరో 44 కిలోమీటర్లలోని ఎల్లంపల్లి డ్యామ్‌లోకి నీళ్లు వచ్చి పడతాయి. తుమ్మిడిహెట్టి నుంచి మైలారం దాకా 71.5 కిలోమీటర్ల మేర ఇప్పటికే కాలువలు తవ్వారు. లైనింగ్ కూడా పూర్తయింది. బ్యారేజీ కడితే చాలు.

డిసెంబరులో పనులకు అవకాశం

గోదావరిలో బేసిన్‌లో ప్రాణహిత ఉపనదికి ఏటా గ్యారెంటీగా వరదలు వస్తాయి. మిగతా అన్ని ఉపనదులకు జూన్ నుంచి నవంబరు దాకా నీరు ఉంటే, ప్రాణహితలో ఫిబ్రవరి దాకా ఉంటుంది. డిసెంబరులోపు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి, అదే నెలలో నిర్మాణ పనులకు ప్రభుత్వం ఉపక్రమించే అవకాశం ఉంది. ఇక మైలారం వద్ద ఏర్పాటు చేసే పంప్‌హౌస్ కోసం కాళేశ్వరం అదనపు టీఎంసీ కోసం ఏర్పాటు చేసిన పంపులు/మోటార్లు వాడుకునే అవకాశాలున్నాయని తెలుస్తోంది.

ఆరు నెలలు తిరక్కుండానే

అదే 'ఆర్డర్'!

» మేడ్చల్ డీఐజీగా మళ్లీ మధుసూదన్

» రిజిస్ట్రేషన్ల శాఖలో చర్చనీయాంశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రిజిస్ట్రేషన్ల శాఖలో వింత పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి ఉత్తర్వులు జారీచేశారో.. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ ఉన్నతాధికారులు అదే రకమైన ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ)గా జి.మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ గతేడాది ఆగస్టు 23న జీవో నంబరు 279ని రిజిస్ట్రేషన్ల శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్ జారీ చేశారు. ఇది వివాదాస్పదమైంది. అయితే ఆరు నెలలు తిరక్కుండానే ఈ నెల 10న మేడ్చల్ డీఐజీగా మళ్లీ మధుసూదన్‌రెడ్డిని నియమిస్తూ మరోమారు ఉత్తర్వులు జారీకావడం రిజిస్ట్రేషన్ శాఖ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. గతేడాది ఆగస్టు నుంచి రిజిస్ట్రేషన్ల శాఖలో మేడ్చల్ డీఐజీ కుర్చీ కోసం ఇద్దరు అధికారుల మధ్య పోరు నడుస్తోంది. ఆరుగురు డీఐజీల బదిలీల్లో భాగంగా నిజామాబాద్ డీఐజీగా ఉన్న మధుసూదన్‌రెడ్డిని కరీంనగర్‌కు బదిలీచేస్తూ గత ప్రభుత్వం జీవో నంబరు 275 జారీ చేసింది. అయితే అదే రోజు సాయంత్రం డీఐజీ మధుసూదన్‌రెడ్డిని మేడ్చల్ డీఐజీగా నియమిస్తూ జీవో నంబరు 279ని జారీ చేశారు. జీవో నంబరు 275 మేరకు మేడ్చల్ డీఐజీగా నియమితులైన ఎం.రవీందర్‌ను జీవో 279లో కరీంనగర్‌కు డీఐజీగా మార్పు చేయడం వివాదాస్పదమైంది. ఈ విషయమై రవీందర్ హైకోర్టును ఆశ్రయించగా జీవో 279ని రద్దు చేస్తూ నాలుగు నెలల క్రితం తీర్పు వెలువడింది. ఈ జీవో రద్దు కావడంతో జీవో నంబరు 275ను అమలు చేయాల్సి ఉన్నా అలా జరగలేదు. వీరిద్దరిని రిజిస్ట్రేషన్ల ముఖ్య కార్యదర్శికి రిపోర్టు చేయాలని కమిషనర్ ఆదేశించారు. తాజాగా ఈ నెల 10న ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబరు 74లోనూ, గతేడాది ఆగస్టులో జారీచేసిన జీవో నంబరు 279లో సమాచారమే యథాతథంగా ఇవ్వడం చర్చనీయాంశమైంది. డీఐజీ రవీందర్ స్వస్థలం కరీంనగర్ కావడంతో ఆయనకు అక్కడ పోస్టింగు ఇవ్వడం నిబంధనలను తుంగలో తొక్కడమేనని ఉద్యోగ సంఘాలు అంటున్నాయి. అలాగే, గతంలో మధుసూదన్‌రెడ్డిని మూడోసారి మేడ్చల్ డీఐజీగా నియమించడాన్నీ ఆక్షేపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వంలో కీలకంగా వ్యవహరిస్తున్న నల్గొండ జిల్లాకు చెందిన ఇద్దరు నేతలు ఈ నియామకాల వెనుకున్నట్లు తెలుస్తోంది.

టీఎస్ ఈఏపీసెట్‌కు నేడు నోటిఫికేషన్


» 26 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే టీఎస్ ఈఏపీసెట్- 2024 నోటిఫికేషన్ బుధవారం విడుదల కానుంది. ఈ విషయాన్ని సెట్ కన్వీనర్ డీన్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈనెల 26వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. మరిన్ని వివరాల కోసం eapcet.tsche.ac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని కన్వీనర్ వెల్లడించారు.

ప్రైవేటులో పెరుగుతున్న సిజేరియన్లు

» ప్రతి గంటకూ 11 సర్జరీలు.. 83 శాతం ప్రసవాలు అవే

» గతంలో 78 శాతమే.. 8 జిల్లాల్లో 90 శాతానికిపైనే



హైదరాబాద్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సిజేరియన్ ఆపరేషన్లు గతంతో పోలిస్తే ఐదు శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రైవేటు దవాఖానాల్లో ప్రతి వంద ప్రసవాల్లో 83 సీసెక్షన్లే. గతంలో ఆ సంఖ్య 78 శాతంగా ఉండేది. తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖ ఈబర్త్ పోర్టల్‌లో నమోదైన గణాంకాలివి. ఆ పోర్టల్‌లో జననాల వివరాలతో పాటు ఏ తరహా ప్రసవాలు జరుగుతున్నాయో కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. దానిప్రకారం ప్రైవేటులో కేవలం 17 శాతమే సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయి. దీన్ని సర్కారు తీవ్రంగా పరిగణిస్తోంది. ఈమేరకు వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్.. దీనిపై మంగళవారం అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రామ్ ఆఫీసర్స్‌తో సమీక్ష నిర్వహించారు. ప్రైవేటులో సీ సెక్షన్స్ పెరగడంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. గత సర్కారు ప్రభుత్వ ఆస్పత్రులతో పాటు ప్రైవేటులో జరిగే సీ సెక్షన్స్‌పై దృష్టిసారించి, వాటిని తగ్గించే ప్రయత్నం చేసింది. దాంతో సీ సెక్షన్స్ తగ్గాయి. ఇప్పుడు పర్యవేక్షించకపోవడంతో ప్రైవేటులో సర్జరీలు బాగా పెరిగాయన్న భావన వ్యక్తమవుతోంది.

- ఈబర్త్ పోర్టల్ ప్రకారం జనవరి నెలలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రైవేటు ఆస్పత్రుల్లో 9855 డెలివరీలు జరిగాయి. అందులో 1683 సహజ ప్రసవాలు. 8172 సిజేరియన్లు.
- రోజుకు సగటున 272 సీ సెక్షన్స్ జరిగాయి. అంటే ప్రతి గంటకూ సగటున 11 ఆపరేషన్లు.
- 8 జిల్లాల్లో 90 శాతం పైగా సిజేరియన్లు జరుగుతుండగా.. మరో 17 జిల్లాల్లో ఆ సంఖ్య 80 శాతానికి పైగా ఉంది. మిగిలిన జిల్లాల్లో 68-78 శాతం మధ్య సీ సెక్షన్స్ జరుగుతున్నాయి. అంటే ప్రైవేటు ఆస్పత్రుల్లో ఏ జిల్లాల్లో చూసినా సుమారుగా 70 శాతం ఆపరేషన్స్ జరుగుతున్నట్లే.
- రాష్ట్రంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో అత్యధిక సిజేరియన్స్ యాదాద్రి జిల్లాల్లో జరుగుతున్నాయి. ఆ జిల్లాలో జనవరిలో 94 ప్రసవాలు జరగ్గా.. అందులో 91 సిజేరియన్ డెలివరీలే. సహజ ప్రసవాలు కేవలం మూడే. ఆ తర్వాత స్థానంలో సిరిసిల్ల జిల్లా ఉంది. అక్కడ 180 ప్రసవాలు జరగ్గా సహజ ప్రసవాలు ఎనిమిదే.
- మహబూబాబాద్ జిల్లాల్లో 96 శాతం, జయశంకర్ జిల్లాల్లో 93.55 శాతం, వికారాబాద్, జనగాం జిల్లాల్లో 92 శాతం, కామారెడ్డి, మంచిర్యాలలో 90శాతంపైగా సిజేరియన్ సర్జరీలు జరిగాయి.
- కిందటి సంవత్సరం వరకూ దేశంలోనే అత్యధిక సిజేరియన్ ఆపరేషన్స్ జరుగుతున్న జిల్లాగా కరీంనగర్‌కు పేరుంది. ఈసారి ఆ జిల్లా రాష్ట్రస్థాయిలో 11వ స్థానంలో నిలిచింది.
- రాష్ట్రంలో ప్రైవేటు ఆస్పత్రుల్లో అతి తక్కువ సిజేరియన్లు జరుగుతున్న జిల్లాలు మహబూబ్‌నగర్ (68 శాతం), వనపర్తి (69 శాతం).

ముహూర్తాల పేరుతో..

చాలామంది దంపతులు తమ వంశాంకురం ఏదైనా మంచి రోజునో, ఫలానా గ్రహస్థితి ఉన్నప్పుడో పుట్టాలని.. అలా జన్మిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని గట్టిగా నమ్ముతున్నారు. ఆ రోజు, ఆ టైం రాగానే ప్రైవేటు ఆస్పత్రులకు తీసుకెళ్లి సిజేరియన్ చేపిస్తున్నారు. అదే ప్రభుత్వ ఆస్పత్రుల్లో అయితే అలా టైం ప్రకారం కాన్పు చేయడానికి వీలుండదు. సాధారణ కాన్పు అయితే రూ.30వేలలోపే అయిపోతుంది. అదే సిజేరియన్ అయితే రూ.50వేల దాకా వసూలు చేయొచ్చు. అందుకే కొన్ని ప్రైవేటు ఆస్పత్రులు.. అవసరం లేకపోయినా బిడ్డ అడ్డం తిరిగిందనో మరో కారణమో చూపి సిజేరియన్ చేసి డబ్బులు దండుకుంటున్నాయన్న ఆరోపణలున్నాయి.

జగజ్యోతి ఆస్తులు 15 కోట్లపైనే



జగజ్యోతి ఇంట్లో అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

హైదరాబాద్/హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నెక్లెస్‌లు, వడ్డాణాలు, కమ్మలు, రింగులు, గాజులు, ముక్కుపుడకలు.. ఓ చిన్న సైజు దుకాణాన్ని తలపించేలా రకరకాల డిజైన్లలో బంగారు ఆభరణాలు.. హ్యాండ్‌బ్యాగులు, పిల్లోకవర్లతోపాటు ఎక్కడపడితే అక్కడ నోట్ల కట్టలు.. ఇదీ గిరిజన సంక్షేమ శాఖ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ ఆఫ్ ఇంజనీర్ (ఎస్ఈ) కె.జగజ్యోతి ఇంట్లో పరిస్థితి. ఇవన్నీ చూసి తనిఖీలకు వెళ్లిన ఏసీబీ అధికారులే కంగు తిన్నారు. మాసబ్‌ట్యాంక్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో సోమవారం ఓ కాంట్రాక్టరు నుంచి రూ.84వేలు లంచం తీసుకుంటూ జగజ్యోతి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన విషయం తెలిసిందే. అనంతరం ఏసీబీ అధికారులు ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి, అక్రమాస్తుల చిట్టాను బయటపెట్టారు. తనిఖీల్లో రూ.1.51 కోట్లు విలువైన మూడున్నర కిలోలపైగా బంగారు ఆభరణాలు, రూ. 65.50లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. జగజ్యోతికి గుడివాడ, కర్నూలు, కందుకూరు, హైదరాబాద్ శివారులోని హయత్‌నగర్‌లో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాలు, అల్వాల్ సమీపంలోని రాంపల్లిలో ఇండిపెండెంట్ ఇల్లు ఉన్నట్లు గుర్తించారు. మరికొన్ని ఇళ్లస్థలాలకు కొంత నగదు అడ్వాన్సుగా చెల్లించినట్లు ఆధారాలు సేకరించారు. తనిఖీల్లో ప్రాథమికంగా గుర్తించిన ఆస్తుల విలువ సుమారు రూ.15కోట్లకుపైగా ఉంటుందని ఏసీబీ అధికారులు వెల్లడించారు. మెహిదీపట్నంలోని జగజ్యోతి ఇంట్లో తనిఖీలు చేసేటప్పుడు పిల్లో కవర్లు, హ్యాండ్ బ్యాగులతోపాటు ఎక్కపడితే అక్కడ నోట్ల కట్టలు ఉన్నాయని, చిన్నసైజు దుకాణంలో ఉన్నట్లుగా సరికొత్త డిజైన్లలో బంగారు ఆభరణాలు ఉన్నాయని వివరించారు. అక్రమ సంపాదనతో జగజ్యోతి ప్రతి నెలా గోల్డ్ స్కీమ్స్‌కు డబ్బులు కడుతున్నట్లు గుర్తించిన అధికారులు.. సంబంధిత రశీదులను స్వాధీనం చేసుకున్నారు. లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడటం, తనిఖీల్లో ఆస్తుల గుట్టు రట్టు కావడంతో షాక్‌కు గురైన జగజ్యోతి.. ఛాతిలో నొప్పిగా ఉందని చెప్పగా ఏసీబీ అధికారులు ఆమెను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం జగజ్యోతి ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించారు.కాగా,జగజ్యోతికి ఏసీబీ ప్రత్యేక కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది. బుధవారం ఆస్పత్రి నుంచి డిశ్చార్జి చేశాక ఆమెను జైలుకు తరలించనున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.



పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ), కోల్‌కతాలోని సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్(ఎస్ఆర్ఎఫ్‌టీఐ) ఉమ్మడిగా 'జాయింట్ ఎంట్రెన్స్ టెస్ట్(జెట్) 2023-24' నోటిఫికేషన్‌ను విడుదల చేశాయి. దీని ద్వారా ఫిల్మ్, టెలివిజన్ విభాగాల్లో పీజీ డిప్లొమా, యూజీ/పీజీ సర్టిఫికెట్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ టెస్ట్‌ని ఏ, బీ, సీ గ్రూప్‌ల వారీగా ఎఫ్‌టీఐఐ నిర్వహిస్తుంది. అభ్యర్థులు ఒక్కో గ్రూప్ నుంచి ఒక కోర్సు చొప్పున గరిష్ఠంగా మూడు కోర్సులకు అప్లయ్ చేసుకోవచ్చు. దేశవ్యాప్తంగా 28 నగరాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు. టెస్ట్‌లో సాధించిన స్కోర్ ఆధారంగా ఇంటర్వ్యూలు, మెడికల్ టెస్ట్ నిర్వహించి అర్హులను ఎంపిక చేస్తారు. జెట్ 2023 స్కోర్ వ్యాలిడిటీ 2024 డిసెంబరు 31 వరకు ఉంటుంది.

ఫిల్మ్ అండ్ టెలివిజన్ సంస్థల్లో ప్రవేశానికి జెట్

గ్రూప్-ఏ కోర్సులు(పీజీ డిప్లొమా)

- రెండేళ్ల వ్యవధి గల ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్, మూడేళ్ల వ్యవధి గల ప్రొడక్షన్ ఫర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్, యానిమేషన్ సినిమా కోర్సులను ఎస్ఆర్ఎఫ్‌టీఐ అందిస్తోంది. మూడేళ్ల వ్యవధి గల ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్, రెండేళ్ల వ్యవధి గల స్క్రీన్ యాక్టింగ్, స్క్రీన్ రైటింగ్ (ఫిల్మ్, టీవీ, వెబ్ సిరీస్) కోర్సులను ఎఫ్‌టీఐఐ అందిస్తోంది.
- మూడేళ్ల వ్యవధి గల యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్ అనే యూజీ సర్టిఫికెట్ కోర్సు కూడా ఎఫ్‌టీఐఐలో ఉంది.

గ్రూప్-బీ కోర్సులు(పీజీ డిప్లొమా)

- డైరెక్షన్ అండ్ స్క్రీన్ ప్లే రైటింగ్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ డిజైన్ కోర్సులు రెండు ఇన్‌స్టిట్యూట్‌లలో అందుబాటులో ఉన్నాయి. ఒక్కో కోర్సు వ్యవధి మూడేళ్లు. వీటితో పాటు గ్రూప్-ఏ విభాగంలోని ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్, స్క్రీన్ యాక్టింగ్ కోర్సులను మాస్టర్స్ డిగ్రీకి సమానమైనవిగా ఏఐయూ గుర్తించింది.

గ్రూప్-సీ కోర్సులు



- **పీజీ డిప్లొమా:** ఎలక్ట్రానిక్ అండ్ డిజిటల్ మీడియా మేనేజ్‌మెంట్‌కు సంబంధించి డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్, సినిమాటోగ్రఫీ, ఎడిటింగ్, సౌండ్, రైటింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కోదాని వ్యవధి రెండేళ్లు. వీటిని ఎస్ఆర్ఎఫ్‌టీఐ అందిస్తోంది.
- **పీజీ సర్టిఫికెట్:** డైరెక్షన్, ఎలక్ట్రానిక్ సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్ అండ్ టెలివిజన్ ఇంజనీరింగ్ కోర్సులు ఉన్నాయి. ఒక్కోదాని వ్యవధి ఏడాది. ఇవి ఎఫ్‌టీఐఐలో అందుబాటులో ఉన్నాయి. వీటికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

అర్హత వివరాలు

పీజీ డిప్లొమా(ఆర్ట్ డైరెక్షన్ అండ్ ప్రొడక్షన్ డిజైన్) కోర్సుకు డిగ్రీ(అప్లయిడ్ ఆర్ట్/ఆర్కిటెక్చర్/పెయింటింగ్/స్కల్ప్చర్/ఇంటీరియర్ డిజైన్) ఉత్తీర్ణులై ఉండాలి. యూజీ సర్టిఫికెట్(యానిమేషన్ అండ్ విజువల్ ఎఫెక్ట్స్ డిజైన్) కోర్సుకు ఇంటర్/పన్నెండోతరగతి/ కనీసం రెండేళ్ల వ్యవధి గల డిప్లొమా పూర్తి చేసి ఉండాలి. మిగిలిన కోర్సులకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

జెట్ 2023-24 వివరాలు

- మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం 3 గంటలు. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. మొదటి పేపర్లో రెండు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో 20 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు; రెండో పార్ట్‌లో 20 మల్టిపుల్ సెలెక్ట్ ప్రశ్నలు అడుగుతారు. సమాధానాలను ఓఎంఆర్ పత్రం మీద గుర్తించాలి. రెండో పేపర్ డిస్క్రిప్టివ్ టైప్‌లో ఉంటుంది. దీనికి 60 మార్కులు ప్రత్యేకించారు.
- రెండు పేపర్లలో సాధించిన మార్కుల ఆధారంగా షార్ట్‌లిస్ట్ చేసిన అభ్యర్థులను ఓరియంటేషన్, ఇంటర్వ్యూలకు పిలుస్తారు. రిటెన్ టెస్ట్ స్కోర్‌కు 20 శాతం, ఓరియంటేషన్‌కు 50 శాతం, ఇంటర్వ్యూ స్కోర్‌కు 30 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.
- స్క్రీన్ యాక్టింగ్ కోర్సుకు మాత్రం రిటెన్ టెస్ట్ స్కోర్, ఆడిషన్ స్కోర్‌ల ఆధారంగా మొదటి రిజల్ట్; ఓరియంటేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా రెండో రిజల్ట్ రూపొందిస్తారు. రెంటికీ సమాన వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అభ్యర్థులు అన్ని ప్రక్రియల్లో తప్పనిసరిగా పాల్గొనాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** ఒక కోర్సుకు రూ.2,000 (రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.600); రెండు కోర్సులకు రూ.3000(రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.900); మూడు కోర్సులకు రూ.4,000(రిజర్వ్‌డ్ అభ్యర్థులకు రూ.1200)
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 17
- **అడ్మిట్ కార్డ్‌ల డౌన్‌లోడింగ్:** మార్చి 27 నుంచి ఏప్రిల్ 5 వరకు
- **గ్రూప్-ఏ కోర్సులకు ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 6
- **గ్రూప్-బీ, గ్రూప్-సీ కోర్సులకు ఎగ్జామ్ తేదీ:** ఏప్రిల్ 7
- **తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు పరీక్ష కేంద్రం:** హైదరాబాద్
- **వెబ్‌సైట్:** ftii.ac.in, srfti.ac.in

ఐఐఎఫ్‌టీలో సర్టిఫికెట్ ప్రోగ్రామ్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- ఆన్‌లైన్ సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్ అండ్ కస్టమ్స్ రెగ్యులేషన్స్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండు నెలలు. ఇందులో 18 మాడ్యూల్స్ ఉంటాయి. వారాంతాల్లో ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒకటింబావు వరకు ఆన్‌లైన్ ఇంటరాక్టివ్ సెషన్స్ నిర్వహిస్తారు. హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో లెక్చర్స్ ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ స్టడీ అనాలిసిస్, అసైన్‌మెంట్స్, పోర్ట్ విజిట్స్ ఉంటాయి. ఎంట్రీ లెవెల్/మిడిల్ లెవెల్/సీనియర్ లెవెల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్‌లు, వర్కింగ్ ప్రొఫెషనల్స్, ఆంత్రప్రెన్యూర్స్‌కు ఈ ప్రోగ్రామ్ ఉపయోగకరంగా ఉంటుంది.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: కీ ఎలిమెంట్స్-గేజ్ రిస్క్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ లాజిస్టిక్స్, మల్టీమోడల్ ట్రాన్స్‌పోర్టేషన్స్, ఓషన్ ట్రాన్స్‌పోర్టేషన్, గ్రీన్ సప్లయ్ చెయిన్ మేనేజ్‌మెంట్/సస్టయినబుల్ లాజిస్టిక్స్, మెరైన్ కార్గో ఇన్సూరెన్స్, ఇంటర్నేషనల్ లాజిస్టిక్ కాంట్రాక్ట్స్-డ్రాఫ్టింగ్, ప్యాకేజింగ్-లేబులింగ్-మార్కింగ్-ఆపరేషన్స్, మారిటైమ్ ఫ్రాడ్స్-రీసెంట్ డెవలప్‌మెంట్స్, వేర్‌హౌసింగ్ అండ్ మెటీరియల్ హ్యాండిలింగ్, ట్రాన్స్‌పోర్ట్ డాక్యుమెంట్స్-ట్రేడ్ లాజిస్టిక్స్, షిప్పింగ్ అండ్ ఫ్రైటింగ్ ప్రాక్టీసెస్, కస్టమ్స్-రూల్స్/రెగ్యులేషన్స్/ప్రొసీజర్స్/లా/యాక్ట్/సర్క్యులర్, ఇంపోర్ట్ ప్రొసీజర్, ఎక్స్‌పోర్ట్ ప్రొసీజర్, ఇండియాస్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్స్ తదితరాలు

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.35,400
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 6
- **వెబ్‌సైట్:** iift.ac.in

ఐఐపీలో ప్యాకేజింగ్ డిప్లొమా

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని కరస్పాండెన్స్ విధానంలో నిర్వహిస్తారు. దీనికి ఏషియన్ ప్యాకేజింగ్ ఫెడరేషన్ గుర్తింపు ఉంది. ప్రోగ్రామ్ వ్యవధి 18 నెలలు(ఏడాదిన్నర). అడ్మిషన్ తీసుకొన్నవారికి ప్యాకేజింగ్ టెక్నాలజీకి సంబంధించిన కోర్సు మెటీరియల్‌తోపాటు మోడల్ ప్రశ్నల బుక్‌లెట్‌ను ఇస్తారు. హైదరాబాద్, అహ్మదాబాద్, ఢిల్లీ, చెన్నై, కోల్‌కతాల్లో ప్రాంతీయ కేంద్రాలు ఉన్నాయి.

ప్రోగ్రామ్ వివరాలు: ఇందులో ఇంట్రడక్షన్ టు ప్రిన్సిపల్ ఆఫ్ ప్యాకేజింగ్ అండ్ మెటీరియల్, రిజిడ్ ప్యాకేజింగ్ మెటీరియల్ అథెసివ్, ప్యాకేజింగ్ మెషినరీ అండ్ ప్రింటింగ్, ప్రొడక్ట్ ప్యాకేజింగ్ అనే నాలుగు పేపర్లు ఉంటాయి. వీటితోపాటు ప్రాజెక్ట్ వర్క్ కూడా ఉంటుంది. ప్రోగ్రామ్ చివరలో ఎగ్జామ్ నిర్వహిస్తారు. ఒక్కో పేపరకు 100 మార్కులు నిర్దేశించారు. ప్రతి పేపర్‌లో 40 శాతానికి తగ్గకుండా మొత్తమ్మీద 50 శాతం మార్కులు సాధించినవారికి సర్టిఫికెట్ ప్రదానం చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ/సైన్స్/కామర్స్/ఆర్ట్స్ విభాగాల్లో డిగ్రీ ఉత్తీర్ణులు; గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంజనీరింగ్/టెక్నాలజీ విభాగాల్లో డిప్లొమా పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థులకు ప్రొడక్షన్, పర్చేజ్, మార్కెటింగ్, క్వాలిటీ కంట్రోల్ విభాగాల్లో కనీసం ఏడాది ఇండస్ట్రియల్ అనుభవం ఉండాలి. వయోపరిమితి నిబంధనలు లేవు.

ముఖ్య సమాచారం

- **ప్రోగ్రామ్ ఫీజు:** రూ.77,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.250
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 29
- **వెబ్‌సైట్:** www.iip-in.com


ఐఐఐటీ అలహాబాద్‌లో ఎంబీఏ

అలహాబాద్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ(ఐఐఐటీ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. సంస్థ నిర్వహించే మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్(ఐమ్యాట్) లేదా జాతీయ పరీక్ష స్కోర్ ఆధారంగా స్క్రీనింగ్ చేసిన అభ్యర్థులకు పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు చాలు. మ్యాట్(2023 డిసెంబరు)/క్యాట్ 2023/ఎక్స్‌ఏటీ 2024/సీమ్యాట్ 2023/జీమ్యాట్(2019 నుంచి) స్కోర్ ఉండాలి. లేని పక్షంలో సంస్థ నిర్వహించే అడ్మిషన్ టెస్ట్ రాయాల్సి ఉంటుంది. ఈ పరీక్ష సీబీటీ మోడ్‌లో ఉంటుంది. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 10
- **అడ్మిషన్ టెస్ట్ సెంటర్:** ఐఐఐటీ అలహాబాద్ క్యాంపస్
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** మే 29, 30; జూన్ 2
- **ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూన్ 5
- **వెబ్‌సైట్:** www.iiita.ac.in



ఎడ్యు బిట్స్

ఫ్లిప్‌కార్ట్‌తో ఎన్ఎస్‌డీసీ ఒప్పందం

యువతకు ఉపాధి కల్పించే కోర్సుల నిర్వహణ, శిక్షణ, ఉపాధి కల్పనకు సంబంధించి ఫ్లిప్‌కార్ట్, నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్(ఎన్ఎస్‌డీసీ) మధ్య ఒప్పందం కుదిరింది. ఇండియాలో ఈ కామర్స్ రంగంలో అవకాశాలను పొందేందుకు యువతకు ఉచితంగా ఆన్‌లైన్ కోర్సులు, శిక్షణను ఈ రెండు సంస్థలు కలిసి నిర్వహిస్తాయి. ఎన్ఎస్‌డీసీ అక్రెడిటెడ్ సర్టిఫైడ్ కోర్సుల కోసం ఫ్లిప్‌కార్ట్ శిక్షణ, నైపుణ్యం, అప్‌స్కిల్, ప్లేస్‌మెంట్స్ తదితర విషయాల్లో తోడ్పాటును అందిస్తుంది. ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన సప్లయ్ చైన్ ఆపరేషన్స్ అకాడమీ, ప్రాజెక్ట్ బ్రైట్ ఇనీషియేటివ్ కింద ట్రైనింగ్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తుంది. ఎన్ఎస్‌డీసీ నిర్వహించే జాబ్ ఫెయిర్స్‌లో సైతం ఫ్లిప్‌కార్ట్ పాల్గొంటుంది.

గ్రేట్ స్కాలర్‌షిప్స్‌కు ఆహ్వానం

బ్రిటిష్ కౌన్సిల్ - 2024కు సంబంధించి గ్రేట్ స్కాలర్‌షిప్స్‌ను ప్రకటించింది. ఒక్కోటి పదివేల పౌండ్ల విలువైనవి కాగా ప్రత్యేకించి భారతీయ విద్యార్థులకు 26 స్కాలర్‌షిప్స్‌ను ఇస్తున్నారు. ఫైనాన్స్, మార్కెటింగ్, బిజినెస్, సైకాలజీ, డిజైన్, హ్యూమానిటీస్, డ్యాన్స్ తదితరాల్లో పీజీ కోర్సులు చేసే వారికి వీటిని ఉద్దేశించారు. బ్రిటన్‌లోని పాతిక విశ్వవిద్యాలయాలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నాయి. 2024-25 విద్యాసంవత్సరంలో ఆ వర్సిటీల్లో అడ్మిషన్ సాధించిన ఇండియన్ స్టూడెంట్స్ మాత్రమే ఈ స్కాలర్‌షిప్స్ పొందేందుకు అర్హులు. వీటికి ఎంపికైన విద్యార్థులకు ట్యూషన్ ఫీజు కింద ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. మరిన్ని వివరాలకు ఈ వెబ్‌సైట్స్ https://www.britishcouncil.in/study-uk/scholarships/great-scholarships https://study-uk.britishcouncil.org/ చూడవచ్చు.

హైదరాబాద్‌లో ఫిజిక్స్ వాలా 3 ఆఫ్‌లైన్ విద్యాపీఠ్ కేంద్రాలు

హైదరాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో టెక్ ఎనేబుల్డ్ ఆఫ్‌లైన్ విద్యాపీఠ్ కేంద్రాలను ఆరంభించినట్టు ఎడ్యుటెక్ కంపెనీ ఫిజిక్స్ వాలా ప్రకటించింది. మాదాపూర్, హబ్సిగూడ, కూకట్‌పల్లిలో వీటిని ఆరంభించింది.

దేశంలోని 49 పట్టణాల్లో 75 కేంద్రాలు ఈ సంస్థకు చెందినవి ప్రస్తుతం పని చేస్తున్నాయి. జేఈఈ, నీట్ కోసం ఇక్కడ శిక్షణ ఇస్తారు. ఆ ప్రవేశ పరీక్షల కోసం రికార్డ్ చేసిన లెక్చర్లు, ఎన్‌సీఈఆర్‌టీ మెటీరియల్‌కు తోడు సందేహ నివృత్తి, ప్రత్యేక మాడ్యూల్స్, ప్రాక్టీస్ సమస్యల పరిష్కారం తదితరాలన్నీ ఈ ఆఫ్‌లైన్ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని ఫిజిక్స్ వాలా ప్రకటించింది. యూపీలోని నోయిడా కేంద్రంగా ఈ సంస్థ పనిచేస్తున్న విషయం తెలిసిందే.

చిట్టి చిలకమ్మ



తోడేలు తెలివి.. తిరగబడింది!

ఒక అడవిలో తోడేలు ఉండేది. దానికి తెలివి ఎక్కువ. కుందేళ్లను, జింక పిల్లలను తినేది. చూస్తుండగానే అడవిలో ఎండాకాలం వచ్చింది. జంతువులన్నీ వేరే ప్రాంతానికి వెళ్లిపోయాయి. నీళ్ల వెతుక్కుంటూ కొన్ని వెళ్లిపోయాయి. ఈ తోడేలుకు మాత్రం సులువుగా ఆహారం దొరకాలనుకునేది. వేటాడకుండా తినాలనుకునేది. దీంతో అడవిలోంచి ఓ ఊరికి వెళ్లాలనుకుంది.

తోడేలు ఎలాగైనా మేకలనో, గొర్రెలనో పొంచి తినాలనుకుంది. అయితే ఎక్కడ చూసి గొర్రెలు, మేకల మందల దగ్గర వేట కుక్కలు ఉండటంతో భయపడింది. ప్రాణాలు దక్కించుకోవటమే తరువాయి అనుకుని పారిపోయింది. అయితే ఆ ఊరిలోని బలిష్ఠమైన మేకలు, గొర్రెలు చూశాక.. ఊరు వదలి వెళ్లిపోవాలని అనిపించలేదు దానికి. దీంతో ఊరి చుట్టూ చాలా రోజులు తిరిగింది. ఎలాగైనా గొర్రెలను, మేకలను తినాలని నిర్ణయించుకుంది.

అదే ఆలోచనతో తిరిగే తోడేలుకు ఒకరోజు గొర్రె చర్మం దొరికింది. దాన్ని కప్పుకుంది. గొర్రెల గుంపు ఊరికి చేరే వేళ వాటిలో కలసిపోయింది. ఇలా



రోజూ గొర్రెల మందలో వెళ్లి వచ్చేది. ఇక రెండు రోజుల తర్వాత గొర్రెలను తినటం ప్రారంభించింది. 'ఇంత రుచికరమైన ఆహారం ఇక్కడే ఉంది. అనవసరంగా అడవిలో ఉన్నా' అనుకుంది. చూస్తుండగానే మెల్లగా గొర్రెలు మాయం అవుతున్నాయి. గొర్రెలకాపరికి ఈ విషయం అర్థమైంది.

ఒక రోజు తెల్లారుజామున గొర్రెల దగ్గరకకు వెళ్లాడు. ఓ గొర్రెను కటికకు అమ్మాలనుకున్నాడు. గొర్రెల్లో పెద్ద గొర్రెగా ఒకటి కనిపించింది. దాన్ని తీసుకెళ్లమని పురమాయించాడు. అది వాస్తవానికి తోడేలు. ఒక మనిషి ఈ గొర్రె బరువుగా ఉందని భుజాలకు ఎత్తుకున్నాడు. బతుకుజీవుడా.. అనుకుంటూ తోడేలు ఎగిరి దూకి పారిపోయింది. దాని మీద ఉండే చర్మం తోలు కిందపడిపోయింది. ఆ తర్వాత తోడేలు ఆ పక్కకే రాలేదెన్నడూ.


సరైన నీడ ఏది?



7 తేడాలను గుర్తించండి



దారి కనుక్కోండి





డైలీ సుడోకు - 235

4		3		7		5	2	
		2	6					
	6			2	9			7
		9						4
	4						8	
8						6		
3			9	6			4	
					5	2		
	1	7		4		3		9

సుడోకు - 234 సమాధానం

3	8	4	7	9	2	5	6	1
9	7	5	6	4	1	8	2	3
6	1	2	3	5	8	9	4	7
1	4	9	5	2	3	6	7	8
8	5	7	4	6	9	3	1	2
2	6	3	1	8	7	4	5	9
5	2	8	9	1	4	7	3	6
7	9	6	2	3	5	1	8	4
4	3	1	8	7	6	2	9	5

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

బుధవారం • 21 ఫిబ్రవరి 2024

cinema@andhrajyothy.com

సైన్యానికి సెల్యూట్ చేసేలా ఉంటుంది



'కొత్త కథ చూపించాలనే ప్యాషన్‌తో 'ఆపరేషన్ వాలెంటైన్' చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తెస్తున్నాం. ఈ సినిమా చూశాక ప్రేక్షకులు గర్వంగా, గుండెల నిండా దేశభక్తితో మన సైనికులకు సెల్యూట్ చేస్తారు' అని హీరో వరుణ్‌తేజ్ అన్నారు. ఆయన హీరోగా శక్తి ప్రతాప్‌సింగ్ దర్శకత్వం వహించిన చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్'. మాజీ ప్రపంచ సుందరి మానుషి చిల్లర్ కథానాయిక. మార్చి 1న ఈ చిత్రం విడుదలవుతోంది. మంగళవారం ఈ చిత్రం తెలుగు, హిందీ ట్రైలర్స్‌ను రామ్‌చరణ్, సల్మాన్‌ఖాన్ ఆన్‌లైన్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'తెలుగులో ఇదే తొలి ఏరియల్ వార్ డ్రామా. ప్రేక్షకులను ఆద్యంతం ఉత్కంఠకు గురి చేసేలా, అబ్బురపరిచే సన్నివేశాలు ఇందులో చాలా ఉన్నాయి. కచ్చితంగా ఈ సినిమా మిమ్మల్ని అలరిస్తుంది' అన్నారు. మానుషి చిల్లర్ మాట్లాడుతూ 'ఆపరేషన్ వాలెంటైన్ నాకు చాలా స్పెషల్ మూవీ. షూటింగ్‌లో వరుణ్‌తేజ్ సహకారం మరువలేనిది. నా డ్రీమ్ రోల్‌ను చేశాను' అని తెలిపారు. సమష్టి కృషికి రూపం ఈ సినిమా, యాక్షన్ డ్రామా, ఫన్ ఎమోషన్స్ లాంటి అన్ని ఎలిమెంట్స్ ఈ చిత్రంలో ఉన్నాయి అని దర్శకుడు చెప్పారు. ఈ సినిమాలో కీలకమైన పాత్ర చేశాను, విజువల్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటాయి అని నవదీప్ తెలిపారు.

వివి ఆనంద్‌తో అనిల్ సుంకర మరో చిత్రం



'ఊరు పేరు భైరవకోన' చిత్రంతో తాజాగా విజయం పొందిన దర్శకుడు విఐ ఆనంద్‌తో ఆ చిత్ర సమర్పకుడు, నిర్మాత అనిల్ సుంకర మరో సినిమా నిర్మించనున్నారు. ఆనంద్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు అభినందనలు తెలుపుతూ కొత్త చిత్రాన్ని అనౌన్స్ చేశారు అనిల్ సుంకర. 'విఐ ఆనంద్ సూపర్ నేచురల్ అడ్వెంచర్స్ చేయడంలో దిట్ట. కొత్త సినిమా కూడా కథ, సెటప్ పరంగా యూనిక్‌గా ఉంటోతోంది. ఇందులో హీరో, మిగిలిన వివరాలు త్వరలో ప్రకటిస్తాం' అన్నారు. ఈ చిత్రానికి మాటలు: అబ్బూరి రవి, సహ నిర్మాతలు: రాజేశ్ దండా, అజయ్ సుంకర, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికపాటి, నిర్మాతలు: అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర.

గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారుతారా?

త్రిష అసహనం



తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన అన్నాడీఎంకే బహిష్కృత నేత ఏవీ రాజుపై హీరోయిన్ త్రిష మండిపడ్డారు. "గుర్తింపు కోసం ఎంతటి నీచానికైనా దిగజారిపోయే జీవితాలు కొందరివి... ఇలాంటి నీచమైన మనుషులను చూస్తుంటే చాలా అసహ్యంగా ఉంది. దీనిపై త్వరలోనే న్యాయపరంగా కఠిన చర్యలు కోరతాను " అంటూ ఆమె మంగళవారం తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఇటీవల ఏవీ రాజు మీడియాతో మాట్లాడుతూ.. గతంలో ఓ ఎమ్మెల్యే హీరోయిన్ త్రిషకు డబ్బులిచ్చి కూవత్తూరు పంచాయతీ లోని ఓ రిసార్ట్‌కు తీసుకొచ్చారని, ఈ విషయం నటుడు, మాజీ ఎమ్మెల్యే కరుణాస్‌కు తెలుసని అన్నారు. ఈ వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపుతున్నాయి. ఎలాంటి ఆధారాలు లేకుండా త్రిషపై అసభ్యంగా మాట్లాడిన ఏవీ రాజును అరెస్టు చేయాలని నటుడు, దర్శకుడు చేరన్ డిమాండ్ చేశారు. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా బహిరంగంగా సినీ పరిశ్రమలోని సభ్యులు కించపరిచేలా మాట్లాడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, ప్రధాన కార్యదర్శి బీఎస్ స్వామినాథన్ సంయుక్తంగా విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు.

-చెన్నై (ఆంధ్రజ్యోతి)

డాన్‌కు జోడీగా



అగ్రహీరోలందరి సరసన హీరోయిన్‌గా నటిస్తూ వరుస విజయాలను అందుకుంటున్నారు కియారా అద్వాణీ. మరో భారీ చిత్రంలో ఆమె కథానాయికగా అవకాశాన్ని అందిపుచ్చుకున్నారు. రణ్‌వీర్‌సింగ్ హీరోగా తెరకెక్కుతోన్న 'డాన్ 3' చిత్రంలో కియారా కథానాయికగా ఎంపికయ్యారు. ఈ విషయాన్ని దర్శకుడు ఫర్హాన్ అక్తర్ ప్రకటించారు. ఈ చిత్రంలో కియారా పాత్ర శక్తిమంతంగా ఉంటుంది, పోరాట ఘట్టాల్లో ఆమె అలరిస్తారు అని మేకర్స్ చెప్పారు. కియారా తొలిసారి రణ్‌వీర్‌తో జోడీ కడుతున్నారు. ఆమె ప్రస్తుతం తెలుగులో రామ్‌చరణ్ తో 'గేమ్ ఛేంజర్' చిత్రం చేస్తున్నారు.

సవాల్‌గా స్వీకరించా

దీపక్ సరోజ్



పలు తెలుగు చిత్రాల్లో బాల నటుడిగా అలరించిన దీపక్ సరోజ్ ఇప్పుడు 'సిద్ధార్థ్‌రాయ్' చిత్రంతో హీరోగా వెండితెర ఎంట్రీ ఇవ్వబోతున్నారు. యశస్వీ దర్శకత్వంలో ప్రదీప్ పూడి, జయ అడపాక, సుధాకర్ బోయిన నిర్మించారు. ఈ నెల 23న ఈ చిత్రం విడుదలవుతోన్న సందర్భంగా దీపక్ సరోజ్ మీడియాతో ముచ్చటించారు.

- బాల నటుడిగా 'మిణుగురులు' చిత్రంతో నంది పురస్కారం అందుకున్నాను. చదువు పూర్తి అయ్యాక యశస్వీ నన్ను కలసి 'సిద్ధార్థ్ రాయ్' కథ చెప్పారు. కథా నేపథ్యం విని షాక్ అయ్యాను. అసలు ఇలాంటి పాత్ర నేను చేయగలనా అనుకున్నాను. కానీ మా డైరెక్టర్‌ను నమ్మి ముందుకెళ్లాం.
- నాది రొటీన్ హీరోయిజం ఉన్న పాత్ర కాదు. తను చాలా లాజికల్‌గా ఆలోచిస్తాడు. పెద్దగా దేనికీ స్పందించడు. కానీ కొన్ని సందర్భాల్లో చాలా ఎమోషనల్ అవుతాడు. సవాల్‌గా స్వీకరించి ఈ పాత్ర చేశాను.
- 'అర్జున్‌రెడ్డి', 'యానిమల్' చిత్రాలతో మా సినిమాకు పోలికలు లేవు. రెండు భిన్నమైన కథలు. గౌతమ బుద్ధుని తాత్వికత ప్రతిఫలించేలా ఉంటుంది కాబట్టి 'సిద్ధార్థ్‌రాయ్' అనే టైటిల్ పెట్టాం. హీరోగా మరో రెండు సినిమాలు చేస్తున్నాను.

కమెడియన్ కాదు కామిక్ యాక్టర్



హీరో రవితేజ, సుధీర్ కుమార్ కుర్రుతో కలసి నిర్మించిన చిత్రం 'సుందరం మాస్టర్'. హర్ష చెముడు, దివ్య శ్రీపాద ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ సంతోష్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 23న విడుదలవుతోంది. చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా హాజరైన సిద్ధు జొన్నలగడ్డ మాట్లాడుతూ "సుందరం మాస్టర్ ట్రైలర్ చాలా బావుంది. హర్షను కమెడియన్ అనడం నాకు నచ్చదు. ఆయనో కామిక్ యాక్టర్. ఆయన కామెడీ టైమింగ్ అద్భుతం. కొత్తవాళ్లను ప్రోత్సహిస్తున్న రవితేజకు అభినందనలు' అన్నారు. హర్ష మాట్లాడుతూ 'మా సినిమాకు చిరంజీవి గారు ఇచ్చిన మద్దతు మర్చిపోలేను. పదేళ్ల క్రితం ప్రేక్షకుల మధ్యలో ఉన్న నేను ఇప్పుడు ఇలా వేదికపై ఉన్నాను. మనం గట్టిగా అనుకుంటే ఏదైనా సాధించగలం' అన్నారు. ఈ సినిమా ఎంత పెద్ద హిట్ అవుతుందో తెలియదు కానీ మా అందరికీ గౌరవాన్ని తీసుకొస్తుంది అని దర్శకుడు చెప్పారు. హర్ష వల్లే మేం ఈ రోజు ఇక్కడ నిలబడగలిగాం, ఈ సినిమా అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది అని సుధీర్ కుమార్ తెలిపారు.

రెండు ఫ్లాట్స్ కొన్న మృణాల్



'సీతారామం', 'హాయ్ నాన్న' చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందిన బాలీవుడ్ భామ మృణాల్ ఠాకూర్ ప్రస్తుతం విజయ్ దేవరకొండ సరసన 'ఫ్యామిలీ స్టార్' లో నటిస్తోంది. అలాగే కొన్ని బాలీవుడ్ చిత్రాల్లో కూడా నటిస్తూ బిజీగా ఉంది. దీపం ఉండగానే ఇల్లు చక్క బెట్టుకోవాలి.. అనే పెద్దల మాటను ఆచరణలో పెడుతూ ఆమె ఇటీవల ముంబైలోని అంధేరి వెస్ట్‌లో ఓబరాయ్ స్ప్రింగ్స్ అపార్ట్‌మెంట్‌లో ఖరీదైన ఫ్లాట్లు రెండు కొనుగోలు చేసింది. ఒక్కో ఫ్లాట్ ఖరీదు రూ. 5 కోట్లు. ఈ రెండు ఫ్లాట్లూ కంగనా రనౌత్ కుటుంబ సభ్యులవే కావడం గమనార్హం. గత నెల 25న ఈ రెండు ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది.



ఉత్కంఠ పెంచి వినోదం పంచేలా



అర్జున్ కల్యాణ్, కుషిత కల్లపు హీరో హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'బాబు నంబర్ వన్ బుల్‌షిట్ గై'. లక్ష్మణవర్మ దర్శకత్వంలో దండు దిలీప్ కుమార్ రెడ్డి నిర్మించారు. మార్చి 8న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అర్జున్ కల్యాణ్ మాట్లాడుతూ 'హీరోగా నన్ను మరో మెట్టు ఎక్కించే చిత్రమిది. థ్రిల్లర్, డ్రామా ఉన్న కథతో మూడు భాషల్లో తెరకెక్కించాం' అని తెలిపారు. 'దిలీప్‌గారు రాజీ పడకుండా సినిమాను నిర్మించారు. ఉత్కంఠ కలిగించడంతో పాటు వినోదం పంచేలా ఉంటుంది. నటీనటులు, టీమ్ అంతా చాలా కష్టపడి ఒక మంచి సినిమాను రూపొందించాం. మా సినిమాను ఆదరించాలి' అని దర్శకుడు ప్రేక్షకులను కోరారు. కుటుంబంతో కలసి చూసేలా ఈ సినిమా ఉంటుందని కుషిత చెప్పారు. దర్శకుడు సాయిరాజేశ్, నిర్మాత ఎస్కేఎన్, వికేక్ కూచిబొట్ల ముఖ్య అతిథులుగా పాల్గొని సినిమా ఘనవిజయం అందుకోవాలని ఆకాంక్షించారు.

లవ్ రొమాంటిక్ థ్రిల్లర్



మేఘశ్యామ్, రేఖ నిరోషా జంటగా రూపుదిద్దుకొన్న 'వాస్తవం' చిత్రం విడుదలకు సిద్ధమైంది. జీవన్ బండి దర్శకత్వంలో ఆదిత్య ముద్గల్ ఈ సినిమా నిర్మించారు. మంగళవారం టీజర్‌ను విడుదల చేసిన అనంతరం నిర్మాత మాట్లాడుతూ 'లవ్ రొమాంటిక్ థ్రిల్లర్‌గా చిత్రం రూపుదిద్దుకుంది. సినిమా మీద ఇష్టంతో చాలా కష్టపడి తీశాం. ప్రేక్షకుల ఆశీస్సులు కోరుకుంటున్నాం' అన్నారు. 'ఈ సినిమాలో ప్రతి చిన్న క్యారెక్టర్ గుర్తుండి పోతుంది. అందరి సహకారంతో మంచి సినిమా తీశాను. తప్పకుండా హిట్ అవుతుందనే నమ్మకం ఉంది' అని చెప్పారు దర్శకుడు. ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించి, హిట్ చేయాలని హీరో మేఘశ్యామ్, హీరోయిన్ రేఖ నిరోషా కోరారు.

మెప్పించే ముఖ్య గమనిక

విరాన్ ముత్తంశెట్టి, లావణ్య జంటగా నటించిన చిత్రం 'ముఖ్య గమనిక'. వేణు మురళీధర్ వి. దర్శకత్వంలో రాజశేఖర్, సాయికృష్ణ నిర్మించారు. ఈ నెల 23న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు



ముఖ్య అతిథిగా హాజరైన హీరో విష్వక్‌సేన్ మాట్లాడుతూ 'కుటుంబ నేపథ్యాన్ని పక్కనపెట్టి తన కష్టంతో పైకి రావాలనుకుంటున్నాడు విరాన్. ఈ సినిమాతో ఆయన సక్సెస్ కొట్టాలి' అని ఆకాంక్షించారు. విరాన్ మాట్లాడుతూ 'ప్రేక్షకులకు నచ్చే అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. అల్లు అర్జున్ నాకు అందించిన సహకారం మరువలేనిది' అన్నారు. వేణు మురళీధర్ మాట్లాడుతూ 'విరాన్, లావణ్య జంట ఈ సినిమాకు ప్రత్యేకాకర్షణ. కిరణ్ సంగీతం ప్రేక్షకులను అలరిస్తుంది' అని చెప్పారు.

